UNIVERSAL LIBRARY
OU_204785
UNIVERSAL LIBRARY

శ్రీ కృష్ణపరబ్రహ్మణేనమః

# పృథ్వీ సంయుక్త

(చరిత్రాత్మక నాటకము)

శ్రీ కృష్ణా బుక్ డిపో,
రాజమండ్రి.

ఇది

సుహృదయులును

స్వార్థత్యాగులును

అగు దేశభక్తులకు

సమర్పణము.

# అసలు సంగతి.

ఉద్రేకపూరిత జీవితమున హెచ్చుతగ్గులు గాంచు వానికి చరిత్రాత్మకనాటకములు వీక్షించుట కానందముగ నుండును. సంఘసంస్కరణమునకు సాంఘిక [Social] రూపకము లవసరమయినను ప్రస్తుత పరిస్థితులకు వీరరసప్రధానములై త్యాగపూరితములైన చారిత్రికనాటకముల యవసరముకూడ లేకపోలేదనిన యభిప్రాయముతో నీ నాటకము తయారుచేసి, నాటకానుభవజ్ఞులచేత [Plot] పన్నిక యవసరమున్నంతవరకు మార్పుచేయించి, తగుసమర్థులకు తగినప్రతిఫలమొసంగి, గద్యమునకు మెరుగుపెట్టించి పద్యములు వ్రాయించితిని.

సుహృదయులగు నాటకసామాజికుల యాదరాభిమానములంది ఆ యా చోట్ల ప్రదర్శనభాగ్య మందినచో నీ కృతి యచిరకాలము ననేవన్నెకెక్కి నా వ్యయప్రయాసల సార్థకపరచగలదని నా యాశయము.

గుర్రాల నారాయణరావు.

షరా:—ఈ నాటకము యే విధమయిన ప్రతిఫలము కోరకనే యొసంగబడు మా లిఖితరూపకమయిన యనుమతిపొంది ప్రథమముగా ప్రదర్శించువారికి రజితపాత్ర యొకటి బహుమాన మొసంగబడును.

శ్రీ కృష్ణాబుక్ డిపో [redacted], రాజమండ్రి

# ఈ నాటకమున వచ్చు పాత్రలు.

పృధ్వీరాజు—ఢిల్లీ చక్రవర్తి, కథానాయకుడు
సుబుద్ధి—పృధ్వీరాజుమంత్రి
ఈశ్వరభట్టు—పృధ్వీమంత్రి. కుతంత్రజ్ఞుడు. జయచంద్రునాశ్రయి
సర్వనాశనము చేసినవాడు
సింధు, కాశ్మీరభూపాలురు—పృధ్వీ సామంతరాజులు
దేవశర్మ—సంయుక్త విద్యాగురువు
ప్రసన్నఛందు—రాయబారము కొనిపోయిన రసపుత్రవీరుడు
చాంద్ భట్టు—పృధ్వీ ఆస్థాన కవి
సమరసింహుడు— పృధ్వీ బావమరది
అమరసింహుడు—12 సంవత్సరముల బాలవీరుడు
ముసలిబ్రాహ్మణుడు—బాటసారి
జయచంద్రుడు—కనోజి దేశాధీశుడు, సంయుక్తతండ్రి
వినయశీలుడు సన్యాసి —జయచంద్రుని మంత్రి. దేశసేవకై పృధ్వీపక్షము వహించిన త్యాగి
పురహరుడు, అనలవరుడు—జయచంద్రుని సామంతులు
కరీముఖాన్ —జయచంద్రుని నాశ్రయించిన మహమ్మదీయ సేనాని
ఖైరాతీ గడబిడఖాన్లు, సేనాని, సేవకుడు వగయిరా వచ్చెదరు
సంయుక్త—కథానాయకి. జయచంద్రుని కూతురు
మంజరి—సంయుక్త చెలికత్తె
పృథ—పృధ్వీ సోదరి. సమరసింహునిభార్య

ఎవ్వాడు ముజ్జగంబులను నేలును మూలము కర్మసూత్రమై,
ఎవ్వాని యాజ్ఞ కోడి దివిజేసులు దైత్యులు స్వేచ్ఛవీడి రా
దివ్వేల దేవు డాప్తవరు డీ కృతి విఘ్నము లెల్ల దోలి దా
దవ్వుల, పెక్కు ప్రేక్షకుల దర్శనభాగ్యము గూర్చి బ్రోచుతన్.

[హిందూయువకుడు మహమ్మదీయ యువకుడు చెరియొకవైపుగా ప్రవేశించెదరు.]

మహ.—భాయీ! ఎక్కడకు పోవుచున్నా వింత రాత్రి?

హిందు—నాటకము చూచుటకు. నీవుకూడ రాకూడదా? Historic drama. కూడను.

మహ—ఏ నాటిది?

హిం.—హిస్టారిక్ నాటకము సర్వసాధారణగా మహమ్మదీయ యుగములోనిదే. ఇది స్థానేశ్వర రెండవ యుద్ధము.

మహ.—గోరీ దండయాత్రయా? నేను రాను బాబు. హిస్టారిక్ నాటకములని మహమ్మదీయులను......

హిందు—ఇందేమున్నది. మీరు దిగ్విజయము గాంచినదే కదా యిది! సంతోషించవలసిన యవసరముకూడను!

మహ.—సంతోషమునకు మన కే మున్నది. కాని వ్రాసినది హిందువు లగుటవలన ఉన్నది లేనిది వ్రాసి మహమ్మదీయులను చిత్రము వచ్చినటుల............

హిందు—చరిత్రలలో లేనిది వ్రాయరుకదా యెవరయినను. అదియునుకాక నా రోజులలో దండయాత్రల సమయముల మతోద్రేకులై మహమ్మదీయులు దౌర్జన్యములు చేయలేదనియెదవా! ఖురా నొక చేత కత్తి రెండవచేత............

మహ.—కాదనను. కొంతవరకు జరిగియే యుండవచ్చును. అ
పెంపొందించి—

హిందు.—సరే గోరంతలు కొండంతలు చేయుట మానవస్వభావము. కాని యీ నాటకమున నట్లుగాదు. మహమ్మదీయ దండయాత్ర కన్న స్వదేశరాజులలోని యీర్ష్యలును అంతఃకలహములును స్వార్థపరుల కుత్సితకుతంత్రములును దేశనాశనమున కెక్కువ కారణమని సూచించబడినది.

మహ.—అవును. పరరాజులు దండెత్తి వచ్చిన మాత్రము. వీరిలో వీరి కయికమత్యము లుండిన నెంతయయిన నుపయోగించి యుండును.

హిందు.—ఎప్పుడయిన నైకమత్యము లేకపోవుటయే ముఖ్యకారణము. జయచంద్రునివంటి యీర్ష్యాపూరితులును ఈశ్వరభట్టునంటి స్వార్థపరులగు బ్రాహ్మణ మంత్రులును............

మహ—అవును. బ్రాహ్మణమాత్రంగ మేమి! బ్రాహ్మణత్వమే యే ప్రమాదమునకైనను ముఖ్య............

హిందు— ఆ! అదే నే వలదనునది. ఒకడు చేసిన దుర్మార్గమునకు ద్రోహమునకు జాతినంతను నిందించుట యన్యాయము కాదా. బ్రాహ్మణులలో వినయశీలుని వంటి స్వార్థత్యాగులు లేరా! ప్రతిజాతిలోగూడ మంచివారితో పాటు చెడ్డవారుకూడ నుందురు. మంచియు చెడ్డయు వెలుతురు నీడల వలె నెప్పుడును కలిసియే యుండును. బ్రాహ్మణులలో త్యాగులును కలరు. బ్రాహ్మణేతరులలో స్వలాభాపేక్షితులును కలరు. మన ప్రస్తుత మంత్రివర్గమున............

మహ—అవునులే. మానవతత్వమంతే. స్వలాభమే కాకపోయిన-చో...

హిందు— సరే దానికేమి! ఇప్పటికే చాల యాలశ్యమయినది. నా నాటకావలోకనాభిలాష చెడగొట్టదలపెట్టక నీవుగూడరా పోవుదము.

(అని మహమ్మదీయుడు జేబు తడుముకొనుట చూచి) సరే డబ్బుకేమి. అది లేకుండ లోపలకు పోవు సూత్రమొకటున్నది నాదగ్గర. అన్నిటికిని కర్చుపెట్టిన సంసారములేలాగు (అని తొందరగావానిని లాగికొనిపోవును)

శ్రీ

# పృథ్వీసంయుక్త.

## ప్రథమాంకము—ప్రథమరంగము.

[సంయుక్త యొంటరిగాకూర్చుని ప్రవేశము.]

సంయు:—(ఆలోచనసహితయై)

మ. నలనా సత్యసమాను నాపృథివి భూనాథున్మహావీరునిన్
లలనా మన్మథు నెమ్మది న్వలచి యానందించుచే నుండ నా
వల నాతండ్రి యసూయ బుద్ధినిఁ బగం బాటించి పేర్వెన్న చో
జ్వలనాస్త్రంబన మండుచుండు నిదియే జన్మాంత శత్రుత్వమో.

అట్టి జనకుఁడు మా దాంపత్యమున కంగీకరించునా? అయ్యో! సార్వభౌముని వలచియుంటి నన్న సంతోషమునకుఁ భలిత ముండదు కాబోలు? భగవత్కృప యెట్లున్నదో యట్లు జరుగక మానదు. కానిమ్మ (ఆలోచించి) సామంతుఁడెక్కడ? సార్వభౌముఁడెక్కడ! కొండతో దగరు ఢీకొననెంచినట్లు, తనవలెనే యీర్ష్యాకలితచిత్తులగు, కొందఱు మిత్రసామంతులఁ జేరఁదీసి కుట్రసేయుచుండెనను వదంతులుఁ గూడ వినబడుచున్నవి. ఏమి సేయుటకును దోచకున్నయది. రాజ్యతంత్రవిశారద యగు మంజరితోఁ గలసి కర్తవ్యమారసెద గాక!

[మంజరి ప్రవేశము]

మంజ:—అమ్మా! ఏమంత దీక్షగా నాలోచించుచున్నావు!

సంయు:— చెలీ! ఆలోచన కేమున్నది? ఆర్యావర్తము నిరంతరము మహమ్మదీయార్భటములకు గురియై యున్నదను విచారము తప్ప యితరాలోచన మేమున్నది! దానికిందోడు స్వదేశసంస్థానాధీశుల యంతఃకలహములు. నాతండ్రి వారికిఁ దోడునీడయై, స్వార్థపరుఁడై, యీర్ష్యాపూరితుఁడై సార్వభౌముని మీఁది ద్వేషమున దేశనాశనకరంబులగు దుర్మార్గములకుఁ ద్రోవదీయుచున్న వాఁడని మనసు పరిపరివిధముల బాధపడుచున్నది.

మంజ:—అమ్మా! ఈ హృదయావేదన మన కెప్పుడు నున్నదే. అందులకుఁ బ్రథమకారణము మన యార్యావర్తము సర్వ సౌభాగ్యసంపన్నలయమై వర్ధిల్లుచుండుట. రెండవది పరస్పర మీర్ష్యాపూరితులై దేశధ్వంసము సేయనెంచు దేశద్రోహులగు స్వదేశసంస్థానాధీశుల యంతఃకలహములు విదేశీయులకు త్రోవ చూపుట.

సంయు:—మంజరీ! సామంతు లనాలోచనాపరులైనను ప్రపంచానుభవశాలురగు మాతండ్రిగారైనను వారికి నచ్చఁజెప్పియుండ వలసినది.

మంజ:—అమ్మా! నే ననఁగూడదు గాని మన మహారాజుగారే సార్వభౌముని మీఁది యీర్ష్యచే నీ పన్నాగము లన్నియు......

సంయు:—ఔను. గురువుగా రనుటయే గాని తన్నివారణోపాయము మాత్రము సూచింప కున్నారు?

మంజ:—ఇదివరకే వాఁక్రుచ్చిరి.

సంయు: —ఏమది?

మంజ:—పృథివీ జయచంద్రుల బంధుత్వము.

సంయు:—అది యెట్లు సంభవించును?

మంజ:—సంయుక్తా పృథివీ సార్వభౌముల వివాహముతో!

సంయు:—(సంతోషముతో) ఆహా! అంతటి యదృష్టమా!

మ. విలసచ్ఛౌర్య యశోవిశాలు సకలోర్వీపాల మాణిక్య మం
జుల దివ్యన్మకుట ప్రభార్చిత పదాబ్జున్ సార్వభౌమున్మది
న్బలవద్వైరిగ నెంచుగాని సుతకుం బ్రాణేశ్వరుం జేయఁగా
దలపం డెవ్వరు చెంతఁజేరి హితబోధంజేయు వా రక్కటా.

మంజరీ! నాతోబాటు నిన్నుఁగూడ ప్రాణంబుగా జూచు మా తండ్రిగారితో నీ వొకసారి యీ విషయము ముచ్చటించిన బాగుగనుండు నేమో కదా?

మంజ:—అమ్మా! ఆ విషయమై ప్రస్తాపింపవలయు ననియే యనుకొంటిని గాని తల్లిగారిముద్దు చెల్లింపని మీ తండ్రిగారు నా హితబోధ మాత్రము బాటింతురా? తల్లి చెవులు ద్రుంచువానికిఁ బినతల్లి చెవులు బీరపూవులును కావట.

సంయు:—తండ్రిగారట్టి పట్టుదలతో నున్నమాట యథార్థమే. చక్రవర్తియంతటి వాడు తనకల్లుడగునని యమితానంద మొంది బహుమాన పురస్సరముగ దోడ్కొని వచ్చి వివాహ మొనర్చుటకు మారు కయ్యమునకు గాలు ద్రువ్వుటెంత యజ్ఞానమొ ఎంత విచారకర విషయమో యాలోచింపుము. మంజరీ! ఏమి, సేయుటకును దోఁచకున్నది. నా తండ్రి యాతనికి నన్నిచ్చు మార్గము గనుపింపదు. చక్రవర్తిని వివాహమాడ కున్నచో నాకు రజ్జువిషాగ్నులలో నేదియో యొకటి యాధారము గాని వేరు గతి కాన్పింపదు. మంజరీ! నా నిశ్చితాభిప్రాయమును నీతో జెప్పుచుంటి వినుము.

గీ. సాంకీర్తిని పృథ్వీశసార్వభౌము
వలచి వరియించితిని ప్రాణభర్తగాఁగ
క్షితిని నింకొక నరపాలు చెట్టబట్ట
నొల్ల ప్రాణంబులైన బాయుదునుగాని.

మంజ:—అమ్మా! ఈ యశ్లీలోక్తులేల యాడెదవు? ఇంత నిస్పృహ యేల?

సంయు:—కాక మరియేమున్నదే మార్గము?

మంజ:—కావలసినన్ని. ఒకటి కాదు.

సంయు:—చక్రవర్తిని చెట్టవట్టుటకా!

మంజ:—ఆహా!

సంయు:—చెలీ! కుటుంబమర్యాదకు భంగము గలుగకుండ మన్మనోభీష్టమీడేర్పఁగల మార్గమేదైనఁ గలిగినఁ జెప్పుము.

మంజ:—అమ్మా! అట్టిలోపమునకే నొడంబడుదునా? సదాచారము గనుకనేఁ జెప్పసాహసించితిని.

సంయు:—అట్లయిన నది యవశ్యాచరణీయమే. చెప్పుము.

మంజ:—చక్రవర్తికి సందేశమంపుట.

సంయు:—ఆహా! ఏమిమాట చెప్పితివి? పగవాని కూతురనై యేమని సందేశ మంపుదును.

మంజ:—ఆయనతో మన కేమి పగ!

సంయు:—సందేశమున కాసార్వభౌము డేమనుకొనునో!

మంజ:—మదవతీ మదనుండగు సార్వభౌముఁ డట్టి విరసుండను కొంటివా!

సంయు:—మంచిది. సైన్యసమేతుఁడై వచ్చి నన్నీ వియోగ సముద్రంబు నుండి దరిఁ జేర్పఁకున్న నావల నా బ్రదుకేమి గావలయును?

మంజ:—అమ్మా! అతఁడా_ర్తజన రక్షకుఁడు. వచ్చితీరును. నిన్నా జన్మాంతముగఁ జేఁపట్టి తీరును. సంశ యింపకుము.

సంయు:—మంచిది. ఆ సార్వభౌముని కడకు నా ప్రణయసందేశముఁ గొనిపోవు వారెవరు?

మంజ:—అమ్మా! అందులకుఁ దగినవాఁడు మన గురుఁడు. రాజనీతిజ్ఞుఁడు. చతురోపాయ విశారదుఁడు. ప్రకృత రాజకీయ పరిస్థితు లాతనికి నివేదించి రెండు రాజ్యములకు సఖ్యము సమకూర్పఁగలఁడని కూడ నా కాశగలదు.

సంయు:—(సంతోషముతో) అయిన గురువరు నిటకు దోడ్కొనిరమ్ము.

మంజ:—మంచిది. (నిష్క్రమించును)

సంయు:—(లేఖవ్రాసి)

గీ. భయదవిరహాగ్ని శిఖవాడఁబారనున్న
కామితార్థ ప్రఫుల్లవల్లిమ తల్లి
కమృతవృష్టి వగింది నాయా_ప్తగురుని
సత్సహాయంబు సమకూరె సమయమునకు.

[మంజరి దేవశర్మతో ప్రవేశము]

సంయు:—గురువరా? నమస్కారము.

దేవ:—కామ్యార్థసిద్ధిరస్తు. కళ్యాణమస్తు.

మంజ:—గురువరా! సుఖాసీనులగుదురుగాక.

దేవ:—(ఆసీనుండగును)

మంజ:—తమరిడిన యాశీర్వాద మమోఘముగా నొనర్చువిధి తమపై నున్నది.

దేవ:—నాయాశీర్వాద మమోఘము. త్రిలోకములలో కూడ దానికిఁ దిరుగులేదు. ఆ మహోత్సవము కొరకే ఆ విందుల కోసమే యెదురు చూచుచుంటిని. ఏమి విశేషము తల్లీ?

సంయు:—గురువరా! మదీయ వృత్తాంత మా మూలాగ్రంబుగ మంజరివలన దెలిసియే యుండును.

దేవ:—ఆ. ఆ. ఆసుభవర్తమానము వినబడినప్పటినుండియు పిండి వంటలతో షడ్రసోపేతముగా, సౌఖ్యముగా, నానందముగా నుష్టకృత్తుగా భోజనముజేసినట్లు బహు సంతోషముగా నున్నది. కన్నతల్లీ! అంతకన్న నాకుం గావలసినదేమి?

మంజ:—ఎంత సేవును భోజనానంద మేనా?

దేవ:—కష్టపడి మీకహర్దివంబులు విద్యాబుద్ధులు గరపినందులకు, మీరు భర్త్రానందమునొందుటయు నేను భోజనానందము బొందుటయు గాక మరేమికావలయును? నాకు?

సంయు:—మీకు వేయి రెట్లధికానంద మొనగూర్చెద.

దేవ:—కర్తవ్యమేమో.

మంజ:—ఆ రహస్య కార్యభారనిమిదివరకే యెరింగించితి గదా?

దేవ:—అదియా! ఇదియొక పెద్ద భారమా! గురుండనైనందులకు ముఖ్యముగా నేనొనర్పవలసిన సత్కార్యమే యది. ఎన్నికష్టము లొదవినను, బహురహస్యముగ హస్తినాపురమున కరిగి ఢిల్లీశ్వరుని సందర్శించి యీశుభసందేశమందించి జల్తారు జామార్లు కట్టుకొని శాలువలు జుట్టుకొని, బహుమానములు పట్టుకుని కార్యము సాఫల్యమొనర్చుకొని వచ్చెదను. ఇంకేమైన గలిగిన నిప్పుడే చెప్పుడు.

మంజ:—ఇక్కడి పరిస్థితులు, మన మహారాజుగారిచర్యలు సంపూర్ణముగ మనవి చేయుటయేగాక, స్వయంవరసన్నాహమును సార్వ జొముతిర స్కారమును.......

దేవ:—పదియుంబదిగ మీరు నాకావిషయముల గురించి చెప్పనక్కరలేదు. ఆ భారమంతయు నిక నాది. సెలవుదీసికొందునా?

మంజ:—విందులసందటిని కార్యభారము మరువక, జాగరూకతతో శుభవార్తం దెల్పెదరుగాక.

దేవ:—మంచిబాగుగ జెప్పితివి. అసలు మరచిపోయిన నక్కడికేల పోవలయును.

సంయు:—ఇదిగో (వ్రాసినలేఖను దేవశర్మ కిచ్చును.)

దేవ:—(పుచ్చుకొని) నిరాటంకముగ జయప్రదముగ మీకార్యము సఫలమొనర్చుకొనివచ్చెద. మంజరీ! నేను వచ్చువరికి పెండ్లి పనులు ముగించి సర్వసిద్ధముగ నుండుము.

సంయు:—(సంతోషముతో) గురువరా నమస్కారము.

దేవ:—కళ్యాణసిద్ధిరస్తు. అమ్మా సెలవు. (నిష్క్రమించును.)

మంజ:—నీకు మనస్థిమితమున్నట్టు కనుపింపదు. విలాసాగారమున కేగుదము రమ్మ.

(నిష్క్రమింతురు.)

## ద్వితీయ రంగము.

-[ఢిల్లీ చక్రవర్తి యగు పృథ్వీరాజు ప్రవేశము]

పృథ్వి:—

మ. ఖలులై దేశముఁజొచ్చి హైందవులనుంగారించి, సంపత్సుభా
వలిదూలించు విదేశవాసులను శుంభత్తౌర్యమేపార న
వ్వలకుంద్రోలి స్వదేశగౌరవము నిల్పంజాలు రోజున్న దే
కల యీభారతజాతి కెన్నడయినం గండ్లార వీక్షింపగాన్.

ఆహా! ఆదుర్మదాంధుల దౌర్జన్యములకు స్వార్థాపేక్షితులగు దేశద్రోహుల కుట్రలు మరింత సాయపడుచున్నవి. స్వదేశసంస్థానాధీశులు పరస్పరమన్యోన్యానురాగరహితులై, యంతఃకలహ

ములు రగులగా నీర్ష్యాపరవశులై, దేశద్రోహమునకుం దొడ్పడుచున్నారు. అందగ్రస్థాన మలంకరించువాఁడు కన్యాకుబ్జనగరాధీశ్వరుం డగు జయచంద్రభూజాని. ఆతండు కొంత నిరాధార కారణ మాధారము గా గైకొని, నాపై ద్వేషమూని, కొంతమంది సామంతరాజులను ప్రోత్సహించి కయ్యమునకుఁ గాలు ద్రువ్వుచున్నాడు. ఏమి యీ యసహనము! ఓయీ! జయచంద్రా! పృథివీ భూపాలుని యపారబలపౌరుషంబులను, సార్వభౌమత్వమును, దిగంతభరితయశంబునుం గాంచలేక భరింపజాలక యసూయా పిశాచగ్రస్తుండవై బాధపడుచుంటివా! లేకున్న నాపై నీకింత యాగ్రహమేల యొదవినది. (ఆలోచించి) అహో మరచితి. పులి మీఁది పుట్రయన్నట్లా యశ్వమేధమే కారణంబుగాని మరి యొండుగాదు. ఆహా? మన పరస్పర కలహములకు విరుద్ధముగ నీ గారాబుకూతురు సంయుక్తయు నేనును, పరస్పరప్రేమావిష్టులమై యుంటిమను విషయము నీ వెరుంగవు కాబోలు?( ఆలోచించి) ఇట్టివియే విధియొక్క వింతయగుచేష్టలు. తండ్రిపై విరోధమేమి? తనయపై ననురాగమేమి? ఆహా! నాయనురాగము కొనసాగుటెట్లు? జయచంద్రా! నేను తలంచినచో నిన్నును నీ రాజ్యమును, నీసామంతనృపాల మిత్రవర్గంబును భస్మీభూతంబుఁ గావించి, యీ మోహనాంగిఁ ననాయాసముగా జేపట్టగలిగియుందును కాని కుసుమకోమలంబగు నామె హృదయమును నొప్పింప నిష్టములేక, సాహసింపజాలకుంటి. పరస్పరప్రేమానుబద్ధులమైన మాదాంపత్యమును హృదయపూర్వకముగా నంగీకరించి యానందింపుము. లేదేని పుత్రసంతాన యోగ్యతలేని నీకుఁ గన్యాదాన ఫలప్రాప్తికూడ లేకుండ పోవునేమో సుమా! అట్లు చేయుదువేని మన పూర్వ విరోధములు రూపుమాయుటయే గాక, పవిత్ర

వంతమగు నార్యావర్తము విదేశీయ దండ యాత్రల నుండి విముక్తమై స్వాతంత్ర్యవాయువులఁ బీల్చి సంతసింపగలదు.

గీ. నీకు నాకును నెయ్యంబు నెగడెనేని
నీ చతుర్దశభువనంబు లెదురఁజాల
వఖిల సాంబ్రాజ్యలక్ష్ముల ననఁగి పెనఁగి
ప్రజలు మనమును సుఖముల బడయవచ్చు.

(ఆలోచించి) ఆహా! నాకంతటి భాగ్యము లభించునా? ఆ నలినాక్షి యనుపమాన సౌందర్యవిశేష మెంత తలఁచుకొనినను తనివి తీరకున్నది. పదియారువన్నె బంగారు ఛాయగల శరీర లావణ్యమునకుఁ దోడు నిరుపమాన ధనుర్విద్యా కౌశల మలవడుట నిశ్చయముగ శ్లాఘాపాత్రము.: స్త్రీరత్నమై, శస్త్రప్రయోగ కుశల యగుటచే రణభూమిని శత్రుసంహారణ క్రీడలందుఁగూడ నాకుఁ దోడ్పడఁజాలును. ఆహా! ఆలావణ్యవతిని కన్నలార్వ గాంచి, కరవుదీరఁ గౌగలించి, మనసుదీర నానందించు భాగ్యము నాకెన్నఁడలవడునో గదా! అట్టి వీరకాంత యీ యార్యావర్త మునం జనించినందులకు సంతోషమును, దురభిమానియు ననహా నశూరుఁడునగు జయచంద్రుని గర్భవాసమున జనించినందులకు విచారము నొక్కసారిగ గలుగుచున్నవి. ఆహా!

గీ. అరయ నాచంద్రతారార్క మవని మీఁద
నీదు విక్రాంత కీర్తుల నిలువబెట్టు
ప్రధన వీరల సంయుక్త వంటి సుతల
వీరమాతల గనుమమ్మ భారతాంబ.

ఆహా! సంయుక్తా! ప్రియామణీ! (కూర్చుండి యాలోచించు చుండును.)

[చాంద్‌భట్ ప్రవేశము]

పృధి:—భట్టారకా! నమస్కారము. ఇటు కూర్చుండుము.

చాం:—దిగ్విజయమస్తు. ఇష్టార్థసిద్ధిరస్తు. దీర్ఘాయురారోగ్య ఐశ్వర్యాభి వృద్ధిరస్తు. (కూర్చుండును.)

పృధి:—ఏమివిశేషము ?

చాం:—మహారాజా ! పృధివీ రాజవిజయ మను నామమున ప్రభువు వారి జీవితచారిత్రము రచించుచున్న విషయము దేవరవారికి జ్ఞాపకముండియుండవచ్చును. అందుఢిల్లీ విజయము, కలంజరు సంగ్రామనిధనము, నాగూరు నిక్షేపహరణము, గుజరాత్ గర్వభంగము, అఫ్గన్‌విదారణము, లాహోరు సంగరజయస్తంభసంస్థాపనము మొదలగు ఘట్టంబులు దేవరవా రిదివరకే వినియున్నారు. దేవర యశ్వమేధ దిగ్విజయ యాత్రోత్కర్షణభాగము మాత్రము నిలిచియున్నది.

పృధి:—(సంతోషముతో): ఏదీ? ఒక్కపద్యముం జదువుడు చూతము.

చాం:—మహాప్రసాదము. (తాళపత్ర పుస్తకము విప్పి)

మ. అలతిన్ యజ్ఞతురంగముం గొనుచుఁ గన్యాకుబ్జభూపాల దో
ర్బల సంహార మొనర్చి యేగు పృథివీరాడ్భర్తృకౌక్షేయక
జ్వలనజ్వాలలనార్చ, నాకవనితావర్గంబులంగూడి, పు
వ్వులవానం గురిపించె శాత్రవదళంబుల్ గీతవాద్యాళితో.

(అనిచదువును)

పృధి:—భట్టారకా ! ఈ వర్ణనము కేవల మతిశయోక్తిగాక మీరు చూచి వ్రాసినదియా !

చాం:—ప్రభూత్తంసమా ! ఇందతిశయోక్తి యెంతమాత్రమునులేదు. సంగరరంగమున నట్టి యేర్పాటులు జరిగినవి.

వృథి:—(స్వ) అట్లయినచో నప్పుడా జగన్మోహన వీరనారీమణి యగు సంయుక్తను సందర్శించిన విషయము వ్రాసెనో లేదో కనుఁగొందము. (ప్ర) కవీంద్రా! కన్యాకుబ్జ పరిసరోద్యానము నుండి బలంబులతో నగరప్రవేశము చేసిన భాగము జదువుడు.

చాం:—చిత్తము. (తాళపత్రములు ద్రిప్పి) అప్పుడా రాజకంఠీరవుండు భద్రగజారూఢుండై విజయధ్వనులతో జనుచుండ,

మ. వికచాబ్జాక్షిని పూర్ణచంద్రవదనన్ విద్యుల్లతావిగ్రహన్
పికవాణిం బిసబాహనీల చికురన్ బింబోష్ఠి శాతోదరిన్
ప్రకటోద్యాన వనీవిహారముదితవ్యాహారనున్ రాజక
న్యక నొక్కర్తుకఁ గాంచెఁ నిక్షుధనువయ్యబ్జాస్త్రుడున్ దాలిచెన్.

వృథి:—(సంతోషముతో గౌఁగలించుకొని) కవీంద్రా! చాలు చాలు. రవిగాంచనిచో గవి గాంచునను లోకోక్తి సార్థకపరచితివి. భావగంభీర లలితపదచమత్కృతీ విశేషరసబంధురంబగు నీ గ్రంథమున కెంతయు నానందించితిని. సప్తసంతానాది ప్రతిష్టలకంటె ప్రభుని నాచంద్రార్కకీర్తిగా నొనర్ప గవీంద్రుడే దక్షుడు. రవి లేని నభంబురీతి కవిలేని ప్రభుని జీవితము నిరర్థకము. కవీంద్రా! సావధానముగా నీగ్రంథము సాంతముగా నింకొకసారి వినియెద. (హారము బహుమానమొసగి) పోయిరండు. కాలాతీతమైనది.

చాం:—కళాభిమానులును, మహారసికులు నగు ప్రభువతంసులు గనుక కవియొక్క విలువ గ్రహించి సంతసించితిరి. సంతోషము. సెలవు గైకొనియెదను.

వృథి:—మంచిది. నమస్కారము.

చాం:—దీర్ఘాయు రారోగ్యైశ్వర్యాభివృద్ధిరస్తు. (నిష్క్రమించును)

ద్వార:—తమదర్శనార్థ మెవ్వరో భూసురు డరుదెంచి వేచియున్నాడు.

వృథి:—తత్క్షణము రమ్మనుము.

[దేవశర్మ ప్రవేశము]

పృథి:—భూసురాగ్రణీ! మీ రేయూరు!

దేవ:—కన్యాకుబ్జము.

పృథి:—ఆ! అయిన జయచంద్రుడే మిమ్ముల నాదగ్గరకు...

దేవ:—కాదు. అతని కుమార్తె సంయుక్తకన్య.

పృథి:—అట్లనా! నమస్కారము. ఇట్లు దయసేయుడు.

దేవ:—ఇష్టార్థసిద్ధిరస్తు. ఆకన్యకామణికి నేను బాల్యమాది విద్యాగురుండను. పంచేషుశరాంకితభగ్నహృదయయై మీ యెడల బద్ధానురాగయై నాహారనిద్రలు మాని యనవరతము మీ కొరకు బరితపించుచున్నది. ఆమె హృదయోద్దేశ మీ లేఖాముఖంబున నామూలాగ్రంబుగ దేటపడగలదు. (లేఖనిచ్చును)

పృథి:—(సంతోషముతో) అట్లనా? (లేఖ జదువుకొనుచు)

ఉ. ఓనృపసార్వభౌమ కరుణోదధి! మానవతీమనోజ! యు
ద్యానమునందు నిన్గనినదాది మనంబున నిన్నె భర్తగా
ధ్యానమొనర్చుచుండ నకటా! జనకుం డవివేకవృత్తి నీ
పైన నసూయచేఁ బిలువనంప దలంప డికేమిసేయుదున్.

గీ. సర్వసైన్యసమేతులై సకలనృపులు
మత్స్వయంవర సన్నాహమహముఁ జూడ
నరుగుదేరకముందె నాకాశవీధి
రాగదే నన్ను గైకొన రాజసింహ.

ఇట్లు నీప్రేమానుజీవ

సంయుక్త.

(కోపముతో)

మ. పరభూపాలురు తత్స్వయంవరమునం బ్రత్యర్థులై సూడ మ
తర్క కౌక్షేయక ప్రజ్వలజ్వలనదుర్ధర్ష స్ఫులింగచ్ఛటన్
మరణంబొందెదో! చేతులారఁ దగఁ గన్యాదానముం జేసి మ
త్సరముప్పొడిన మామ వాఁడో! జయచంద్రా! యోజనన్ సేయుమా!

(ఆలోచించి) భూసురాగ్రణీ! పరస్పర ప్రేమానురాగబద్ధమగు మిథునమునకు వియోగబాధ యెంక తీరునసే యందును. కావున ప్రియామణియగు సంయుక్తతో

సీ. తన్గఁ గన్నులార గాంచిననాటనుండియు
కంటనిద్దురలేక యుంటిననుము
వచ్చిన నరపాలవైరివంశము నాదు
కౌక్షేయకాగ్నుల గాలుననుమ
తన తండ్రియెదుటనే తక్ స్వయంవరమున
వరియించి తన్గొని వత్తుననుమ
పగతుర మనముల రగులుచున్న కృదాగ్ని
యాఱెడి సమయంబు చేరెననుమ

గీ. మదిని వ్యతిరేకభావంబు మానుమనుమ
ధైర్యమువహించి చింతల దలగుమనుమ
కోర్కె సమకూడు దినములు కూడెననుమ
అతిరయంబున వచ్చెద ననుమ చనుమ.

(అని దేవశర్మను తోడ్కొని వెడలిపోవును.)

# తృ తీ య ర ం గ ము.

[ఈశ్వరభట్టు—కరీము ఖాను ప్రవేశము]

ఈశ్వ:—ఆహా! ఎంతవరకువచ్చినది. ఉపేక్షించినకొలఁదిని కార్యము గంగలో గలియుచున్నది. పృధ్వీసంయుక్తల సంయోగము మన యాలోచనల కంతరాయముఁ గల్పించును. ఏమి యాలోచించితివి మిత్రమా?

కరీ:—క్యాసాబ్! మాకి వక్టీ మాటా సెప్పి వక్టీ మాట సేస్తాం? నహి నహి. మాదీ సర్కార్కి తెలింగీరాజ్యం సొబ్బి రావాలా మీకీ ఆదా రాజ్యం నజరానా యీవాలా. బుర్రాపోతే రెండో మాట సేస్తాయిలేదు. దేఖో!

ఈశ్వ:—మహమ్మదీయులును అందులో మీ వంశీయులును సత్య సంధులు. నే నెరుగుదును.

కరీ:—భట్టూసాబ్! పానం అబద్దం మాట నిబద్దం. అదీవుండీపోతాది. మీదీ మాకీ సేసే పహాయాన్కి మాకీ మంచి సంతోషం వుంది. కాని మన్కి సంగతి మరి ఒహాద్కు తెల్సిందిలాగా వుంది. మంచి బందోబస్తుమే పని సెయ్యాలా యిదీసారి.

ఈశ్వ:—మనము తగినంత రహస్యముగనే ప్రవర్తించుచున్నాము గదా! మనము పృధ్వీరాజును సింహాసనభ్రష్టుని జేయుటకును, సంయుక్తను వధించుటకును పన్నిన పన్నాగము లన్నియు వృధాయైనవి.

కరీ:—అదీకారణంసేతానే మాకీ సందేహం సేస్తాం. మన్మ సుల్తాన్ సర్కార్కు లాహోర్ ఖబర్ సేసి, వార్కి ఫలానా వార్కి ఫలానాకోజ్కు సిబ్బందీతో రావాలా అని రప్పించి....

ఈశ్వ:—ఔను. ఆ సంగతి ముందుగనే గ్రహించి సమరసింహుడు ఘోరీని మధ్యమార్గమున నడ్డుకొట్టి వెనకకు పారద్రోలినాడు.

కరీ:—అరె! వట్టితోట్టం! ముక్కల్ ముక్కల్ సేసి సాలా ధూరం తర్మియేసింది కాదండీ! సహీతో మీది యీ సమయాన్కి పగం రాజ్యం తీస్కుని తక్తుమీద సిక్కి కూర్చుండేది లేదండీ!

ఈశ్వ:—ఔను. మీ సహాయమున నా కంతటి యదృష్టము పట్టవలయునుగదా?

కరీ:—నసీబ్ మాట క్యాభాయి! మాదీ సేతీమే కత్తివుంటే మీకీ రాజాన్కి లోటు? సర్కార్! ఒక్టీసారి కాకపోతే యింకా ఒక్టీసారి.

ఈశ్వ:—కాని యీసారి పృథ్వీరాజే ముందుగ కన్యాకుబ్జముపై దండువెడలునట. అప్పుడు మన మేమిచేయవలయును

కరీ;—అరే! అప్పట్కి ఘోరీసుల్తాన్ సిబ్బందీతో తయ్యారై వస్తాడు కాదండీ మస్కి.

ఈశ్వ:—అలాగైన మంచిదియే. అతడు వచ్చిన పృథ్వీరాజును ముందుగనే మట్టుపెట్టవచ్చును. కాని నాకంతటి భాగ్యము పట్టవలయునుగదా? నాకు మొదటినుండియు రాజ్యాశ కలదు గాని తగిన సహాయసంపత్తి లేక నెరవేరదని యూరకొంటిని. నేటికి మీవంటి వారి సహాయమున చేకూరునను ధైర్యము గలుగుచున్నది.

కరీ:—మీదీమాట నిశ్చయం. కత్తిపట్టి ఖరార్ సేస్తాం. నీకి ఫర్వా నహి. ఇక మాకీ పోతాం. సలామ్. మాటామాత్రం మర్సి పోకండి సర్కార్. (నిష్క్రమించును.)

ఈశ్వ:—ఆహా! నాకింక మంచిదినములు రానున్నవి. సింహాసనాసీనుండను గాగలను. పృథ్వీరాజువద్ద ముఖ్యోద్యోగులలో నొకఁడనై, మరియు నాంతరంగికుండనై, నృపాలునకుఁ గుడిభుజముగా జరించుచు పృథ్వీరాజును సంయుక్తను మాయోపాయమున

నెన్నిసార్లు వధియింప ప్రయత్నించినను, ఢిల్లీపై నెన్ని సారులు దండు విడియజేయ చేసినను, దేశమునందెంతమంది రాజద్రోహులను సృష్టించినను, ఎంతమంది మహమ్మదీయుల నీ దేశమున బ్రవేశపెట్టినను, కార్యము సానుకూలపడినది కాదు. అన్నియు వ్యర్థములైనవి. అయిన నేమి. పట్టినపట్టు వీడక హిందూదేశ రాజ్యరమాపాణిగ్రహణమునకై ప్రపంచమంతయు దలక్రిందులు సేయుదునుగాక. అందులకే యీ మహమ్మదీయ సేనానిని మాయ వేషమున పృథివీరాజుకొలువులో బ్రవేశపెట్టి, వానిచే నాడించు చున్నాను. ఇతడు నా కన్నివిధముల సహాయపడుచున్నాడు. సహాయపడఁగలఁడు. నా బుద్ధిబలమునకు వీని భుజబలము సహాయ పడిన చక్రవర్తి నేగాదు శంకరునిగూడత్రోసి రాజనకయుందునా! ఒకవేళ మహమ్మదీయ సేనాని మాటప్రకారము సుల్తాను దండు విడిసి నాకు సహాయపడ నిష్టపడకపోయినచో వెనుకంజనిడు దునా! ఎన్నటికి నట్లు జరుగదు. మాయోపాయముచే జెలిమి యొనర్చి యీ కపటనాటకమున నా నైపుణ్యమంతయు వినియో గించి ఢిల్లీప్రాజ్యరాజ్యరమణీప్రాణనాథుండనై, శత్రురహితుం డనై, నిర్వక్రవిక్రమంబులు భూనభోంతరాళంబులు నిండ సప్త సముద్రముద్రిత ధారుణీతలంబెల్ల నేలుదునుగాక.

(నిష్క్రమించును)

శ్రీ

# పృథ్వీసంయుక్త.

## ద్వితీయాంకము—ప్రథమరంగము.

[వినయశీలుఁడు వెంటరా పద్యముం జదువుచు జయచంద్రుఁడు ప్రవేశము]

మ. ప్రళయానల్పధనంజయోత్కట రుచిప్రస్ఫారనేత్రోద్భవా
ఖిలలోకావళి భీకరానల కనత్కీలాధ దుర్వారమై
జ్వలనాస్త్రాళిగ మత్క్రుధానల లసజ్జాలాళికిన్ నేఁడిదే
శలభంబై తివిగాఁచికొమ్ము పృథివీపాల! దుష్టాధమా.

జయ:—(కోపముతో) ఓరీ! స్తుతిపాఠలోలా! దుర్విదగ్ధా! పృథ్వీరాజా! మహాపరాక్రమ తేజోవిరాజితుండనని గర్వాయత్తచిత్తుండవై యేల మిట్టిపడియెదవు? భవదీయ దోర్బల ప్రతాపాగ్ని నస్మద్వాగ్గణాసారంబుచే నొక్కక్షణంబున జల్లార్చి, నీ యశంబు నీ తేజంబు మంటగలిపి దుర్దాంత దుస్సహ దుర్గతులు సమకూర్చి, కాలబెట్టి నేలరాయుదునుగాక! భయదాహవతలంబున నిన్నోర్చి కలాంతము గాంచుదునుగాక.

విన:—అమంగళము ప్రతిహతమగుగాక. మహారాజా! కోపావేశపరవశత్వమున మైమరచి యిట్లశ్లీలము లాడుచుంటిరేమి!

జయ:—(కోపముతో) అశ్లీలములా! అయిన నగుగాక! కానున్నది కాకమానదు. కాని యీపృథ్వీరాజహతకుని చేష్టలు దలంచిన కొలంది నాయొడలు మరిఁడుచున్నది.

చ. తన ఘనకీర్తి తేజమును ధైర్యము శౌర్యము దేశమెల్లెడన్
విని స్తుతియింపగల్గు నవివేకుల బట్టుల బంచి తాన్మహా
ఘనుడనటంచు గన్నులను గానడు క్షత్రియ లోకమాత్మనే
మనియును కొందురో యనుభయం బయినన్నది లేదు వానికిన్.

సకల పృథ్వీరాజ చక్రింబును గన్నుగప్పి హయమేధ మెట్టులో తుదముట్టించుకొని నంత మాత్రమున తనకు దిగ్విజయ ప్రాప్తికలిగి నదియా? అబ్బా! అహర్నిశము లెచ్చటచూచిన నా వీరమ్మన్యుని ప్రశంసయే. ఆ తుచ్ఛుని ప్రఖ్యాతియే. వినినకొలది వీనులు చిల్లులు వడుచున్నవి. ఆ స్వోత్కర్షలోలుని గర్వభంగము గావించు నందాక నా హృదయావేదన తీరదు.

విన:—రాజోత్తమా! అది క్షత్రియధర్మమే. కాని దానికి తగిన యదను కనిపెట్టియుండుట మంచిది.

జయ:—వినయశీలా! నీవుచెప్పినది రాజనీతిక్రమమే. అందుల కంగీకరింతును గాని, యవక్రపరాక్రమ తేజోవిరాజితులగు సామంతు లనేకులు నన్ను ప్రోత్సహించి నాకు బాసటలై నిలుచుటకు సర్వసిద్ధులరై యుండిరి. ఇంతకంటె మంచిసమయ మే ముండును?

విన:—చిత్త మట్లనే కావచ్చును. కాని యకారణంబుగ జక్రివర్తిపై దాడివెడలుటకు వా రంగీకరింతురని యనుకొనను. వారీయకొనిన ను ప్రజ లన్యథా భావింతురు. కావున తమ రశ్వమేధము కంటె మిన్నయగు రాజసూయమహాధ్వరంబుం దలపెట్టి, సకల రాజన్యవర్గముతో బాటు పృథివీసమరసింహులనుఁగూడ నాహ్వానించినచో వారు రాఁగలరు. దానివలన మీకును మీకును గల పూర్వవైరము లంతరించుటయే గాక—

జయ:—ఆ! అది వట్టిమాట. వారు రారు. నే వారి నాహ్వానింపను.

విన:—అట్లుండ రాహ్వానములంది గానుక లర్పించనిచో రాజసూయము పరిసమాప్తమొందినటుల నెంచఁబడదు. అందుచేత—

జయ:—ఆహ్వానించినను వారు వచ్చి కానుక లర్పింతురా? ఓయీ! ఎవరైనఁ జెప్పిరా? లేక యీపిచ్చియూహ నీకే జనించినదా! వారు-వచ్చి-నాకు-కానుకల- నర్పింతురా? వారు మహాశూరులు, దశదిశాదంతురాక్రాంతకీర్తికాంతులు, మహీతలమదారాతిశుష్కాటవీదావపావకులు, త్రిభువనభీకరవీరనృసింహావతారులు. కరితురంగరథాంగాదిచతురంగబలోపేతులు, రణరంగశత్రుస్మయీభీల శుండాలతండోపతండ భయదవీరమృగరాజసైన్యాధికులు, మహారాజాధిరాజపరమేశ్వర బిరుదాంకితులు విశేషించి చక్రవర్తులు. వా రెక్కడ నేనెక్కడ! వారి కండ్లయెదుట నే నొక రాజనా! నాది యొక రాజ్యమా! (మండిపడుచు) అస్మదౌన్నత్య ప్రభాసహనవాంఛ నిలువున జీరినను ఆ శరీరరక్తనాళములలో నొక్కబిందువైన గన్పించునే! ఎంతవరకును స్వోత్కర్షయే! ఎంతవరకు నాత్మగౌరవప్రశంసయే! వారి హృదయంబులు నీవే మెరుంగుదువు? కానిమ్ము. ప్రతిపక్షవరూథినీమానప్రాణ శౌర్యప్రాజ్యరాజ్యార్వ్యవంబింకింపగల ప్రతాపార్చితాపరకుంభసంభవుండనని యెరుగపరతునుగాక! ఓ వీరమ్మన్యులారా! సంగరసమయసన్నాహంబొనర్చుచుంటిని. ఆ హయమేధగౌరవమును యీ రాజసూయాధ్వర వ్రతంబును తేటపడ గలవు. ప్రధనాంగణంబున మిమ్మునిర్జించు నంతవరకీ జయచంద్రుడు యాహార విహారనిద్రల విసర్జింప ప్రతినబూనుచున్నాడని త్రికరణశుద్ధిగ నమ్ముడు. అష్టదిక్పాలుర సహాయులై పోలిగలని నా కెదుర్కొడ్డి నిలిచినను, మీ ప్రాణవాయువులమాత్ర మీ జయచంద్రభీషణ భుజంగంబు తనివితీర గ్రోలకుండ విడువదని యాథిగ నమ్ముడు.

ఛీ! ఛీ! అమాత్యవరా! వారినాహ్వానించి పదిమందిలో నప్రతిష్ఠ పాలుపడుటకంటె, నాహ్వానింపక విసర్జించుటయే నీతియుక్తము.

విన:—దేవరచిత్తము. అయిన సంయుక్త స్వయంవర మేర్పరచి—

జయ:—అవును. దానికైన నంతే. ఆస్వోత్కర్షలోలుర కాహ్వానములు లేవు.

[పురహారుఁడు అనలవరుడు నను సామంతరాజులు ప్రవేశము]

జయ:—మిత్రులారా! ఈ యాసనంబు లలంకరింపుడు.

పుర-అన:—(ఇద్దరు కూర్చుందురు)

జయ:—ఏమి విశేషము?

పుర:—ఎట్టెటో యశ్వమేధ మొనరించి కన్నుగానకున్న పృథివీరాజ మదోన్మత్తుని కిం దగిన పరాభవంబు గావింపవలయును.

అన:—మిత్రమా! రహస్యముగా నశ్వమేధము నెరవేర్చుకొనినంత మాత్రమున వానికి వచ్చిన యశస్సేమి? మనమందర మేకీభవించి సమరం బొనరించి యతనిని నిర్జించుటయే కర్తవ్యము.

జయ:—పిచ్చుకమీఁద బ్రహ్మాస్త్రప్రయోగము రీతి యా వీరమ్మన్యునితోడనా యుద్ధము మనకు? విన్నవా రేమందురు! కన్నవా రేమందురు! వాని గర్వనిర్వాపణోపాయంబు నే నెరుంగుదును. అది స్థిరపరచియే యుంచితిని.

పుర:—మిత్రమా! ఏమది.

విన:—సకల రాజవశీకరణమంత్రంబగు రాజసూయము లేక...

జయ:—కాదు. సకలసామంతాది బంధుమిత్రాకర్షణ సూత్రమగు స్వయంవరము.

అన:—ఆ వీరమ్మన్యు లప్పుడు మాత్రము వచ్చెదరా?

జయ:—వచ్చెదరనియే మా మంత్రిశేఖరుని వాదన.

విన:—ఆహ్వానములు పంపిన తప్పక....

పుర:—వారురారు. వారిని రానీయ వలను పడదు.

అన:—అసలువారి నాహ్వానించుటయే పౌరుషహీనమని నా తలంపు.

విన:—వారు రానిపక్షమున స్వయంవరవిధానము సంపూర్ణము గాదు. అందువలన మన మాహ్వానించి తీరవలయును. వారొక వేళ రా నిరాకరించినచో నితరరాజ వర్గంబులు ప్రజలు వారి వెరుసుదనమునకును పరశ్రేయాసహానమునకును నిందించి, మనసర్వసమత్వమును మంచిని శ్లాఘింతురు. అప్పుడు మనమీద నిందయుండదు.

పుర:—వినయశీలా! ఎంత బాగుగ జెప్పితివి! మన మాహ్వానించుటయు వారు నిరాకరించి మనలను బరాభవించుటయు, తదనంతరము ప్రజలు వారిని నిందించుటయు అది విని మన మానందించుటయునా! ఆహా! (నవ్వుచున్నాడు.)

అన:—జరుగని దానిని తరచుటవలన నేమి ప్రయోజనము.

జయ:—మంత్రివరా! నా మిత్రుల కనిష్టమగు కార్యమొనర్చుటకు నే నంగీకరింపను. వారలను రాకుండ చేయుటయే మచిది. వారిరువురకును వారి సంబంధులకును దప్ప తక్కిన రాజలోకంబునకెల్ల నాహ్వానపత్రికల నంపుము. పండితులతో నాలోచించి శుభముహూర్త మేర్పరచి తగు నేర్పాటులో నుండుము.

అన:—పిలుపులేకుండగనే వత్తురేమో! ఆ దుర్మదాంధులకు గౌరవమేమి! యగౌరవమేమి!

జయ:—గీ. పిలువ కుండగ వచ్చిన నలుకమీర
మహిత రాజన్యచక్రసమక్షమందు
తగ పరాభవ భగ్నహృదయులను జేసి
పార దోలుద మా యహంభావమతుల.

(జయచంద్రుడు మిత్రులతో నిష్క్రమించును)

విన:—ఆహా! కార్యక్రమ మెంతమారుదోవకు గడంగుచున్నది! ఏవిధముగనైన గార్యసానుకూల మొనర్చు నుపాయ మారయక దూరదృష్టివిహీనులగు నీ సామంతద్వితీయ మగ్ని నాజ్యంబు బోసినట్లు జయచంద్రుని యీర్ష్యానలజ్వాలల మరింత వృద్ధిపరచి కార్యము గంగలో గల్పయత్నించుచున్నారు. దీనివలన పరస్పర విరోధములు పెరిగి శాంతిదప్పి చివరకు దేశ మల్లకల్లోల మగుటయేగాక, సార్వభౌముని వరింపనున్న సంయుక్త తలంపు గూడ చివరకు భిన్నముగాగలదు. సార్వభౌముడను నీర్ష్యయే గాని, యీ పృథివీనృపాలు డీ సామంతనృపుల కే యుపకృతి యొన ర్చెను. అతనిఁ బరాభవించుటకా యీ ప్రయత్నము! చేసేతల నెవరు జేసికొనినది వారే యనుభవింతురు. కాని యమాత్యుడనై నందున వీనిని సన్మార్గమునకు దీసికొనిరాయత్నించు నా విధ్యుక్త ధర్మము. ఆ తరువాత దైవేచ్ఛ యెట్లున్నదో యట్లు జరుగక మానదు.

గీ. పరుల గుణ ధన భాగ్యవైభవ యశంబు
గాంచి యోర్వంగ లేనట్టి కలుషమతికి
నున్నదియుఁ గోలువడుటయు, నుపరి దుఃఖ
తాపసంతాప ఫలితమే దక్కుతుదకు.

(నిష్క్రమించును)

## ద్వి తీ య రం గ ము.

[దేవశర్మ వినయశీలుడు ప్రవేశము]

విన:—గురువరా! మీ రేగిన శుభ కార్యవిషయము సఫలమైనదియా!

దేవ:—ఆ సఫలోన్ముఖముగానున్నది. కన్యాకుబ్జము యజ్ఞాశ్వగ్ర హణమునకై యరుగుదెంచి సంయుక్త కంటపడినదాది, సంయు

క్తయు ననుచరులు మీ బోటి పెద్దలు మావంటి యాశ్రితులు, వేయేల జయచంద్రుడు తప్ప, తదివర కన్యాకుబ్జనగర మాబాలగోపాల మీ దాంపత్య సంఘటనమున కెదురుచూచుచున్నదనియును, నయముననో భయముననో వచ్చి సాధ్యముగాకున్నచో నిక గాంధర్వవిధినైన నామెను పట్టపుమహిషిగా జేపట్టవలయుననియును, తప్పదనియును, మరి మరి చెప్పి వచ్చితిని. మానవప్రయత్నమంతయు జరిగినది. ఇక దైవయత్న మెట్లుండునో తెలియదు.

విన:—చక్రవర్తి యభిప్రాయ మెట్లున్నది?

దేవ:—ఎవరి యభిప్రాయ మెట్లుండును. తప్పక వచ్చి తోడ్కొని పోవును. సందేహము లేదు. ఎంతమాత్రము.

విన:—అచ్చటి రాజకీయవ్యవహారము లెట్లున్నవి?

దేవ:—రాజకీయములు కావలసినంత గందరగోళస్థితిలో నున్నవి. మన రాజ్యముపగిది నా రాజ్యములో గూడ దేశద్రోహులు రాజద్రోహులు ప్రజాద్రోహులు పరిమితిమీరి యున్నారు. గుడియును గుడిలోని లింగమును గూడ మ్రింగ నుద్యుక్తుడై యున్న తంత్రోపాయవిశారదుడగు బ్రాహ్మణుడు మంత్రియై యున్నాడు. అతడు చక్రవర్తి కాంతరంగికుడై చక్రవర్తి హృదయము నెరుంగుచు, తాను ఢిల్లీ రాజ్యమున కధీశుడగుటకు తగు సన్నాహము లొనరించుచు, నుద్యోగపు మిషమీద మహమ్మదీయుల నాస్థానమున ప్రవేశమొనర్చి తంతు నడుపుచున్నాడు.

విన:—వాని నామధేయము ?

దేవ:—ఈశ్వరభట్టు.

విన:—ఈశ్వరభట్టుడా! ఆతని చరిత్రము నే నిదివరకే వినియుంటిని. ఔరా! కాలమహిమ! స్వార్థత్యాగియై, దేశక్షేమము పితృభభక్తి పరపరిజ్ఞానై ముఖ్యము దేశసేవ జీవితపరమావధిగా

నెంచవలసిన మంత్రులకే రాజ్యకాంక్ష పుట్టిన నిక చెప్పవలసిన దేమున్నది! అగ్నికి వాయువుసహాయమైనట్లు ఆ మ్లేచ్ఛుల భుజబలమునకును మొండితనమునకును బ్రాహ్మణమేధాశక్తి గూడ తోడుపడిన నిక నార్యావర్త సౌభాగ్య మడుగవలయునా! తరువాత?

దేవ;—తన యభీష్ట మీడేర్చుకొనుటకై, పృథివీసార్వభౌముని బంధించుటయు, మహమ్మదీయుల సహాయమున సంయుక్తను వధించుటయు ఒకటేమి....

విన:—ఆ! సంయుక్తను వధించుటా? దానివలన వాని కేమి లాభము?

దేవ:—ఆమె యందలిగాఢానురాగమున బెంగగొని చక్రవర్తి మృతి నొందిన ఢిల్లీ సింహాసనము సులభముగా లభించుననియో లేక సంయుక్త మరణమునకు పృథివీరాజే హేతువని జయచంద్రునకు నచ్చజెప్పి, పరస్పరక్రోధావేశములు మరింత బలపరచి యుద్ధము గల్పించి తన యభీష్ట మీడేర్చుగొనవచ్చుననియో....

విన:—కలహాభోక్తయగు నారదునకు కయ్యంబుల వలన లాభమేమి? ఒక్కొక్కరి నైసర్గికగుణ మది. తనకు లాభింపకపోయినను పరులది ధ్వంస మొనర్చుటయే వారి తలంపు. వందలకొలది విలువగలిగి పెద్దపెట్టెలోనున్న పట్టుబట్లను తూటులొనరించి పాడుసేయుట వలన రామబాణపురువున కేమిలాభము! అది తినదు ఇతరుల కుపయోగపడనీయదు.

దేవ:—అవు నవును.

విన:—గురువరా! నే నొకసారి యక్కడకు పోయి సంగతి సందర్భములు చూచి రావలయును. అంతవరకు మీ రిక్కడ కడు జాగరూకతతో నుండవలయును. దేశక్షేమ మెటులున్నను సంయుక్త క్షేమము మనకు మిక్కిలి ముఖ్యము. ఆమెను మీరిచట బహు

జాగరూకులై గాపాడుచుండవలయును. మంజిరి కీ సంగతి రహస్యముగా వ్యక్తపరచి నిత్య మాయుధములతో రేయింబవళ్లు కావుదలగానుండ వలయునని గట్టిగ హెచ్చరించుము.

దేవ:—అట్లనే. మరియొకమాట! పృథ్వీసార్వభౌముని యాస్థానమున గరీమను నొక మహమ్మదీయసేనాని గలడు. వాడు యీశ్వరభట్టునకు కుడిభుజమట!

విన:—కుడిభుజముగాదు. ఎడమభుజము గాదు. వాని ప్రోద్బలముచేతనే వీని కిన్ని దురూహ లుద్భవించుచున్నవి. మంచిది. ప్రతిదినమాస్థానములోని సంగతులు మెలకువతో గ్రహించుచుండవలయును సుడీ!

దేవ:—శుభకార్యసమయముల యందు తప్ప రాజదర్శనము చేసియెరుంగని నా కిప్పుడు ప్రతినిత్యము, రాజదర్శనము, రాజసభాప్రవేశము, రాజకీయాలోచనయు సంప్రాప్తించినవి. చిత్తము నాయనా?

విన:—సరే మన మిక పోవుదము. (అని చెరియొకవైపుగా పోవుదురు)

శ్రీ

# పృథ్వీసంయుక్త.

తృతీయాంకము—ప్రథమరంగము.

[పృథ్వీసార్వభౌముని సభ. పృథివీ, సుబుద్ధి, యీశ్వరభట్టు, బైరాగి, సామంతులు ప్రవేశము.]

పృథి:—మంత్రిసామంతులారా! నే నింతవరకు నివేదించినటుల పవిత్రవంతమగు నార్యావర్తము నిత్యము మహమ్మదీయ దండయాత్రలకు గురియగుచుండుటచేత, వారి నిట పాదము మోపకుండ నొనర్చి దేశమును రక్షించుభారము మనమీద నున్నది. ఈ కార్యము మన యొక్కరివలన నగునది కాదు. కావున మన దేశములోని సకలరాజచక్రంబునకు నవసరము ననుసరించి సైన్యసమేతులై సహాయమొనరింప సంసిద్ధులై యుండునట్లు సగౌరవముగ నా యాజ్ఞల నంపుడు.

సుబు:—కన్యాకుబ్జనగరాధీశునకుం గూడ వ్రాయుమని యాజ్ఞయా?

ఈశ్వ:—వారు మన కాజన్మశత్రులగుటచే వ్రాయ నవసరములేదని నా యభిప్రాయము.

పృథ్వి:—భట్టారకా! వారికిని మనకును వైరమని వా రనుకొనినను, మన కా భావ ముండకూడదు. ఆర్యావర్తసామంతరాజులందరు మనకు హితులే. విరోధులమని తలంచు జయచంద్రునకే మనము విధాయకముగ వ్రాసితీరవలయును, ఒకవేళ మనలో మనకు పర

స్పరవిరోధము లుండినను విదేశీయశత్రురాజులు దండెత్తివచ్చి నప్పు డైకమత్యము కలిగి, యందరేకీభవించి, పరరాజుల పారద్రోలుటకు సంసిద్ధులై యుండవలయును.

సుబు:—మహాప్రసాదము.

ఈశ్వ:—కాని—

బైరా:—మహాపురుషా! మంత్రులచేతి కీలుబొమ్మగాక, స్వతంత్రాలోచనయు స్వతంత్రశక్తియు నుచితానుచితజ్ఞానము గలిగి ప్రజల బిడ్డలవలె పాలించు, ధర్మదయాసత్యశాంత స్వభావములు గల నీ వంటి చక్రవర్తిని గన్నులార గాంచుటచే నే నెంతయు ధన్యుడ నైతిని. నా జన్మము కృతార్థమైనది.

పృథి:—అయ్యా! నే నిట్టి పొగడ్త కనర్హుడను. ఆర్యావర్తమున పుట్టుటయేగాక చక్రవర్తినిఁగూడ నగుటచే ప్రజలను సాధ్యమైనంత వరకు మంచిత్రోవలో బెట్టి కాపాడుట నాధర్మము. కావున నా విధ్యుక్తధర్మము నేను నిర్వర్తించు చుంటిని. సుబుద్ధీ! బత్రికఁ సంపూర్ణమైనచో జదివి వినిపింపుము.

సుబు:—చిత్తము. వ్రాయుచుంటిని. (వ్రాయుచుండును)

ఈశ్వ:—(స్వ) ఈ బైరాగి యెవ్వరో? చక్రవర్తితో నెంతవరకు బరిచయముగలదో?

బైరా:—(తనలో) ఈతడే యీశ్వరభట్టు కానోపు! రాజునకు వీనియం దెట్టి విశ్వాసమున్నదో ముందుగ తెలిసికొనవలయును. తరువాత వీనిని మందలింపవచ్చును. (ప్ర) రాజా! నీ కొలువున నీశ్వరభట్టు అను మంత్రిశేఖరుడు గలడట. అత డితడేనా?

పృథి:—ఔను. మహానుభావా! ఇతడే నాకు కుడిభుజముగ నున్న మంత్రీంద్రుడు.

ఈశ్వ:—(తనలో) ఇదియేమి! ఇత డిట్లడుగుటకు గారణంబేమి?

సుబు:—(తనలో) మా యార్యావర్తనముచేతను నక్కవినయముల చేతను బట్టు భట్టారకుడాయె. ముం దేమికానుండెనో తెలియదు.

బైరా:—ఇంతటి యోగ్యుడు మీకు మంత్రిగా లభించినందువలన మీ యదృష్టమే మనవలయును.

సుబు:—ఒక్కరి యదృష్ట మననేల! ఆర్యావర్తమున కంతకుంగూడ-

బైరా:—నివురుగప్పిన నిప్పువలెనున్న నీ మహానుభావుడు మంత్రిగా లభించుట నిశ్చయముగా నార్యావర్తమునకు మహాదృష్టమని చెప్పక తీరదు.

ఈశ్వ:—(కంగారుగా) తమ యాశీర్వచనా ప్రభావముగాని మరేమి.

పృథి:—ఆర్యా! ఈ భట్టారకుని ప్రభావ విశేషము దెలుపుట కొక చిన్న విషయము.

బైరా:—రాజేంద్రా! వీరి ప్రజ్ఞావిశేషము, వీరి రాజనీతిజ్ఞతాధా రంధర్యము, నే నెరుంగనివి కావు. వీరి దర్శన మిదివరకొకసారి చేసియే యుంటిని.

ఈశ్వ:—మహాత్మా! నాకు జ్ఞాపకము లేదు.

బైరా:—ఔను. మీరు నన్ను చూచియుందురు. ఒకవేళ జూచినను నావంటివానితో బనియేమి? జ్ఞాపకమునర్చెద నిప్పుడుకాదు.

సుబు:—(త) ఈ బైరాగి యెవ్వరో గాని మా భట్టారకుని గుట్టంతయు బూర్తిగ నెరింగియున్నట్లు కనుపించుచున్నది.

బైరా:—మహారాజా! ఈ మహమ్మదీయప్రభు వెవరు?

సుబు:—ఈయన భట్టారకమంత్రిగారి ప్రాణస్నేహితులు. ఇచ్చట సహాయసేనాధిపతిగా నుండిరి.

బైరా:—కరీము అనిన నితడేగదా!

పృథి:—అవును. మహమ్మదీయులను పారద్రోలుటలో నా కాయన మంచి సహాయము సేయుచున్నాడు.

భై రా:—అట్లనా ! సార్వభౌమా ! మహమ్మదీయులను బారదోలు టకు మహమ్మదీయుడే సహాయమొనర్చుచుండె ననుట కన్న విపరీత మింకొకటి కలదా ! ఇట్టి సహాయము చేకూరజేసిన మీ భట్టారకమంత్రి రాజనీతిజ్ఞత నెంతయు గొనియాడవలసి యున్నది. ఆర్యావర్తమా ! నీకెట్టిదినములు—

పృధి:—ఆర్యా ! అట్లనుచుంటి రేమి ?

భై రా:—నీవును ఆర్యావర్తమును చేసిన పూర్వపుణ్యమువశమున మీ కిట్టి ప్రభుభక్తిపరాయణులును విశ్వాసపాత్రులును అయిన మంత్రి సేనానులు లభించిరను యానందముచే నట్లంటిని.

సుబు:—(త) ఇక నేమి ! ఈభైరాగి యెవరో భట్టుచేయు కుట్రలన్ని యు బూర్ణముగా గ్రహించినవాడు గాని సామాన్యుడుగాడు.

కరీ:—క్యా? భట్టాజీ ! ఈఫకీర్ యేమిమాటల్ సెప్తార్ ! మాకీ కొంచెం బోలో !

ఈశ్వ:—(స్వ) నోరు మూసికొని యూరకుండక గొడవలోనికి దిగ నెంచుచున్నాడు. ఏమి కొంపమునుగునో ! (ప్ర) తరువాత స్థిమితముగా చెప్పెదను. ఇప్పుడు కాదు.

భై రా:—అయ్యా ! మీకుం గ్రమముగా బోధపడును. తొందర పడకుడు.

పృధి:—మంత్రీ ! ఉత్తరము వ్రాయుట యైనచో చదివి వినిపింపుము.

సుబు:—మహాప్రసాదము. (అని చదువును.) రాజపుంగవా ! మన యార్యావర్తము పూర్వులనాటియుండియు సర్వసౌఖ్య సౌభాగ్యమహిమలచే నలరి యీ మధ్యమున మ్లేచ్ఛుల దండ యాత్రలకు గురియై యష్టకష్టము లనుభవించుచున్న సంగతి మీకు దెలియనిదిగాదు. ఈ దండయాత్రల వలన మన దేశము నకు సంభవించిన విపత్తులు దలంపునకు వచ్చినచో నెట్టి రాతి

గుండెఱ్ఱైనను గరుకక మానదు. భగవత్కృపచే నా దుర్దినములు నశించి, దేశము సుభిక్షముగ నుండెనని సంతసించునంతలో మరియొక మహమ్మదీయ దండయాత్ర సిద్ధముగ నున్నదని మీరు గూడ నెరింగియే యుందురు. ఇట్టి సమయమున మన ముపేక్ష వహించినచో దేశ మధోగతి పాలై, మన కపయశంబు వాటి ల్లును. పుణ్యభూమియు గర్మభూమియు నగు మాతృ దేశమును మన మందరమేకమై విదేశీయుల బారినుండి రక్షించుట మన విధియై యున్నది. కావున స్నేహపూర్వకమగు నాయీ విజ్ఞాపన మంగీకరించి మీ రందరు, మీ మీ సైన్యములతో స్వదేశరక్షణ మున కాయత్తముగ నుండు. భారత రాజ్యప్రతిష్ట నిలిపి యా చంద్ర తారార్కకీర్తులం గాంచుడు. పరస్పరవైరుధ్యభావముల విడచి పర స్పర స్నేహసహాయభావము, హృదయముల ప్రతిష్ఠింపుడు. ఇట్లు-

ఈశ్వ:—లేఖ బహుయుక్తియుక్తముగ నున్నది.

బైరా:—మంత్రిశేఖరా! పేరునకు దగినట్లు వ్రాసితివయ్యా!

పృధ్వీ:—ఏదీ లేఖ?

సుబు:—(ఇచ్చి యానందించుచుండును)

పృధి:—(చూచి) మనము ఘోరశత్రులమని యనుకొనుచున్న జయ చంద్రుని లేఖలో నీకడపటి వాక్యములు గూడ వ్రాయుట మంచిది. (అని వ్రాయును)

బైరా:—రాజేంద్రా! అది యుందరు వినదగినచో......

పృధి:— అట్లనే! అంతకన్నా!

మ. అరయం గ్రోధము లేదు నీయెడ నృపాలా! నమ్ము మింకన్ బర
స్పరవైరంబులు ధారుణీపతుల భ్రష్టశ్రీకులం జేయు, నం
దర మేకంబయి భారతీయ నిజ దోర్ధామజ్వలద్వహ్నిము
ష్కరులౌ మ్లేచ్ఛుల వ్రేల్చి దేశయశముం గావంగ ధర్మంబగున్.

బైరా:—(సంతోషముతో) ఆహా! అఖండభారతరాజ్యమున కేకచ్ఛత్రాధిపతివై దిగంతదంతురయశోవిరాజితుండవై హయమేధాధ్వరవినిర్జితరాజచక్రుండవై పరిపంథిదుర్వారనిర్వక్ర విక్రమకాంతారదావపావకుండవై వెలుంగు పృథివీశునంతటి సార్వభౌముం డొక సామాన్యసామంతున కిట్లు కేవల దేశగౌరవ మపేక్షించి సౌహార్దయుండవై లేఖనంపుచుండెనన నా సార్వభౌముని రాజనీతిజ్ఞత సర్వసమత్వబుద్ధి దేశభక్తి ప్రజాక్షేమాభిలాషముపరశ్రేయోసహనబుద్ధియు వేనోళ్ల చాటుటగదా! సప్తసముద్రముద్రిత మహీచక్రపర్యంతనివసద్రాజలోకం బంతయుం గాంచితిని గాని, యిట్టి మహారాజును గాంచలేదు. సార్వభౌమా! నీసంఘీభావవిజ్ఞప్తి దేశ ప్రజాపురోభివృద్ధికి రాజ్యగౌరవాభివృద్ధికి మూలసూత్రము. నీవంటి సార్వభౌమునిచే బరిపాలింపబడుచున్న నీ భారతరాజ్యలక్ష్మి మహాపుణ్యవతి. అఖండ తేజో రాజితుండవై దీర్ఘాయుష్మంతుండవై నీ భారతభూమి నుద్ధరించెదవుగాక! సార్వభౌమునకు జయమగుగాక! భరతమాతకు జయమగుగాక.

అంద:—(జయధ్వనులొనర్చుచున్నారు.)

సుబు:—మానీంద్రా! భవ దాశీస్సు లమోఘంబులగుగాత.

ఈశ్వ:—(తనలో) మంత్రిసుబుద్ధి యీ సన్యాసితో పూర్ణముగ నేకీభవించినాడు. రావణా స్వస్తిరాఘవా స్వస్తియను వీని మాటలకు విలువయేమి! కానిమ్ము (తలపంకించును.)

కరీ:—(కంగారుతో) భట్టాజీ! మాకీ క్యాఫాయదా! తెలింగిబాత్ మాలుం నహిహై. ఫిర్ ఆతాహుం. (లేచి) మహారాజ్! మాకీ సెల్యూ దేదేవ్ సలాం. (నిష్క్రమించును.)

పృధి:—సుబుద్ధీ! పత్రికల నతిత్వరితంబుగ పంపుము. నేటికిసభ ముగింతము.

(పృథివీ సుబుద్ధి ఈశ్వరభట్టు సామంతులతో నిష్క్రమించుచుండగా.)

బైరా:—(ఈశ్వరభట్టు వద్దకేగి) భట్టారకా! మీతో రహస్యవిషయంబులు గొన్ని ముచ్చటింపవలసి యున్నది.

ఈశ్వ:—(తనలో) ఆ రహస్యవిషయము లెరుంగవలసియే యున్నది. (ప్ర) దానికభ్యంతరమేమి! అట్లనే!

పృథి:—(పై సంభాషణము విని తనలో) వీరిరువు రేదియో రహస్యాలోచనము సేయుచున్నట్లున్నది. ప్రచ్ఛన్నముగ నుండి గ్రహించెదనుగాక. (నిష్క్రమించును)

(సన్యాసియు నీశ్వరభట్టునుగాక మిగిలినవారందరు నిష్క్రమింతురు)

బైరా:—(ఇటు నటు జూచి) మాట్లాడుకొనవచ్చునా!

ఈశ్వ:—ఏమియు నభ్యంతరములేదు. కాని మీరెవ్వరు?

బైరా:—నేను జయచంద్రుని గూఢచారుడను.

ఈశ్వ:—అట్లనా! ఆ?

బైరా:—పృథ్వీరాజపరిపాలన మెట్లున్నది?

ఈశ్వ:—సర్వజనసమ్మతమై జగద్విఖ్యాతముగ నున్నది.

బైరా:—దానికేమి గాని, యితడు జయచంద్రునకు గర్భశత్రువై యుండియు, వాని కుమార్తెయగు సంయుక్తను వరించియుండుట నిజమేనా?

ఈశ్వ:—మహారాజు నోటనుండి యీ మాట నే నెన్నడును విని యుండలేదు గాని యట్టి ప్రతీతిమాత్రము లేకపోలేదు.

బైరా:—అం దెంత సత్యముండును.

ఈశ్వ:—అంతయు సత్యమై యుండవచ్చుననియే నా నమ్మకము.

బైరా:—అట్లయినచో నిది జరుగనీయగూడదు. ఏలనన, జయచంద్రునకు వీనికి గల విరోధ మీ దాంపత్యము వలన బాంధవ్యముగా మారి పరస్పరక్షేమ మేర్పడును. అది మాత్రము నాకు—

ఇచ్చట నెవరును లేరుగదా? (అటు నిటు జూచి వచ్చి) కేవల మిష్టములేదు. ఏలనన, మీ రిరువురకు గలిగియున్న మనస్పర్ధల నభివృద్ధినొనర్చి, మహమ్మద్గోరీ సహాయమొనర్చికొని, యీ చక్రవర్తిని పదభ్రష్టునిగానొనర్చి, నీతో నేకీభవించి దేశము స్వాధీనమొనర్చుకొను నూహతో నీ సంపూర్ణసహాయ మపేక్షించి వచ్చితిని.

ఈశ్వ:—(తనలో) ఈతని మాటలు నమ్మదగినవియా? లేక నేను చేయుచుండిన రహస్యవిధానము నంతయు గ్రహించి యిత డిట్లు మాట్లాడుచుండెనా? (ఆలోచించి) ఇతడు గూడ నాపగిదినే రాజ్యకాంక్షచే నా సహాయము బడయగోరి వచ్చినమాట సత్యము. అంతియే గాని, బ్రహ్మభేద్యములగు నా తంత్రోపాయంబు లిట్టి జీవమాత్ర చరితార్థులకు గోచరించునా? అట్టి యవకాశ మెన్నడును గలుగదు. ఇతనిని జేపట్టి యుంచుట మిక్కిలి మంచిది. (ప్ర) తరువాత!

భైరా:—అమాత్యశేఖరా! నేను గేవలము సన్యాసినిగాను. ఆహవరంగమున కేవల కరవాలసహాయుండనై శత్రువీరుల దునుమాడి రణరంగ తంత్ర దురంధరుండనై వన్నెకెక్కిన బ్రాహ్మణవీరుండను. నీ ప్రాపుగోరి నీకు సహాయుండనై బిలువనే తెంచినవాడను. (జందెమును ముట్టి) గాయత్రీసాక్షిగ నన్యచింతనముతో నాకు బనిలేదు.

ఈశ్వ:—(తనలో) వీని మాటలు సత్యములు. ధోరణినిబట్టి చూడ బ్రాహ్మణశూరునివలెనే గన్పించుచున్నాడు. సాటివాడు నాకు సహాయుడై లభించిన నిక శత్రుజయమదెంత! (ప్ర) మహాత్మా! మీ యథాస్థితి నే నిదివరకే గ్రహించితిని. కాని మన బ్రాహ్మణులకు రాజ్యమొందులకా అని!

భైరా:—అదియేటిమాట! ఈరాజులకందరి కెందులకో మనకు సందులకే. నీకక్కరలేదే మోకాని నాకుమాత్రము నిశ్చయముగా గావలయును. ఇదంత్రాత్ర మిదం బ్రాహ్మ్యం, శాపాదపి శరాదపి యను బిరుదు గాంచిన, సద్గగణ్యమగు బ్రాహ్మణకులంబున బుట్టి, లోకంబులు రాజ్యంబులు తల్లక్రిందులొనర్పగల బుద్ధిశక్తి గలిగి, యీరాజులకు సేవకులమై యనామధేయులమై జీవమాత్ర చరితార్థులవలె జీవించుటకంటె నపౌరుషము నజ్ఞానము హైన్య ము విచారము దూష్యము కలదా? పార్థునకు శ్రీకృష్ణుని వలె నీకు నే నండగా నిలుచుండిన, త్రిలోకంబుల నీ కడ్డు కలుగునా! నీ విట్లు ధైర్య పడవలసిన యవసరమేమి? అన్ని విధ ముల సహాయమొనర్చుటకు సామంతు లనేకులుండిరి. అందులో జయచంద్రుడు మన కాప్తుడు.

ఈశ్వ:—(కౌగలించుకొని సంతోషముతో) నాయనా! సాటివాడవు. నోటితో చెప్పి చేతితో జేయగల సమర్థత గల్గిన వీరుండవు. ఇంత కన్న నేమి కావలయును. నీహృదయము గనిపెట్టుటకట్లు మాట్లాడి తిని గాని యన్యథాగాదు.

భైరా:—నేను చెప్పునది సావధానముగా వినుము.

ఈశ్వ:—నాయనా! మన ప్రయత్నములకు భగవంతుడు గూడ తోడ్పడవలయునుగదా?

భైరా:—దైవము మనకు తోడ్పడక వీరమ్మన్యులకు దోడ్పడునా? సాహసవసతిలక్ష్మి. రాజ్యలక్ష్మి సాహసలక్ష్మీసంపన్నులనే వరి యించి విజయవల్లిరంబున కర్పూరహారతి నొసంగి కౌగలించును. రాజనీతి కోవిదుండవగు నీకు నేనువేరుగ చెప్పవలయునా? ఆర్యా వర్తమును క్షత్రియులు పరిపాలించిరి. క్షత్రియేతరులు పాలించిరి. ఇక నీవు కడనటి పట్టభద్రుండవై, సార్వభౌముండవై, బ్రాహ్మణ

పరాక్రమము ప్రతిభ వెదజల్లి బ్రాహ్మణవంశముల నుద్ధరింప లెమ్ము. సమరసన్నాహుండవుగమ్ము.

ఈశ్వ:—నాచిరకాల వాంఛిత మీడేర్పగల పుణ్యాదినము నీ సహాయమున నే డుదయించినందులకు సంతసించుచుంటినిగాని ముందు ముందు మనలో మనకు బరస్పరస్పర్ధ లొనగూడునేమో యను భయంబు గలుగుచున్నది.

బైరా:—అయ్యా! ఖడ్గము జేబూని వైరివీరసంహారమొనర్ప గలను గాని, రాజ్యపరిపాలనాశక్తి, శాంతము, దూరదృష్టి, తంత్రధారేయత నాయందుమృగ్యములు. ఈషణ్మాత్రమైన కన్పింపవు. నాకువచ్చిన లోటదియే. మీరు ఢిల్లీసింహాసనం బధిష్టించి, సార్వభౌములై యున్నపుడు నాకు సర్వసేనాధిపత్య పదవియొసంగిన జాలును. బ్రాహ్మణ సార్వభౌమత్వ మేర్పరుపవలయుననియే గాని, రాజత్వము గావలయుననుకోరిక (జందెము ముట్టి) గాయత్రీ సాక్షిగ నాకెన్నటికినిలేదు. తెలిసినదా. ఇక పృధ్వీరాజ జయచంద్రులకుఁ బరస్పర స్పర్ధలుగల్పించి, యుద్ధసన్నద్ధులుగా నొనర్చు పూచీనాది. సుల్తానుఘోరీతో నుత్తర ప్రత్యుత్తరంబులు జరిపి వాని నీ దేశమునకు రప్పించి, వానిచే నీ రాజవర్గంబుల బరాజితులంజేయు భారమునీది. తెలిసినదా? ఇదివరలో నీ ప్రయత్నమెంతవరకు గొనసాగినదో తెలియ గోరుచుంటిని.

ఈశ్వ:—ఆ...(అని చెప్పబోయి సందేహించి యూరకుండును)

బైరా:—మరెందులకుగాదు. సంశయించకుడు. దానిని బట్టి భావి కర్తవ్య మాలోచించుటకును, ప్రకృతరంగ మెచ్చటనుండి ప్రారంభింపవలయునో తెలిసికొనుటకును, వీలుగ నుండును. నన్నన్యథా తలంచిన నీ యాశాసౌధము భగ్నమగును.

ఈశ్వ:—మనఃపూర్వకముగ నిన్ను నమ్మితిని. స్వామిద్రోహ మొనర్ప నని ప్రమాణ మొనర్పుము.

బైరా:—మన బ్రాహ్మణులకేమి! స్వామి ద్రోహమేమి? గాయత్రీ సాక్షిగ ద్రోహ మెన్నటికిని జేయువాడనుగాను.

ఈశ్వ:—సుల్తాను గోరీతో నీ కరీము ద్వారా షరతులన్నియు మాట్లాడితిని. వర్తమాన మంపినతోడనే సర్వసైన్య సమేతుడై వచ్చి యీ పృథ్వీరాజును పదభ్రష్టునిగా నొనర్చి నాకు ఢిల్లీ సింహాసనాభిషేక మొనర్చుటకు సంసిద్ధుడై యున్నాడు.

బైరా:—చాల సంతోషము. అయిన నాకిచ్చుట పనిలేదు. ఇక సంయుక్తను జంపు ముఖ్య కార్యమున్నది.

ఈశ్వ:—(త్రుళ్లిపడి తనలో) పృథ్వీరాజ జయచంద్రులకు సంబంధముండకుండ జేయుటకుగాని నా ప్రయత్నవు టూహాలీతడు గ్రహించియనుచున్న మాటగాదు.

బైరా:—ఊరకొని యెదరేమి! ఆ కార్యమునకు నేనే సమర్థుడనని మీకిదివరకే చెప్పితిని. సంయుక్తను కడతేర్చితిమేని రాజ్యమంతయు సునాయాసముగా మనచేతజిక్కగలదు. అందుకు సందేహమావంతయు లేదు. అవునా? కాదా?

ఈశ్వ:—(సంతోషముతో) మిత్రమా! నీ రాజతంత్రోపాయశక్తికి చాలసంతోషించితిని. ఆ కార్యము బహు ముఖ్యావసరము. కాని యీ విషయములో నా ప్రయత్నములన్నియు విఫలములైనవి. ఇంకను ప్రయత్నము చేయుచునే యుంటిని. భగవంతుడు నీవు వారొనినట్లే కార్యము నీపాలబడవైచినాడు.

బైరా:—(తనలో) ఓరీదురాత్మురుడా! దేశద్రోహీ! రాజద్రోహీ! నీకెట్టి దుర్బుద్ధిపుట్టినదిరా! (ప్ర) అవును! నాడర్ధరాత్రమున ... అదియా ఔను. అదికొనసాగలేదు.

ఈశ్వ:—ఆ! అది నీకెట్లు తెలిసెను?

బైరా:—నేనుగూడ నాప్రయత్నములోని వాడనే గనుక. మనమీ సామ్రాజ్యమే నే కాళికాలయమునను... ఆ! అట్లుంటివేమి?

ఈశ్వ:—ఏమియునులేదు (తనలో) సంయుక్తను వధింప నే బన్నిన యెత్తులన్నియు నెరింగి, అది స్థిరపచుకొనుటకై యున్నియు నానోట బ్రేలించుచుండుటలేదు గదా! ఏమో! అనుమానముగనున్నది.

బైరా:—సందేహించుచుంటివేమి? ఆ ప్రయత్నము సఫలముకాదనియా? లేక....

ఈశ్వ:—ఆర్యా! మీ హృదయము నరయగోరి మీ కనిష్టముగ మాట్లాడుట కిష్టములేక యిట్లు ప్రసంగించితిని గాని నామాటలు యధార్థములనియే విశ్వసించితిరా?

బైరా:—అట్లనా! పోనిండు. నాకు పోయినదేమి? కాని నిశ్చయముగా త్రికరణశుద్ధిగా మీకు రాజ్యకాంక్ష లేదా?

ఈశ్వ:—బ్రాహ్మణునకు నాకేల? నిశ్చయముగ లేదు.

బైరా:—(కోపముతో) ఓరీ! దేశద్రోహీ! చండాలా! స్వలాభాపేక్షచే మ్లేచ్ఛుల నాశ్రయించి తినిన యింటివాసములు లెక్కించి పవిత్రవంతమగు హిందూసామ్రాజ్యలక్ష్మిని పరాధీనముచేయ దలపెట్టి సమస్తతంత్రంబులు నడిపించు నీకు రాజ్యకాంక్షలేదా?

ఈశ్వ:—మునీంద్రా! నాహృదయమును తెలిసికొనలేక పరబోధనలు విని పొరబడి మీ రిట్లువల్కుచుంటిరి. క్షమింపుడు.

బైరా:—(కోపముతో) పరమదుర్మార్గా దేశద్రోహీ! స్వామిద్రోహీ! అర్థకాంక్షచే పరమపవిత్రమగు నార్యావర్తమును చేతులార మ్లేచ్ఛులకు నొప్పగించి, దైవసమానుడును ప్రజానురంజకుడును ధర్మాత్ముడు నగు సార్వభౌముని కాంతరంగిక మిత్రుడవై స్వామి ద్రోహమొనర్ప నెంచిన నీ యిట్టి కృతఘ్నుని పశుప్రాయుని

కృతఘ్నుని ద్రోహిని తలద్రొక్కి ముక్కముక్కలుగా జీల్చి కాకులకు గ్రద్దలకు నెగురువైచినను పాపములేదు. ఓరీ! నీచా! బ్రాహ్మణరూపచండాలా! నీవు చక్రవర్తిని పదభ్రష్టునిగానొనర్చి చంపదలంచిన యూహకు సంయుక్తను బలిసేయ పన్నిన పన్నాగములకు జయచంద్ర పృథివీసార్వభౌములకు ఘోరవిరోధంబు గలుగఁజేసిన దుర్ణయమునకు స్వదేశరాజులలో పరస్పరైక్యములు చంపిన దోషమునకు స్వదేశమును పరాయివాంఛ పాలొనర్పదలంచి చేసిన తంత్రములకు మదీయక్రూర కరాళనిస్త్రింశధారను నీతల ద్రుంచినను పాపములేశమైనను లేదురా! (కత్తిదీసి నరుకబోవు చుండగా పృథ్వీరాజు తొందరగా ప్రవేశించి.)

ఆఁ ఆగు! మాగుము! (అని ఖడ్గము బట్టుకొనును.)

బైరా:—(కోపము తగ్గి) ఈ స్వామిద్రోహిని చంపకుండ నన్నాపెదవేమి? ఇట్టి ద్రోహులను కొల్వున జేర్చికొని విశ్వాసపాత్రులవలె సన్మానించి, అంతరంగికులవలె నాదరించు నీ యట్టి వెర్రి రాజు గలడా! (ఖడ్గముదింపును)

పృథి:—మహాత్మా! అది దేశదురదృష్టము. నా యభాగ్యము గాని వేరొండు గాదు. మీరు రహస్యముగా ముచ్చటింపవలయునని యతనితో చెప్పుచుండ విని వైరిరాజసభనుండి వచ్చిన గూఢచారులని తలంచి యీ ప్రక్కనే నిలిచి, మీ సంభాషణ యంతయు నామూలాగ్రంబుగా వింటిని. వైరులనుకొనిన మీరు నాకు ప్రాణమిత్రులైతిరి. ప్రాణమిత్రుడని గాఢముగ నమ్మి, ఆరవప్రాణమువలె నారాధించుచున్న యీ మంత్రి నాకు బలవద్విరోధియయ్యెను. భట్టారకా! నీ విట్టి ద్రోహివై నా నాశనంబున కింత ప్రయత్నించుచుండుటకు నేను నీకొనర్చినఁ యపరాధమేమి? ఆహా!

మ. పరమాప్తుండని నమ్మి మంత్రియని సంభావింపగా మండలే
శ్వరులన్ మ్లేచ్ఛుల నా పయిందివిచి నన్ జంపించి, యీరాజ్యమా
కఱకుం దుర్కల చేతఁబెట్టుటకు సంకల్పించి, యీ కుత్రకుం
గురిగాఁ జేయుదు వం చెరుంగ నయితిన్ గుచ్చెళ్ళలో త్రాచునై.

బైరా:—(తీవ్రముగా) సార్వభౌమా! ఈ తుచ్ఛుని ప్రాణంబులతో నుంచిన నీకేగాదు దేశమునకెల్ల దుర్భరావస్థతటస్థింపచేయగలడు. పామునైన బ్రదుకనీయవచ్చును గాని, యిట్టి కృతఘ్నుని బ్రతుకనీయరాదు. ఇట్టికుచ్ఛితులకు కుతంత్రరోగ పీడితులకు దహాన సంస్కారమే మందు. లేకున్న నా యంటువ్యాధి లోకమునకెల్ల బాధ గలిగించును. మదీయోగ్రకృధా కాల కరాళవహ్ని......
(అని కత్తితీయును)

వృధి:—(అడ్డమువచ్చి) ఎట్టి ద్రోహియైనను, యెట్టి క్రూరుడైనను, అతడు బ్రాహ్మణుడు. జగంబున బ్రాహ్మణునకు దైవమునకు భయపడినట్లు నేను కాలయమునికైనను భయపడను.

బైరా:— (శాంతించి) ఈ క్రూరునికి శిక్షయేమివిధించెదరు?

వృధి:—సేవకా!

[సేవకుడు ప్రవేశము.]

సేవ:—మహాప్రభూ! ఏమి సెలవు?

వృధి:—(తీవ్రముగా) రాజద్రోహియు, దేశద్రోహియు నగు నీ యీశ్వరభట్టును, నితని ప్రాణమిత్రుడగు కరీమును మన రాష్ట్రపు నరి హద్దులనుండి దాటించి, యావల విడిచిపెట్టి రావలయునని నా యాజ్ఞగా సేనాధిపతితో చెప్పుము.

బైరా:—బ్రాహ్మణుడవు గనుక బ్రదికిపోయితివి.

సేవ:—మహాప్రసాదము. (ఈశ్వరభట్టును దోడ్కొని నిష్క్రమించును)

పృథి:—మహాత్మా! తామెవ్వరోగానినన్నును, నాదేశమునురక్షింప జనుదెంచిన మహనీయులు. కృతజ్ఞతామనఃపూర్వక వందనంబు తప్ప తమఋణం బెట్లీగువాడను? (నమస్కరించును.)

బైరా:—దీర్ఘాయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధిరస్తు. నాకు తామట్టి మనఃపూర్వక వందనము లొనర్చుటకు నేను మీకొనర్చిన ఘన కార్య మేమియు లేదు. నేను 'గూడ మీవలెనే యీ భారత భూమిపై జన్మించితిని. దేశగౌరవము నిలువబెట్ట దేశక్షేమము గోరి దేశభక్తులై మీరెట్లు పాటుపడుచుండిరో, అట్లేభారతీయుడ నగుటచే నా శక్తికొలది పాటుపడుట నా విద్యుక్తధర్మము. దేశారాధితుండును, దేశభక్తుడు నగు నీయట్టి సార్వభౌముని సభలో నిటువంటి దేశద్రోహు లుండుట తెలిసికొని, స్వయముగా దాని యాధార్థ్యము నెరింగి, వెల్లడించు నూహతో నీసభ కుం జనుదెంచితి. నేను నొక భారతదేశ సేవకుడను. మీ సంశయాశయనులు మున్ముందు మీ కవగతంబగుగాత. (నిష్క్రమించును)

పృథి:—(నాశ్చర్యము తో నాలోచించుచుండును. తెరపడును.)

## ద్వి తీ య ర ం గ ము.

[ఈశ్వరభట్టు ప్రవేశము]

ఈశ్వ:—ఆ నాడు బైరాగివేషగానితో చేసిన తెలివితక్కువ సంభాషణ వలన జన్మభూమికి దూరస్థుడ నైనను, నాకీ ప్రవాసమే యన్నివిధముల బాగుగ నున్నది. ఈ జయచంద్రుని సంస్థానమున నక్కడికంటె మహా గౌరవంబుగను మహదానందముగను ఉన్నది. నా ప్రజ్ఞావిశేషాతిశయముచే నిక్కడ సంపాదించిన యమాత్యపదవి వలన మహమ్మదీయప్రభువులతో సంధి విగ్ర

హాది రాజకీయ కార్యంబుల నుత్తరప్రత్యుత్తరములు స్వేచ్ఛగ జరుపుటకును, చిరకాలవాంఛాయత్నసఫలీకృతుడ నగుట కనువగు పన్నాగములొనర్చుటకును కావలసినంత వీలుగనున్నది. ఈ జయచంద్రుడు నామమాత్రుడుగా నే నెటుల ద్రిప్పిన నటుల దిరుగు కీలుబొమ్మవలె నున్నాడు. విశ్వాసపాత్రుడును, హితైషుడు నగు వినయశీలునివంటి యమాత్యునిగూడ విడిచి నాకు స్వాధీనుడై యుండెను. కానిమ్ము. (ఆలోచించి) ఘోరీదర్శనార్థము లాహోరున కరిగిన వార్తాహరు డింకను రాకుండుట కేమి హేతువు. పగతుర చేతిలో బడియుండడుగదా? నేడో రేపో జరుగనున్న సంయుక్తా స్వయంవరమున పృథివీరాజున కవమానము జరిగితీరును. తదనంతర మా నృపతుల కిరువురకు సంగరము సమకూరక తప్పదు. జయచంద్రపక్షమున ఘోరీ సైన్యసమేతుండై వచ్చి పృథివీసార్వభౌముని పీచమడంచక మానడు. నా తంత్రోపాయ ధురాధౌరేయత కెదురెక్క బైరాగులు సన్న్యాసులు యేమికాగలరో తేలగలదు. ముందు పృథివీసార్వభౌముని, తరువాత నీ జయచంద్రుని ఘోరీసుల్తానుచే నోడింపించి, కొంత ధనమొసంగి వానిని లాహోరున కంపి, ఢిల్లీసింహాసనాసీనుండనై ఏకచ్ఛత్రాధిపతినై సమస్తప్రపంచంబు నా రాజనీతితత్వజ్ఞానమునకు సంతసించునట్లు భూవలయమెల్ల నేలుదునుగాక.

గీ. రాజ్యముల సృష్టిసేయంగ, ప్రాజ్యరాజ్య
వైభవము రూపుమాపంగ బ్రాహ్మణుండె!
వసుధ నేతాదృశప్రతిభావిశేష
మబ్బునే సృష్టియందు నేవ్యక్తికైన!

(నిష్క్రమించును)

శ్రీ

# పృథ్వీ సంయుక్త.

చతుర్థాంకము - ప్రథమరంగము.

[సంయుక్తా స్వయంవర మంటపము. జయచంద్రుడు వినయ శీలుడు, ఈశ్వరామాత్యుడు, అనలుడు, పురహారుడు, సింధు కాశ్మీ రాది దేశభూపాలురు, సంయుక్త, మంజరి ప్రవేశము]

జయ:—రాజచూడామణులారా ! ఈ స్వయంవరము కతంబున మీ యందరి దర్శనంబులు చేకూరినవి. కృతార్థులమైతిమి.

పుర:—నీ సుగుణసంపదయు, నీ కుమార్తె రూపురేఖా సౌందర్య ములు దీనికి గారణంబులు.

సింధు:—జయచంద్రా ! పృథ్వీరాజసార్వభౌముడు రాలే దెందుచేత ?

అన:—వానికి లేఖ నంపియుండకపోవుటచేత.

కాశ్మీ:—సింధుధరాధిపా ! కన్యకామణిని తమకిచ్చువచ్చినవారికెవ రికో యీయదలంచిరి కాబోలు.

జయ:—పృథివీసార్వభౌము లిదివరకే దయచేసియుండిరి. వారిని దోడ్తేర మా మంత్రి వినయశీలుడు వెడలనుండెను.

విన:—(తనలో) ఔరా ! ఎట్టి దుర్మార్గము! ఇట్టి నీచకార్యము జయచంద్రునివంటి రాజమాత్రుడు చేయదగినది గాదు.

జయ:—వినయశీలా ! నీవు వెడలి చక్రవర్తి నుచితగౌరవంబులతో దోడ్కొనిరమ్ము.

విన:—అందరు వచ్చినరీతినే వారును రాగలరు. ప్రత్యేకప్రయత్న మెందులకు?

ఈశ్వ:—వారు మనకు విరోధులు గనుక ప్రత్యేకము మరియొక సారి యాహ్వానించుట మంచిదని.

సింధు:—ఏమీ! సకలజనసమ్మతుండగు చక్రవర్తి మీకు విరోధియా? అతనికి మాత్రము జగంబున నేవిరోధియు లేడు. అట్టి సార్వభౌముడు మీకు బలవద్విరోధియగుట కేవల మాశ్చర్యకరము.

అన:—ఆశ్చర్యమేమున్నదిందు?

పుర:—ఒకరికి స్నేహితులగువారు మరియొకరికి విరోధులు కాగూడదా? అట్టి నియమ మెచ్చటనుండును?

ఈశ్వ:—ఏ ధర్మశాస్త్రమునందును గనుపించదు.

విన:—ఇటువంటి ధర్మశాస్త్రప్రశంశకు యీ భట్టారకులే ప్రమాణము. (తనలో) స్వయంవరనాటక మారంభమగుచున్నది. చూచుచు నూరకుండిన స్వయంవరరంగము రణరంగముగ మారగలదు. కానిమ్ము (ప్ర) సింధుభూపాలా! సర్వలోక సమ్మతుండగు సర్వేశ్వరుడే కొందరి కనను కూలుం డగుచుండ సత్పురుషుండైనను సామాన్యమానవమాత్రుండగు చక్రవర్తి తోటివారి కీర్ష్యాపాత్రుడగుటలో నాశ్చర్య మేమున్నది!

జయ:—(తనలో) ఈ మంత్రి నాహృదయము గనిపెట్టి మాటలాడువాడు గాడు. అందుచేతనే వీనియెడల నాకుండిన పూర్వగౌరవము గూడ నశించినది (ప్ర) వినయశీలా? చక్రవర్తిగారి నిటకుం దోడ్కొనిరమ్ము.

విన:—సర్వసమర్థులగు నీశ్వరామాత్యులే యీ పనికి దగినవారు. ఆ గౌరవసత్కారములందు వారికధికానందము. వారే పోవుదురుగాక.

జయ:—ఈశ్వరామాత్యా!

ఈశ్వ:—(తనలో) ఈ వినయశీలుఁడు మహారాజు నాజ్ఞకూడ నుల్లంఘించుచున్నాఁడు. ఈ తరుణమున రాజాభీష్టము నెరవేర్చి మెప్పు బడసి తరువాత వీని పని బట్టించెదగాక. స్వయంవరము సులువుగా తేలునట్లు కనుపించదు. కాని పృథ్వీరాజ్ సకల భూపాల సమావేశ సమక్షమున పరాభవింపబడినప్పుడు కండ్లార జూచు మహాభాగ్యముకంటె నిక నాకు కావలసినదేమి (నిష్క్రమించును.)

విన:—(తనలో) ఈ యానందమునకు తగిన ప్రతిఫల మచిరకాలంబు ననెయనుభవించెదవు గాక.

[ పృథ్వీ సమరసింహుల విగ్రహములతో నీశ్వరామాత్యుఁడు ప్రవేశించును.]

సంయు:—(తనలో) ఆహా! నా మనోహరు నెట్టిరీతిని జూడవలసి వచ్చినది.

జయ:—రాజన్యవరులారా! పృథ్వీచక్రవర్తులు దయచేసినారు. మీరందరు వారి నాహ్వానింపవలయును లెండు. (చూపుచు) ఇతడే ఆసేతుహిమాచలపర్యంత భూవలయ మేలు సార్వభౌముడు. ఇతడే రాజకులైకభూషణుడు. ఇతడే మహాగుణగణసంపన్నుడు. సకలనృపాలసింహాలంకృతంబగు నీ సభను జూడ ప్రతిమాకృతితో వచ్చిన పృథ్వీచక్రవర్తి. (రెండవ విగ్రహముం జూపుచు) వీరు పృథ్వీరాజ సార్వభౌముల బావమరదులు. సమరసింహ మహారాజులుం గారు. సార్వభౌమునికి వలె వీరికి గూడ సపర్యలు జరుగవలయును.

కాశ్మీ:—జయచంద్రా! ఏమి యీయాశ్చర్యము?

అన:—ఇందాశ్చర్య మేమున్నది. నలువురకు దెలియునట్లుగా నుచితరీతిమర్యాదచేసినారు.

సంయు:—(తనలో కోపముతో) అనన్య సామాన్య బలపరాక్రమ సాంద్రుండగు సార్వభౌముని నే పరాభవింప సాహసించిరిగా?

కాశ్మీ:—(తీవ్రముగా లేచి) ఈ మహాసభలో నొక్కరును మాట్లాడ కూరకుండిరి. ఇట్టి కార్య మనుచితమనిగాని, అధర్మమనిగాని చెప్పిన వా రొక్కరును కనుబడకుండుట శోచనీయము. జయచంద్రా! ఈ నీచపుబుద్ధి నీకే పుట్టినదా లేక యితరులెవరైన బోధించిరా? ఇది యేటి సరసము యేటి సాంప్రదాయము యేటిగౌరవము. చక్రవర్తిని సామాన్యునిగా తలంచి పరిభవించ సమకట్టిన నీ సాహసమున కేమనవలయును. ఇట్టి పేరోలగంబున నద్వితీయుండును జగద్విఖ్యాతపురుషుండును లోకోత్తరగుణుండును మనకందరకు సార్వభౌముండునగు పృథ్వీరాజసింహుని నవమానించెదవా? ఇట్టి నీచకార్యము మావంటి క్షత్రియాన్వయులు కండ్లార జూచి భరించ చాలుదురా.

ఈశ్వ:—విరోధియగు నీ చక్రవర్తి స్వయంవరమున కాహ్వానము లేకుండ రాడని యెంచి యీ లోటు తీర్చుటకై యిట్లు....

జయ:—విలాసార్థముగ జేసిన దానికి మీకింతగా....

సింధు:—(కోపముతో) ఆ! ఏమి? చక్రవర్తిని పరిభవించుట విలాసమా? స్వయంవరమునకు సర్వజనసమ్మతముగా నలువురను పిలుచుట పూర్వాచారమైయుండ చక్రవర్తియంతవాని నాహ్వానింపక పోవుటయే గాక పరాభవించుట కూడనా? రాచవారి కింత కన్నయగౌరవము మరియొకటి కలదా?

కాశ్మీ:—ఎట్టి నీచమార్గమైనను పరోక్షమున పరాభవించచూచుట పందతన మనిపించుకొనునుగాని పరాభవ మెట్లగును?

వివ:—రాజచంద్రులారా! సర్వము దెలిసిన మీ రిట్లు మాటలాడిన మే మేమన గలవారము! భూలోకదేవేంద్రు డన దగిన చక్రవర్తికి

పరాభవము దలపెట్టినను కాజాలదు. శాంతము వహించి ప్రస్తుత కార్యమున కనుజ్ఞ నొసంగుము. స్వయంవరము సంపూర్ణము కానిండు.

కాశ్మీ:—అమాత్యశేఖరా! ఇట్టి కార్యము జయచంద్రునివంటి సుక్షత్రియుడ చేయదగినది కాదు. ఆర్యావర్తమునంతను అట్టుడికించి నట్టుడికించు యీ కార్యము మాటలతో దీరునా?

అన:—(కోపముతో) ఇక నీ మాటలు గట్టిపెట్టుము. ఎట్టుడికించునో చూతము. విలాసార్థము మా చిత్తమువచ్చినట్లు చేసెదము.

కాశ్మీ:—చిత్తమువచ్చినటులైనను క్షత్రియోచితముగానే చేయవలయును. అంతియేగాని, యిట్టి యాడుసేతలవలన గాదు. సకలరాజ సమక్షంబున నిట్టి నీచకార్యాచరణంబునకు గడంగిన దుష్టభూపాలుడు శిక్షాపాత్రుడు.

పుర:—శిక్షింప దలచినను శిక్షింపబడుట కంత చేతగానివారెవ రిక్కడ?

సింధు:—(కోపముతో) శౌర్యముగలదేని శస్త్రకౌశలముజూపి పృథ్వీ చక్రవర్తిని జయింపబోవలయును. లేదేని శరణార్థియై పాదాక్రాంతులు కావలయును. అంతియేగాని యీ యాడుపనుల వలనగాదు. చక్రవర్తిపక్షమున గత్తిగట్టుటకు సిద్ధముగనున్నాము.

కాశ్మీ:—ఆ! (అందరు తీవ్రముగా కత్తుల దూయుదురు)

విన:—అయ్యలారా! క్షమించి క్షణమోపికబట్టుడు. ఇది స్వయంవర మంటపము గాని రణరంగము గాదు. ఈశ్వరామాత్యా! చూచుచునూరకొనియెద వేమి!

జయ:—(తనలో) ఏమిచేయుటకును దోచకున్నది?

సంయు:—(తనలో) కలవరము క్రమముగ ముదురుచున్నది. మాతండ్రిగారికేమి సంభవించునోగదా! దుష్టసహవాస మెంతకు

దీసికొనిరాదు. (ప్ర) అయ్యలారా! అనుగ్రహించి మీవాదోపవాదము లుపసంహరింపుడు. తండ్రీ! నాప్రార్థన మంగీకరించి, వీరిని క్షణకాల మూరకుండునట్లు చేయుము. (మంజరితో) సాధుక్షణకళాదురంధరుండగు సార్వభౌమునకు సర్వగౌరవంబులు సమకూరుగాక!

ఈశ్వ:—(తనలో) ఈమె చివరిమాటలను బట్టి పృథ్వీరాజునే వరియించునటుల గనుపించుచున్నది. ఈప్రయత్నమంతయు వ్యర్థమగునేమోకదా!

విన:—రాజచంద్రులారా! సర్వమంగళవిగ్రహయగు నీ కన్యాసంయుక్త పలుకులు సర్వజనసమాదరణీయములు. మీరందరు క్షణమోపికవహించి, స్వయంవరకార్యము సంపూర్ణము కానిండు. ఆమె వరనిర్ణయ మొనర్చినయనంతరము అవసరమును బట్టి మీరు తగవులాడుదురో తీర్చుకొనియెదరో!

జయ:—ఇందు తగవులాట కేమున్నది. సభావిశేషము లెటులున్నను యిది స్వయంవరసమయముకావున దాని కేవిధమైన యాటంకము లుండరాదు. నా ముద్దులకూతు రామె చిత్తమువచ్చి వానిని వరియించి కార్యక్రమము బరిసమాప్తి నొందింపగలదు.

విన:—అయ్యలారా! సావధానులరుగండు. మహారాజా! నానారాజకుమారులను వేరువేర నిరూపించి చెప్పుటకు మంజరి నేర్పరచిన బాగుండును.

జయ:—ఔను. మంజరీ! నీ వీ భూపాలకుమారులను వేర్వేరుగ వర్ణించి చెప్పుము.

మంజ:—(త) ఈ సిగ్గుమాలిన కార్యము నామీద బడినది. నా చెలిమనం బెరింగిన నే నీ రాజకుమారుల నేమని వర్ణింతును? అది యామె కిష్టములేదు. ఆమెకననేల? నాకే యసహ్యముగనున్నది. అయినను తప్పనిసరి. ఏదో యాకరువుపట్టెదను. (ప్ర) చెలీ!

సంయుక్తా! నాయనగారి సెలవుప్రకారము మీ రాజకుమారులను వేర్వేర చెప్పెదను రమ్ము.

సంయు:—(జనాంతికముగా) ఎందులకే నీ కాత్రము. (తనలో)

చ. శతమఖపద్మజాతి సురసార్థ నమస్కృత సత్యరూప! పూజితనిగమప్రభూత పురజిద్వరవర్ణిని! ఆదిశక్తి! పా
ర్వతి! నృపసార్వభౌము, బుధవందితు, పృథ్విధరాతలేంద్రునిం
బతిగనొనర్చి! నా హృదయవాంఛను దీర్పగదమ్మ! మ్రొక్కెదన్.

మంజ:—(జ)ఎందులకయినను తప్పదుగదా! ఇకవినుము. (ప్ర) ఈనర పాలచూడామణి సింధుధరాధిపుడు. ఈ సద్గుణశాలి చోళధరాధినాథుడు. ఈ నృపసింహుడు నేపాళరాజు. ఈతండు మత్స్యదేశ నాయకుడు. ఇతండు బర్బరదేశభర్త. ఈతండు సౌరాష్ట్రాధిపతి ఇతండు ద్రవిడనాథుండు. ఈ యాజానుబాహుడు—

సంయు:— ఊ...ఉ...(అనిసిగ్గిలొనును)

మంజ:—అయిన నిటుజూడుము. ఈ మంగళాంగుడు అనలధీరుడు

సంయు:—(జ) నీకు మతిబోయినదా యేమి!

మంజ:—అయిన నెచ్చెలీ! ఈ ప్రతిమన్ చూడుము. ఇది సర్వాంగసుందరుండును వైరిభీషణోద్ధత భయదచాపధారుండును, మోహనమూర్తియు, ఢిల్లీసింహాసనాసీనుండును అగు పృథ్విరాజచంద్రునిదట.

సంయు:—(తనలో) అక్కట! నా మనోహరు నెంతటి దుస్థితిలో చూడవలసివచ్చినది! అయిననేమాయె! ఈ నీచజాతి వాని నవమానించ దలచినను అవమానము కలుగగలదా! మనోవాక్కాయకర్మముల నాతనినే వరించియుండుటచేత ప్రతిమారూపమున నున్న యీతని మెడనే పుష్పదామము వేయుదును. అప్పుడు నా కోరిక నెరవేరుటయే గాక వీరి కొరగామితనమునకు మంచి ప్రాయశ్చిత్తము కూడకాగలదు.

చ. స్మరజితరూప సర్వనృపచంద్రసమక్షమునందు బొమ్మవై
పరిభవమొందితంచును ద్రవవస్మది బొక్కకుమయ్య యీ స్వయం
వరమున నిన్వరించితిని భర్తగ నోలగమందు నుండలే
శ్వరులును పంచభూతములు సాక్ష్యముగా బృథివీనృపాలకా॥

(అని పృథివీసార్వభౌముని కంఠమున నానందముతో బుష్పదామము వేయును.)

ఈశ్వ:—(తనలో) కొంపమునిగినది. (అని కంగారుగాచూచును)

జయ:—(విస్మయహృదయుడై యాసనంబుడిగ్గి) ఆఁ ఆఁ వలదు. వలదు. (దగ్గరకేగి) తనయా! ఏమియీవెర్రి? కావొనరించిన యీ దుష్కృతికి లజ్జించి పుష్పదామము దీసి యీ సభాసంస్థితులై యున్న......

సంయు:—జనకా! మనోవాక్కాయకర్మములఁ ప్రాణనాథునిగా గోరిన సార్వభౌమునే వరియించితిని. అతనిని గప్ప నన్యుని వరియించను. నా కతడే ప్రాణభర్త.

జయ:—(కోపముతో)

శా. చేతోజాతసమానరూపవిభవశ్రీమంతు లుద్యద్యశః
శ్వేతాలోకదిగంతదంతురరణస్థేమాభిరాముల్ కళో
పేతు ల్భూపతు లింద రర్థిమెయి నిన్వీక్షింపఁ బెంపేది, యీ
జాతింగోరి వరించి సిగ్గువడ వౌరా నాకుఁ దల్వంపుగా.

కన్నకుమార్తెవు నా గౌరవము మంటగల్పి, నాకు గర్భశత్రువువై కూతురు రూపమున పగందీర్పదలంచితి వనుకొనలేదు. ఆహా? ఏమిచేసితివే!

సంయు:—జనకా!

మ. ధరణీపాలురు లేరో? తత్సుతల కుత్సాహంబు మీరన్ స్వయం
వరము ల్సాటరో? తన్మహోత్సుకత భూపాలాత్మకుల్రారో? త
త్తరుణుల్ స్వైరమతి న్వరింపరో? తత్రాప్యనేకులన్! ధాత్రి నా
శిరమందే యిది పుట్టెనే యకట నా చెయ్దింబు నిందార్హమే?

ఆత్మలో 'గోరిన పతిని దమయంతీకన్య స్వయంవరమున వరియింపలేదా? సావిత్రీకన్య సాళ్వసుతుని వరియింపలేదా? ఆవరణ భారము కన్యలది గాక దండ్రులదియా. తండ్రి చెప్పినవానినే వరియించిన నది స్వయంవరమెట్లగును? నీకిష్టములేనిపక్షమున మామూలుపద్ధతియే యొనరింపక కులాచారము దాటించి యీ విధానమున కేల గడంగితివి? పోనిమ్ము. నేను వరించిన మహానీయుడు నీకహితుడై యుండవచ్చును. అట్టి వానిని ప్రతిమగా నొనర్చి సర్వనృపసమక్షంబున నగౌరవించు టుచితమా? అది రాజకులోచితాచారమా? ఎట్టి గర్భశత్రుడైనను కూతురు భర్తగ గైకొనినప్పు డల్లుడు గౌరవార్హుడుగదా! ఆ ధర్మమైన పాటించితివా? అస్మద్వరణమూలమున సార్వభౌముడు నీ కనుంగునల్లుడయినప్పుడు ఆనందింపక క్రోధావేశపరవశుడవై కన్నకూతురును నిందించు నీవంటి తండ్రు లీ రాజలోకంబున నెక్కడైన గలరా?

జయ:—(కోపముతో శిరఃకంపనఁ బొనర్చి) ఛీ! సిగ్గుబిడియములు విడిచి తగదునమ్మాయని మాటలాడ జొచ్చితివి. మందబుద్ధివై నా యాశయములకు విరుద్ధంబగు దుష్కృతికి పశ్చాత్తాపము నొంది బాల్యచేష్టచే చెయిజారవిడిచిన యీ పుష్పదామ మీ శిలాప్రతిమ కంఠమునుండి తీసివైచి, యీ సభలోనున్న రాకుమారులలో నెవరి కంఠముననైన నలంకరింపుము.

సంయు:—గీ. అధిప! యాచంద్రతారార్క మవనిమీఁద
నీదు సేత శిలాక్షర నియతిఁగాఁగ
నకట! యకలంక సూర్యవంశాంబరంబు
మలిన మొనరింపకుమ! మారుమనువుగట్టి.

గీ. ఆత్మ దనియంగ వలచి స్వయంవరమున
ఆత్మభర్తగ వరియించి నట్టివాని
విడచి యన్యుని దలఁచెడి పడఁతి కిహము
బరము గలదె? పాతివ్రత్య ఫలముగలదె?

జయ:—(కోపముతో) పిట్టకొంచెము కూతఘనము. పురిటివాసన బోలేదుగాని మెన్ని ధర్మవన్నము లేకరవు పెట్టుచుంటివి. బాగుగా నాలోచించుకొనుము. ఆనక విచారించిన ఫలములేదు. ఇక నీవు కూతురవు గావు నేను తండ్రిని గాను. (శాంతముగా)

గీ. తండ్రి బిడ్డల ధర్మంబు దలచెదేని
తండ్రి చావును చూడంగ దలపవేని
మద్విరోధి శిరోధి దామంబు దీసి
యన్యుని నలంకరింపుమా? యింకనైన నీవు.

తుచ్ఛుండును, గర్వోన్మత్తుండును, ఆత్మశ్లాఘాపరాయణుండును విశేషించి నాకుబలవద్విరోధియు నగు యీ పృథ్వీరాజచండాలుని వరించితివనిన నే నిక జీవింపను. నిన్ను ప్రాణంబులతో నుండనీయను. స్వయంవరమంగళధ్వనులతో నిండి, నానా రాజకుమార వేష్టితంబగు నీ సభామంటపము రక్తస్రవంతులతో, రోదనధ్వనులతో నిండి స్మశానవాటిక సదృశకాగలదు. జాగ్రతగ నాలోచించుకొని నీ నిశ్చితాభిప్రాయ మెరింగింపుము.

సంయు:—

మ. ఇక నీ కేమని యుత్తరంబిడు తండ్రీ! నీదు కాఠిన్య వృ
త్తికి నే నెంతని చింతనొందుదు దయార్ద్రీభూత చిత్తుండవై
యిక మానందగదే! సభాస్థలిని వహ్నిజ్వాలికాదిగ్ధసా
యకసంకాశ విరోధపృథ్వినృపనిందాలాప ధిక్కారముల్.

జయ:—(క్రోధపరవశుడై) ఓసీ! నీచురాలా! కులాంతకీ కృతఘ్నురాలా! ఏమంటివి! పృథ్వీరాజనింద నిక మానవలయునా? నీకు గర్ణశూల ములవలె నుండెగాబోలు! ఆహా! ఆబాల్యము ప్రేమాభిమానములతో కనిపెంచిన తండ్రిగర్హితుడు. నీచుండును మానహీనుండునగు పృథ్వీరాజు పరమహితుడును ప్రాణభర్తయునా? ఓసీ పలుగాకీ! ఇక నిన్ను కడతేర్చినగాని నా కోపానలం బారనేరదు (భయదాట్టహాసముతో గత్తిదూయును)

వినయ:—(అడ్డమువచ్చి) మహారాజా! కండ్లుదెరువని కూనపై యాగ్రహించుట....

ఈశ్వ:—రాకుమారీ! నాయనగారి చిత్తవృత్తి గనిపెట్టి మాట్లాడుము

వినయ:—అయ్యా మనవలె నిచ్చకపుమాటలాడుట ఆ చిన్నతల్లి కెట్లు తెలియును?

మంజ:—అయ్యా! నీ వెంతటి యమాత్యుండవైనను గొంచెము ముందువెనుక లారసి మాట్లాడుము. ఆమెగూడ నొక క్షత్రియ కాంత. నీ వాశ్రయించుకొనిన రాజచంద్రునకుఁ గుమార్తె. సార్వభౌముని పట్టమహిషి. జాగ్రత.

జయ:—(కోపముతో) వినయశీలా! నీవలె నా కూతునకుం గూడ వినయవిధేయతలు లేకుండజేసి యీ విషాదాంతనాటకము నాడించుచున్న సూత్రధారుడవు నీవే. ఈ స్వామిద్రోహమునకు తగిన ఫలం బనుభవించకలవు. నేటినుండి మూడుదినములలో నీవు నా

రాజ్యమునుండి వెడలిపోవలయును. లేకున్న నీ మానప్రాణంబులు దక్కవు.

ఈశ్వ:—ప్రభువువారు చక్కగ గ్రహించిరి.

విన:—(కోపముతో) ఓరీ! గోముఖవ్యాఘ్రము! నిన్ను కసిదీర చంపుట కిదివరకు చక్కని తరుణంబు దొరకినను వదలివైచినందుల కిప్పుడు చింతించుచుంటిని. సరియే కొంతకాల మోపికబట్టుము. (రాజునుంజూచి) మహారాజా! నీ క్షేమమునుగోరి దేశగౌరవమాలోచించి కులగౌరవము పాటించి నీకడ నుంటిని గాని యీ యమాత్యపదవి నాశించి గాదు కృతఘ్నులును ధర్మాధర్మవిచక్షణహీనులు నగు ప్రభువులు దొంగలనుగాని దొరలను నమ్మరు. నిన్నును నీ రాజ్యమును నశింపజేయు తంత్రోపాయంబులీ యీశ్వరభట్టు వంటివారికే గాని యితరులకు దెలియవు ఆ యమాత్యుని ప్రభుభక్తివిశ్వాసఫలితము నీ కచిరకాలముననే తేటపడగలదు. సంయుక్త కడుపున పుట్టిన యాడుబిడ్డ. ఆమెను నిరశించుట యవివేకము గాని రాజనీతిజ్ఞతగాదు. ఆమె ముద్దుచెల్లింపుము. నా మాట వినుము. పృథ్వీరాజ సార్వభౌముడు నీ యందు విరోధభావ మావంతయులేనివాడు. ఇది యంతయు నీశ్వరభట్టు చేసిన బోధనాఫలితము. మీ యిరువురకకారణవైరంబులు బెంచియిరుపక్షములను నాశనంబొనర్చు తలంపుమీదనే యితడిచ్చటకు చేరెను. నామాట వినుము. పృథ్వీసార్వభౌమునితో పగను విడచి బాంధవ్యము బాటించి యాతని నల్లునిగా పరిగ్రహింము. నీవభివృద్ధిగాంచెదవు. ప్రజలు సౌఖ్యపడగలరు. నేనిదే పోవుచున్నాను.

ఈశ్వ:—చాలు చాలు నీ యుపన్యాసము. ఈమాత్రపు తెలివితేటలు యింగితజ్ఞానము రాజేంద్రునకు లేకపోలేదు.

జయ:—(కోపముతో) త్వరితముగ బొమ్ము.

ఈశ్వ:—(ఆనందముతో చూచుచుండును)

వినయ:—(నిష్క్రమించును)

సంయు:—తండ్రీ! వినయశీలుడు విశ్వాసపాత్రుడు. ఆబాల్యము మన వద్ద నున్నవాడు. మన బాగు గోరిన వాడు. పయోముఖవిషకుంభమగు నీశ్వరభట్టు దుష్టబోధల నమ్మి యట్టి విశ్వాసపాత్రుని హితైషుని వదలుకొనుట చేతులార గోయి త్రివ్వుకొనుట గాని వేరుగాదు. నా మాట మన్నించి యాతని బిలువ నాజ్ఞాపింపుము.

జయ;—(కోపముతో) చేయవలసిన దంతయు జేసియే పోవుచున్నాడు. అతి డుండినగాని నీయాటసాగదా! ఛీ! ఛీ! నోరు మూయుము. నిర్భాగ్యురాలా!

సంయు:—(ఆత్మగౌరవముతో) నీయట్టి రాజేంద్రునకు గుమార్తనై ఢిల్లీ పట్టభద్రుడగు సార్వభౌమునకు బట్టమహిషినై యుండిన నే నెట్లునిర్భాగ్యురాల నగుదును తండ్రీ! ధర్మాధర్మములు కుల గౌరవములు మరచి సంచరించు నీ యవివేకమున కెంతయు విచారించుచుంటిని. సార్వభౌమునికి నన్నిచ్చి సంతోషముతో వివాహ మొనర్పుము. అల్లునిపై పగవిడువుము. ముద్దులకుమార్తె మొగము జూడుము.

జయ:—(క్రోధావేశపరవశుండై.)

గీ. పరమ నీచుని పగతుని పాపరతుని
దురిత చరితుని వంచకు దుష్టశీలు
నాత్మ భర్తగ వరియించు నట్టి నిన్ను
జంపకుండిన నాకింక శాంతి లేదు.

(కత్తిదూసి సంయుక్తను నరకబోవుచుండగా తెరలో)

పృథ్వి:- గీ. అవనిపతులెల్లఁ జూడ స్వయంవరమున
పరిభవముఁగాంచి వరియింపఁ బడిన ప్రతిమ
శౌర్య మేపాఱ సంయుక్త సతినిఁ గొనుచు
జనెడి, జయచంద్ర రమ్మింక చలముగలుగ.

[అనుచు పృథ్వీ ప్రవేశించును.]

జయ:—(తెల్లబోయిచూచుచుండును.) (తెరపడును)

## ద్వి తీ య ర ం గ ము.

[పృథివీ జయచంద్రులు పరస్పరరోషావేశ వరవశులై
ఖడ్గపాణులై ప్రవేశము]

పృథ్వి:—

మ. ప్రతిమారూపునిగా నొనర్చి సభలో రాజేంద్రులెల్లన్ భవ
త్ప్రతిభన్మెచ్చ, పరాభవించుచును దుర్దర్పంబునన్మీరి న
న్నతి దూష్యంబుగ మాటలాడెదవె! యీ ర్ష్యాటోప దౌర్జన్యము
ద్ధతదోర్గర్వముచూపుమా యిచట ప్రత్యక్షంబుగా ఘాతుకా.!

జయ:—ఎందుకీ యహమికాలాప వృథావిజృంభణము. మత్ప్రాణ
మిత్రుని జంపిన మద్బలవద్విరోధి వగు నీ కర్హంబైన గౌరవంబే
మత్పుత్రి కాస్వయంవరాస్థానమున జరిగినది. చతుర్దశభువన
సంస్తుత్యశౌర్యాటోప దుర్వారవిక్రముండగు నీ జయచం
ద్రుని వద్దనా నీ యాడంబరము?

పృథ్వి:—సకలసామంతనృపాలకలోకంబునకు స్వయంవరాహ్వానము
లంపి తాను కోరి వరియించియున్న సార్వభౌముని నాహ్వానింప
నందులకు నీ కుమార్తెయే నీకు తగురీతిబుద్ధిచెప్పినది. నా కనర్హం

బగు నమానుషంబు నీ వొనర్చితివి. నీకుం దగిన ప్రాయః చిత్తము నీ కన్నకూతురే యొనరించెను. నిన్ను మదీయ ఖడ్గధార దు్రింపదలచితిని గాని నీకూతు మొగము చూచి అంతవరకు చేయచాలనైతిని.

జయ:—సంగరరంగంబున నన్నోర్చుబలపౌరుషంబులు మృగ్యంబులై నప్పుడు నీ వంతకన్న చేయగలిగిన దేమున్నది! అదియునొక పౌరుష ప్రభావమే? ఛీనోరుమూయుము.

పృథ్వి:—ఓయీ వృథావల్గా వాచాటా! లేనిపోనియకారణవై రంబులు మనంబున నిడుకొని, చేయతగినది లేక బలపౌరుషంబుల నటించుచు తురకల పాదంబులు పట్టి వారిచే నగతురనోడించి పగదీర్పనెంచు నీ పౌరుషమును నీవే మెచ్చుకొనవలయును! దేశక్షే మమును ప్రజాసౌఖ్యమును పగతురచేతులబెట్టు నీ పౌరుషాభిమాన ఫలము చివరకు నీవే యనుభవింతువు. ఒక ఘోరీకాదు వేవురు ఘోరీలను దోడ్కొని వచ్చినను, ఖడ్గమాత్రసహాయుడనై నిలచునా కేమిభయము. శతృసంహారమునకు నేను నీవలె నొరుల నాశ్రయించను. తెలిసినదా!

జయ:—(కోపముతో) నీ దేశసేవ, నీ మాతృదేశభక్తి, నీ బల పౌరుషంబులు నే నెరుంగనివి గావు. నోటికి బుద్ధిచెప్పుకొని యూరకుండుము. లేకున్న మదీయ క్రూర నిస్త్రింశధార భవచ్ఛి రంబు శతధాభిన్నంబులై నేల గూలును సుమా! జాగ్రత్త. (ఖడ్గమెత్తును)

పృథి:—ఓరీ! మూర్ఖా! నీ యశక్తికి, దుర్జనత్వమునకు, నీ మీద నాకు గోపమునకు మారుగా నవ్వువచ్చుచున్నది. ఇప్పుడైనను నాయెడ నీవొనరించిన దుర్మార్గదౌష్ట్యములకుఁ బశ్చాత్తాప తప్తుండవై నీ కుమార్తెను నా కుపాయానంబుగ నర్పింపుము.

మనమిద్దరము బంధువులమై యుండ మనకే గాక దేశంబునకెల్ల క్షేమంబగు. కేవలము దేశప్రజాక్షేమమును నీ క్షేమమును గోరి చెప్పుచుంటిని గాని నీతో రణంబొనర్ప భయపడి కాదు.

జయ:—(కోపముతో) కండకావరముచే గండ్లుగానక పేలెదవు. నిన్ను రణరంగమృత్యుదేవతకు వివాహంబొనర్తునే గాని నా కూతును నీకు బెండ్లియొనర్తునా? సిగ్గు సిగ్గు.

పృథ్వీ:—ఊరకుండిన కొలంది నీవాగాడంబరము పెచ్చుపెరుగుచున్నది. నా యశ్వమేధాశ్వమును బట్టి నప్పుడే నీ శౌర్యము నీబలము అన్నియు తేటపడెను. ఇంకను యెన్ని సార్లు నిన్నెరుంగవలయును?

జయ:—అశ్వమేధాధ్వరంబు విఘ్నంబొనర్చుట కిష్టంబు లేమి నీయశ్వంబును వదలితిని గాని నీకు భయపడి కాదు. నీతో నాకు సంధి యేమి? సంబంధమేమి? నాతో నీకు చెలిమిపాటించు నిచ్చయే యున్నచో నా ప్రాణమిత్రుడగు కలంజరనృపాలుని యన్యాయంబుగ వధించి నాకు బలవద్విరోధివగుదువా? ఆ కసి దీర్చుకొనకుండ నిన్ను ప్రాణంబులతో వదలువాడను గాను.

పృథ్వీ:—ఈ పౌరుషం బప్పుడేమైనది?

జయ:—అప్పుడే మైనదో గాని యిప్పుడు నిన్ను భస్మీభూతునిగా నొనర్చుటకు పూర్ణీభవించి శరీరంబునుండి యుబుకుచున్నది. వాగ్వాదంబులతో బ్రయోజనమేమి? రమ్మునీ గర్వంబడంచెద.

పృథ్వీ:—ముందు వెనుకలారసి దారికి వత్తువేమో యని యింతవరకు హెచ్చరించితి. నా నయబోధ యంతయు చెవిటివాని చెవివద్ద శంఖమూదినట్లయ్యె (ఖడ్గము బూని) ఓరీ తుచ్ఛా!

మ. పృథివీనాథులు సూచుచుండ సభలో పెంపెక్క నా బొమ్మనే
ముదమొప్పార వరించి యీ పరిభవంబుం గన్న నా సాధ్వి నా
సుదతీరత్నము నీదు కూతు నిదె కొంచుం బోయెదన్ నేడు నీ
మదముంగూల్చి యవార్యశౌర్యభవసామర్థ్యంబు దీపింపగాన్.

జయ:—(క్రోధపరవశుండై) ఏదీ? చూతము నీ శక్తి. రమ్ము (ఖడ్గము బూని మీదకు పోవుచున్నాడు.)

పృథ్వీ:—(క్రోధపరవశుండై ఖడ్గము బూని యెదుర్కొను చున్నాడు.)

[సంకులసమరము జరుగుచుండగా జయచంద్రుని సైన్యాధ్యక్షుడు ప్రవేశించి ఖడ్గపాణియై రహస్యముగ పృథ్వీరాజు ననుసరించి వెనుక నుండును]

[పురుషవేషధారిణియై సంయుక్త ప్రవేశించి ఖడ్గపాణియై రహస్యముగ సైన్యాధ్యక్షు ననుసరించి వెనుకనుండును.]

సైన్యా:—(పృథ్వీరాజును నరుకబోవుచుండగా)

సంయు:—(సైన్యాధ్యక్షుని తల దునుమును)

జయ:—(మూర్ఛిల్లును)

పృథ్వీ:—(వెనుకకు దిరిగి చూచి సంయుక్తయని గ్రహించి నగుమొగముతో నామెను తోడ్కొని పోవును.) (తెరపడును.)

## తృతీయరంగము.

[కులాసగా సంగీతము తీయుచు సిపాయి ఖైరాతీ ప్రవేశించి]

క్యాఖుదా! ఇది హిందూస్తాన్ రాజ్యం వచ్చింది తర్వాత మాదీ పానం సచ్చి సల్లారింది బాబ్. తినేదాన్కి ఖానా నహి (అని జేబులోని దేదో తీసి తొందరగా తినుచు) పీనేదాన్కి పానీ నహి హోడేదాన్కి హారత్ నహి. తుర్కీరాజ్యం చోడ్కర్ సుల్తాన్ సర్కార్ యెంటా కొండల్ గిండల్ ధ్దాటి, సచ్చీ వచ్చీ యింతా దూరంవచ్చి యీపాడు ఖాఫర్ రాజ్యంమే మర్గయా అయే దాన్కి వుండింది మాదీ భత్తు వచ్చింది రస్తామే సాలామంది మర్గయా అయింది తిండిలేక. మిగిలింది అద్మీ సాబ్బీ యిక్తా మర్గయా కసపడ్తాది.

(మరలతినుచు) పేట్కో ఖానా నహీంతో పైసా యెందుకు దలిందర్ పైసా? గుల్లు బద్దల్ కొట్టేం గోపురాల్ ముక్కల్ సేసేం బహుత్ డబ్బు సంపాదం సేసేం. క్యాఫాయిదా నెత్తికొట్టుకున్నాది తర్వాత (అని తొందరగా తినుచుండును.)

(గడబిడఖాన్ తొందరగా ప్రవేశించి) అరేహల్లా యెక్కడ్డి యుద్దం యెక్కడ్డి గోలా! కాఫిర్ వాలోంకొ కత్తిమే సెయ్యియేసె దాన్కికూడా తాహత్ నహీ యని మాకిమాలుం సేస్తె యింతా దూరం వచ్చేయిమాకీ. అరే హల్లా! భగ్ భగ్ మంటల్ సేసీ పీకల్కినికాల్ సేసింది. అరే! హమారా కత్నే అద్మీబీ ఒక్టి మన్సిముందు నిలిసేదాన్కిపురసత్ దిస్తానహీ. తోబా! హిందూస్తాన్ రాజ్యంవచ్చింది యిక్డా యీా కాఫిర్ వాలోం సే తన్నుల్ తినే దాన్కి క్యా? హాం! దేఖో. మాదీ మజా యిదీ సారి సూపిస్తాం మాకీ.! పురుదూరాజూ కాదూ ఆడ్కి బాబ్ దుస్రావచ్చింది అయినా కత్నే అద్మి వచ్చింది అయినా మాకీ ఫర్తానహీ. ముక్కల్ ముక్కల్ సేసి మక్కామే గోరీ... ఆ అరే తోబా తోబా (అని లెంపలు వేసికొని)ఎంతా బుద్ధిలేని మాటా-అరే (అని తృళ్లిపడి) ఏమ్టి బే గడ్‌బిడా? కోన్‌బిహై యిక్డా మాకీ మర్గయా సేసేదాన్కి (అని నలుప్రక్కలతొంగి తొంగి చూచి) అరే హల్లా! అదీ మాదీ దోస్తీ ఖైరాతీలాగా హగపడ్తాయి (అని తొందరగా తినువానిని పరకాయించి గురితించి) అరే దేఖో! ఖైరాతీచ్ హై! క్యాఖైరాతీభాయి! క్యా కర్తాహై రే హిందర్? ఖానా కర్తె హైరే? భాయి ఖైరాతీ! (అని దగ్గరచేరి) అరే మాకీ కూడా తోడా తోడా ఖైరాతీ సెయ్యిబే. పుణ్యంపడ్తాయి సేస్తే. కద్నాగడ్‌బిడా సేస్తాయిసాలా.

ఖైరా:—(వినుపించుకొనక తొందరగా నోట కుక్కుకొనును.)

గడ:—మంచి సెబ్బరా లేక హైసా దాడ్కి మూమే పోసికొనేతో గాభరా అయి సస్తావుబే.

కైరా:—(తొందరగా తినుచు) బైరో బేకొంచెం.

గడ:—క్యాబైరాన? బైరకే క్యాఫాయిదా సాబ్బీ మింగేసింది తర్వాత?

కైరా:—అరే! మింగేసేతో యింటీ దగ్గ్రాసాలావుంది బే.

గడ:—అరే! యెక్కా తింతే కడుప్పు జబ్బు సేస్తాయిరే హైవాన్.

కైరా:—అదీ సూస్తాం మన్కీ. జర్రా ఉండు.

గడ:—అరే బుద్దీలేనీ మన్సీ!

కైరా:—బుద్దీ యిద్దీ సెప్పేదాన్కి యిది నీదీ బాబ్కా మూటా?

గడ:—అరే నీదీ బాబ్కామూటా! హిందూస్తాన్ రాజ్యంమే దొర్కింది సాబ్బీ హందర్కీ ఏక్‌చ్ హుక్కు అని

కైరా:—అరే దేఖో కోన్‌బీ ఆతీహై?

గడ:—అదీ తర్వాత దేఖ్తాం ముందు కొంచెం (అని బలవంతముగా లాగికొని తినుచు యిరువురును గుంజు లాడుచుందురు. అంతలో ఒకముసలి బ్రాహ్మణుడు ప్రవేశించును.)

బ్రాహ్మ:—సీతా పతే రామ, లక్ష్మీ పతే విష్ణు, రాధా పతే కృష్ణ, సీతా పతే రామ లక్ష్మీ పతే...

కైరా:—(చంగున గెంతి) అరే మంచీ పష్యంకి దొర్కిందిరా మన్కీ! ఇదీ బొమ్మన్ కాపిర్కు తంటాల్ సేస్తాం కొంచం!

గడ:—అచ్చా! యీాడ్కీ బోమ్మన్ యేసం తీసి హమారా ముసల్మా నీ యేసం తగిల్పిస్తాం.

కైరా:—బహుత్ అచ్చాహోలోశన్. హైసా కర్నేతో ఖుదాకి మన్కి మీాద అనుగ్రహాం సేస్తాయి(అని బ్రాహ్మణుని సమీాపించి) ఏయి కోన్‌హైతూ?

గడ:—ఎవడూనీదీ? ఠీక్ బోలో?

బ్రాహ్మ:—అయ్యా! నేనీ పరిసరప్రాంతముల నుండు నొక బ్రాహ్మ ణుడను.

కై రా:—నీకీ బంద్ సేసీ మాదీ సర్కార్కీ దగ్గరా తీస్కా పోవాలా.

బ్రా:—అయ్యలారా! అతడెవరు? నే నచ్చట కేల రావలయును?

గడ:—అదీ మాదీ సర్కార్. అడ్కా నీకీ యీ పాడుబామ్మన్ వేసం నికాల్ సేసి ముసల్మానీ వేసం తగిల్విస్తాం.

బ్రా:—రామ! రామ! అది నా కక్కర లేదు.

కై రా:—అక్కరలేదూతో ఫాయదాసహి. ఖురాన్ తప్తె కత్తి పడ్తాయి బుర్రమే.

గడ:—పానాల్ కావల్సిందితో ఖురాన్కీ సలాంకరో. తర్వాతమాదీ లాగా డబ్బూగిబ్బూసాబ్బీ కావల్సింది అంతా సంపాదనా సేస్తాయి. ఆవ్! జల్దీ ఆవ్!

బ్రా:—ఓయీ! మీ దౌర్జన్యము మా మహారాజుతో మనవి సేసి ..

గడ:—అరే! అడ్కా మాదీ సర్కార్ ఖరీంఖాన్సాబ్ సల్లగా ఉన్నాదీతో మాకీ క్యా ఫిర్కారే హై హాన్ సర్కార్?

కై రా:—అక్కడా బమ్మన్ మంత్రి భట్టూ సర్కార్బీ హై!

బ్రా:—ఔరా కాలమహిమ! మహారాజు నాశ్రయించిన నా తుచ్ఛుని మూలముననే గదా మీరీ పుణ్యభూమి యగు నార్యావర్తమున నింత విచ్చలవిడిగా సంచరించుట.

కై రా:—అరే జాస్తి మాటల్ సెయ్యకూంజే (అని మీదకు పోవును.)

గడ:—(కలియపడ బోవును)

బ్రా:—ఓరీ నీచులారా! ఏమి చేసినను సరే కాని నా యజ్ఞోపవీతమును పవిత్రాక్షతలును (చూపించుచు) మాత్రము ముట్టుకొనకుడు.

కై రా:—అయినా? (అని జంధ్యము తెంపివేసి కలియపడును)

బ్రా:—రామ రామ (అని చిందులు తొక్కును. తురక లిరువురును వాని తల గట్టిగా పట్టుకొని నుదుటనున్న బొట్టు వంతులు వేసికొని బలవంతముగా నాకివేసి గిలగిల కొట్టుకొని చనిపోవుదురు.)

బ్రా:—ఓరీ నీచులారా! తుచ్ఛులారా! మీ యకాలమృత్యువునకు కారకుడ నయినందులకు విచారించుచున్నైనను మీ రార్యావర్త మున చేయు దుండగములు కొంతవర కరికట్టుట కేర్పాటయిన యెత్తులలో నిది జయప్రదముగా కొనసాగుచున్నందులకు సంత సించుచు బ్రాహ్మణ మేధాశక్తి యింకను కొరవడలేదని గర్వపడు చున్నాను. బ్రాహ్మణ పరాభవము సామాన్యము కాదు. మాట లతో తీరదు. (నిష్క్రమించును)

చతుర్థరంగము.

[జయచంద్రుడు ప్రవేశము]

జయ:—(విచారముతో)

ఉ. ఆ నరపాల పాంసనుని నందరిలోన బరాభవింపగా
బూనిన నేన భంగపడి పోయితి వద్దనినన్ తనూజ యా
హీనునె కోరి వచ్చి వరియించె సదస్సున నీ పరాభవా
ఖ్యానకదుందుభిధ్వను లహర్దివ మెట్లు సహింతు నక్కటా.

ఆహా! నే తలంచిన కార్యంబు లెల్ల నాకాశసౌధంబులై కూలి పోయినవి. తంత్రోపాయసమర్థుండనని గర్వించి చివరకు పదిమంది లో వెడగునై పరితపింపవలసి వచ్చినది. ఒక క్షణ మా పురుషుం డడ్డు పడకుండెనేని నా యభీష్టంబు నెరవేరి, నే నీ సరికి న్యాయముగ నాకు రాదగిన డిల్లీసింహాసనం బధిష్టించియుందును. నన్ను రణం బున నిర్జించుటయే గాక నా సైనాధ్యక్షుని జంపి యా పృథ్వీ రాజమన్న్యుడు నా కూతునుం గూడ గొనిపోయెను. అట్టి మహా వీరుండగు సైన్యాధ్యక్షుడీల్గుటచే నా యంగబలం బంతయు హరిం చినది. (ఆలోచించి) ఆ పృథ్వీరాజహతకు నెట్లు బరిమార్చి నా ప

రాభవాగ్ని జల్లార్చుకొందును? ఏమిసేయుదును? (సింహాసనమ ధిష్ఠించును. పురహరుడు అనలవరుడు ఈశ్వరభట్టు ప్రవేశము.)

జయ:—మంత్రిశేఖరా! గోరీవద్ద కేగిన వార్తాహరు డింకను రాలేదా?

ఈశ్వ:—చిత్తము. సుల్తానునకు సమరసింహునకు యుద్ధము జరుగుచుండుటచేత సందేశము విన్నవింప వీలుపడక తడసియుండును.

అన:—సమరసింహుని బ్రతుకునకు దోడు గోరీతో యుద్ధమొకటియా?

జయ:—యుద్ధము సేయుటయే గాదు. జయముగాంచునేమో యని కూడ సందేహముగానున్నది. (తెరలో) సుల్తానువద్ద కేగి వచ్చిన వార్తాహరుడు ద్వారము కడ వేచియున్నాడు.

ఈశ్వ:—వానిని సత్వరము ప్రవేశపెట్టుము.

(భటుడు ప్రవేశించి యుత్తరమొసంగును)

ఈశ్వ:—(ఉత్తర మందుకొని చదువును.)

జయచంద్రమహారాజావారికి

స్నేహితుడు షహబుద్దీన్ మహమ్మదుగోరీ యనేక సలాములు. తమరు శత్రుజయోపాయమును వెల్లడిపరచుచు వ్రాసిన యుత్తరము నా కందక త్రోవలో శత్రువులచేతుల....

జయ:—ఆ! ఏమిరాయది?

పుర:—చూచితిరా? శత్రుల దార్జన్యము?

భటు:—చిత్తము. ప్రమాదము క్షమింపవలయును. సమరసింహసేనాని దానిని నా చేతినుండి బలవంతముగా దీసికొనెను.

అన:—చేతగాని సన్యాసుల నేర్పర్చుట వలన నిట్టి ప్రమాదములే...

జయ:—ఊం! తరువాత?

ఈశ్వ:—(చదువును) కాని మీ వార్తాహరి సంగతి వ్యక్తపరచెను. మీ యభిప్రాయము చ్వాల బాగుగనున్నది. మీరును మేమును

గలసినచో పృథ్వీసమరసింహులను సులువుగా జయింపవచ్చును. మాకీ దేశపరిపాలనయందు దాసక్తి లేదనిన సంగతి మీ రంద రిదివర కెరిగియేయున్నారు. అందుచేత రాజ్యము మీకే మిగుల గలదు. ఇతర సంగతులు మనము ముఖస్తముగ మాటలాడ గలము. మా నిజాభిప్రాయము భట్టుగారు స్పష్టపరచగలరు. ఇట్లనేక సలాములతో మీ స్నేహితుడు.

షహాబుద్దీన్ గోరీ.

జయ:—మిత్రులారా! చూచితిరా? మనకు సుల్తాను సహాయము తప్పదు.

ఈశ్వ:—ఓయీ! యుద్ధవార్తలేమి? గోరీ నెచ్చట గలిసికొంటివి?

భటు:—యుద్ధమున గోరీ పూర్ణముగ నోడిపోయి లాహోరువైపు పారిపోవుచుండెను. నేను వానిని మధ్యమార్గమున గలసికొని సందేశము వినిపించితిని.

(తెరలో) మహాప్రభూ! ఢిల్లీనుండి రాయబారి యొకడు వచ్చి ద్వారమువద్ద వేచియున్నాడు.

జయ:—ఏమి? పృథ్వీ దగ్గరనుండి రాయబారియా? వింతగనున్నదే! త్వరితముగా బ్రవేశపెట్టుము.

[ప్రసన్నచంద్రుడు ప్రవేశము]

ప్రస:— మహారాజా! నమస్కారము.

జయ:—ప్రసన్నచంద్రా! కూర్చుండుము. ఏమివిశేషములు?

ప్రస:—మహారాజు పంపున మీకడకు—

జయ:—ఔను. ఎందుకొఱకు?

ప్రస:—రాచకార్యము. రాయబారము.

పుర:—తప్పక వినవలసినదే.

జయ:—ఏమని రాయబారము? చేతులు మోడ్చి పాదాక్రాంతులము గావలయుననియా? లేక......?

ప్రస:—మహారాజా! అంత తొందరయేల! మా మహారాజ మీ మైత్రికోరి నన్ను మీయొద్ద కంపెను.

అన:—మీ రాజునకును మాకును సఖ్య మెక్కడిది? రణరంగము ననేగాని......

ప్రస:—రణరంగమున మీకు సమాధానమొసంగుటకు మా ప్రభువు వారి యవసర ముండదు. ఈలోపున జాలమంది గలరు. జయ చంద్రమహారాజా! మహారాజుల తగవులు వారితో పోక ప్రజల ప్రాణములమీదికి వచ్చునని మీరును యెరుగుదురుగదా!

జయ:—అట్టి తగవులాటకు ప్రధానపురుషులు మీరేకదా!

ప్రస:—మీరును గాదు. వారును గాదు. ప్రజల దురదృష్టము. దేశ దౌర్భాగ్యము.

జయ:—మాకు రాదగిన రాజ్య మపహరించి మా మీదికి గాలు ద్రువ్వుచుండ నెట్లూరకుండగలము!

ప్రస:—మహారాజా! తోమరవంశమునకు గడపటిప్రభువగు ననంగ పాలుడు ఈ ఢిల్లీ రాజ్యము పృథ్వీసార్వభౌమున కొసంగెను. ఇందు అత డపహరించిన దేమున్నది? ఎన్ని విధముల నాలోచించి చూచిన ను నిష్కారణవైరంబులకు మీరేకారకులు. వారి వలన నేమియు దప్పొకనుపించదు.

చ. అరయఁగ రాజసూయ మఘమం దవమాన మొనర్చి యజ్ఞపుం
తురగముఁ బట్టి తిట్టి పగతుండని బొమ్మగ జేసి యాస్వయం
వరమున జిన్నబుచ్చితి నృపాలసమక్షమునందు, చాల కా
గురుతర కోపవహ్నిని వగుల్పగ బాడిమె యూరకుండ కన్?

గడచినవానిని మరచి ద్వేషభావంబులు వదలి యైకమత్యము గలిగి ప్రవర్తించుట మీకును వారికిని దేశమునకు గూడ శ్రేయస్కరము. మా మహారాజుగారి సందేశముగూడ నదియే.

జయ:—అతడు మా కొనర్చిన యపకారములు మరువదలంచినను మరవురావు. అందువలన నా శరీరములోని ప్రతిరక్తపుబొట్టును వేడి యెక్కి ప్రతీకారము గోరుచున్నది.

ప్రస:—మహారాజా! సకలరాజమధ్యమున నీతనయ యాతని ప్రతిమారూపముననే వరియించినది. ఇందామె దోషముగాని యాతని దోషముగాని యావంతయు లేదు. ఆతడు నీకు అల్లుడు. పుత్రికావాత్సల్యమున నైనను వైరము విడిచిపెట్టుము. నీతనయ నీతో విన్నపింపుమనిన వాక్యములు వినుము

సీ. కన్నకూతురికైన గతిసాధించుట
యపకీర్తిమూలమం చరయుమయ్య
ఢిల్లీధరాధిపుం డల్లుడయ్యెనటంచు
నాత్మలో సంతోష మందుమయ్య
అల్లుని కెదురొడ్డి యాలంబొనర్చిన
నలువురు బందుగుల్ నగుదురయ్య
మనలోన మనమిట్లు మత్సరించుచునుండ
పరదేశులకు సందు దొరకునయ్య

గీ. పగర వంచింప మ్లేచ్ఛుల ప్రాపువట్టి
వారిచేతనె దేశంబు వదలిపెట్టి
రాజులు తరాజులై ప్రజల్ తేజముడిగి
సేవకులరీతి బ్రదుకంగ సేయకయ్య.

మహారాజా! ఈ ఢిల్లీ రాజ్యము నీ గారాబుపట్టికి అరణముగా నిచ్చి వైచినను తప్పులేదు. అతడా రాజ్యము మీకు వదలినను తప్పులేదు.

అల్లుమామ లెట్లొనర్చికొనినను యిబ్బందిలేదు. అగౌరవము లేదు. ఏవిధముగనైనను వైరములు మానియుండుట శ్రేయస్కరము.

జయ:—ఏమి? యీ తెలివితేటలు! ఏమి! యీ తేనెమాటలు! రాజ్య మత డిచ్చువాడను నేను పుచ్చుకొనువాడనునా?

అన:—దాన పూర్వకముగా గైకొనుటకు మేము బ్రాహ్మణులము గాము.

ఈశ్వ:—నాకిచ్చెదననిన బాగుండునేమొ? భుజాబలమున సంపాదింపబడవలసినదే గాని దానపూర్వకముగా సంపాదింప బడవలసినది కాదు.

ప్రస:—మాయమార్గముననో? (అని జయచంద్రునుద్దేశించి) రాజేంద్రా! ఇప్పుడు నీకు ముఖప్రీతిగా మాట్లాడుచున్న వీరందురు నీ కాప్తులని తలంపకుము. పృథ్వీరాజునెడల వీరి కందరకును గల యీర్ష్యచే నిన్నెట్లైనఁ బురికొల్పి నీ సహాయమున బగదీర్పదలంచు కొని యున్నారు. అదియును గాక విదేశీయులతో మైత్రి సంపాదించి వారితో ఢిల్లీరాజ్యముపై దండెత్తనిశ్చయించితివని మాకు దెలియవచ్చినది. దేశారిష్టకారణంబులగు నిట్టి యకార్యంబు లొనర్చుటవలన గల్గు భావిలాభనష్టములు సర్వజ్ఞుండవగు నీకు గోచరింపక మానవు. వీరి దుండగముల కిప్పుడే పారము గనపడుటలేదు. ఇక నీవు వారికి దోడై నిల్చినచో దేశ దురవస్థ యడుగవలయునా? పృథ్వీరాజుపై పగదీర్ప నీవు వారిని జేర్చినను వారు చివరకు నీకవకార మొనర్ప కూరకుండరు. ప్రస్తుత మొక పక్షమందు జేరి రెండవపక్షమును నాశనంబొనర్చి, యావల నిస్సహాయయగు నా మొదటి పక్షమున కెదురుదిరిగి యాపక్షముకూడ ధ్వంస మొనర్చి చివర కా యుభయ రాజ్యంబులు వారే యపహరింతురు. ఇప్పుడు ఆర్యావర్తమున బ్రవేశించుట కెట్టైన సందుకొర కెదురు

సూచుచున్నారు. గాని నీయందుగల ప్రేమచే వారు వచ్చుటలేదు. నా పల్కులు వేదాక్షరంబులుగా భావింపుము. చేయుజారిన చేయు నది లేదు. త్రాముబాముతో జెలగాటము ప్రాణాంతకమొనర్చును. మా మహారాజు మీ యొద్దకునుడువుమనిన మాటలు వినుము.

గీ. మనము మనమును బోరాడి మధ్య వైరి
కకట చేసేత దేశంబు నప్పగించు
కంటె జచ్చుటమే ల్బాదుకంగదలంప
నరుల దరిమి మైత్రిని బొందు టతియశంబు.

జయ:—(చిరునగవుతో) మహ్మదీయుసైన్య మరుదెంచుచున్నదని కాబోలు నెన్నడులేని మైత్రిప్రసంగములు బైలువెడలినవి.

ప్రస:—అయ్యా! వారి బలపరాక్రమములు మా ప్రభువు లెరుంగనివికావు. సమరసింహుని ఖడ్గము మొద్దువారలేదు. అదియును గాక మహమ్మదుగోరీని ససైన్యముగా నాస్థానస్థానమునకు బారద్రోలినప్పుడును, నాగూరునిక్షేపహరణార్థము మీరు సకల సామంతాదిబంధుమిత్రసహితముగా తరలివచ్చి వెర్రిమొగములు వైచినప్పుడును ప్రదర్శమైన వారి పరాక్రమము లందరు గాక పోయిన నీ పురహార యనలవరులవంటి రాజన్యచూడామణు లైనను మరచియుండరు. వారు సందేశమంపుట గోరీకి జంకియు మీకు జడిసియు ననుకొనకుడు. దేశోపద్రవమునకు జంకి, ప్రజల దౌర్భాగ్యమునకు జడిసి.......

పుర:—ఈ యుపన్యాసముతో చాల నలసితివి. ఇక్కడ వీనికి బెదరువా రెవ్వరునులేరు.

జయ:—ఓయీ! జగద్వీరులని ప్రసిద్ధిగాంచిన పూటన, పురహార, యనలవరులవంటివా రెందరుండిరో యెరుగుదువా? ఇక మావద్ద నామూారుని, నాపౌరుషహీనుని దలపెట్టకుము.

ప్రస:—మహారాజా! మీ పౌరుషముముందు వారు పౌరుషహీనులైన నగుదురుగాక. వారును పెక్కుయుద్ధములు జయించినవారే. వారు మీవలె నన్యాయమునకు సిద్ధమగుట లేదనియు, దేశద్రోహంబు సేయదలంచుట లేదనియు, దేశము విదేశీయుల చేతులలో బెట్టయత్నించుట లేదనియు, ప్రతిమానవునకు దెలియును. మీ రంత పౌరుషైకప్రధానులేయైనచో మా మహారాజును దలపడుటకు గోరీ నాశ్రయించు టేల?

అన:—ఇతడు యుక్తాయుక్తపరిజ్ఞానశూన్యుడై మాటలాడుచున్నాడు.

ప్రస:—యదార్థవాది యెప్పుడును పరిజ్ఞానశూన్యుడే. ఉన్నమాట యనిన నీ కింత యులుకేలనయ్యా?

జయ:—ప్రసన్నా! ఇంకను చెప్పవలసిన దేమైన నున్నదా?

ఈశ్వ:—తగుదునని తయారై వచ్చినవాడవు చివరవరకుఁ జెప్పుము. భయపడియెద వేల?

ప్రస:—భయపడుటకు నేను నీవంటి బ్రాహ్మణభృత్యుడను గాను. కుట్రలు, కుతంత్రములే జీవనాధారముగాగలవాడను గాను. మహారాజా! ఇవి మా మహారాజుగారి సందేశములోని కడపటి వాక్యములు.

సీ. యోగినీ రణమున నోడి ప్రాణముతోడ
వెన్నిచ్చి పారిన వీరవృత్తి
ప్రాణమిత్రుని గుజరాద్రణావనికప్డు
బలిగా నొసంగిన పౌరుషంబు
రాజసూయాధ్వర రణమందు వైరిచే
ధరమూర్ఛనొందిన ధైర్యపటిమ
అస్మత్ప్రతాపాగ్ని కడలి విదేశీయు
శరణార్థివై చన్న శౌర్యరసము

గీ. తలచుకొని సిగ్గువడకుండ కలహమునకు
మరల కాల్దువ్వి రణములో మడియుకంటె
ప్రాణహితులగు నీ ధరావరులతోడ
నింటగూర్చుంట క్షేమము చెంచుమనుము.

గీ. పృథ్వినరపాల కౌక్షేయ భీషణాగ్ని
సమరసింహ భయంకర శౌర్యవహ్ని
సైన్యచండాంశభుజబలజ్వాలనశిఖలు
ఆఱవని చెప్పుమా సంధి జరుగకున్న.

తరువాత మీ యిష్టము. బాగుగా నాలోచించుకొనుము.

అన:—ఇవి సహింపదగిన మాటలు గావు.

పుర:—వీని నేమిచేసినను తీరదు.

ఈశ్వ:—ఇతడు నిశ్చయముగా దండనార్హుడు.

జయ:—(మండిపడుచు) ఏమి! వీనిప్రల్లదంబులు! వైరివీరరణ్యదవాను లుండగు జయచంద్రు నెవ్వనిగా దలంచెనో? ప్రసన్నా! రాయ బారివి నిన్నేమియు ననగూడదు. (ఖడ్గమెత్తి)

ఉ. త్రుంతు నరాతిసంహతుల దోర్బలవహ్నిని బృథ్విరాజు నో
డింతును, ఢిల్లి రాజ్యముగడింతును భారతభూమినెల్లఁ బా
లింతును దిక్కులందు నవలీల యశశ్శరదిందుకాంతులన్
నింతును సంధి గింధి గమనింపను రమ్మను మాహవోర్వికిన్.

ఇకఁ బొమ్ము.

ప్రస:—మంచిది. (నిష్క్రమించును)

జయ:—మిత్రులారా! మన ప్రయత్నమున మన ముండవలయును. లెండు.

(అందరు నిష్క్రమింతురు.)

శ్రీ

# పృథ్వీసంయుక్త.

## పంచమాంకము—ప్రథమరంగము.

[పృథ్వీసార్వభౌముని సభ. పృథ్వీరాజు, సమరసింహుడు, సుబుద్ధి, ప్రసన్నచంద్రుడు, సన్యాసి, సంయుక్త సామంతులు ప్రవేశము]

పృథ్వీ:—ప్రసన్నా! ఈ రాయబారము వ్యర్థమగునని యెరింగియు నీకు వృథాయాసము గల్పించితిమి.

ప్రస:—సార్వభౌమా! గర్వోన్మత్తుడైన (అని సంయుక్తతో వినయముగా) తల్లీ క్షమియింపుము (అని పృథ్వీతో) వానికి దేశక్షేమకరంబగు మన రాయబారము రుచించునా?

సంయు:—అట్టి మహామూర్ఖుడని నేను మొదటనే యెరుంగుదును.

ప్రస:—అతని నెట్లయిన సన్మార్గమునకు దీసికొని వచ్చియుందును గాని చెంతనున్న యనలపురహారాదిమిత్రులు పడనిచ్చిరికాదు.

సుబు:—ఉన్న కష్టమే యక్కడ. ఆశ్రితు లాశ్రితులవగిది నుండక యజమాని క్షేమముగోరినవారివలె నటించి, కార్యము గంగలో గలుపుటయే గాక, యజమానికి బ్రమాదముగూడ దెచ్చి పెట్టెదరు.

సంయు:—యజమానిమాత్ర మేమి వచించెను.

ప్రస:—అతడు వారి పల్కులకు దలనూపుటయేగాక, దూషణమునకుంగూడ సన్నద్ధుండయ్యె.

సంయు:—ఆహా! ఆతని యస్వతంత్రత కెంతని దురపిల్లుదును. మహా రాతిశుష్క కాననదవానలుండును, ప్రతాప భాస్కరుండు నగు సార్వభౌమునినే దూలనాడెనుగదా?

పృథ్వి:—ఓయీ! జయచంద్రా! గర్వోపేతా! మూఢా! అక్షీణ బల పౌరుషధౌరేయుండనై, సమరాంగణమున కేతెంచి, మదారాతి గజసంహారంబుగావించు వేళ, సమరసింహా! రక్షమామంచు వచ్చిపడు నీ సేనల దైన్యమును గనులార గాంచనైతివి. నీ క్షేమంబు గోరి, దేశక్షేమంబాలోచించి యెన్ని విధముల నీకు హితమొనరించినను చివరకు బూడిదలోబోసిన పన్నీటిచందంబయ్యె.

సమ:—రాజేంద్రా! మీ తప్పావంతయు లేదు. కనులార జూచి యగ్నిహోత్రంబున కాహుతిగానున్న వానికి హితులబోధనలు రుచించునా? దేశసంరక్షణార్థము మన పౌరుషంబులు తేటపడ నా మ్లేచ్ఛులకు సహాయులై దేశద్రోహంబొనర్చు నృపఖండాలురను సంగ్రామరంగమున హతులనొనర్పక తప్పదు.

పృథ్వి:—బావా! దేశభక్తా!

గీ. భయదని స్త్రింసి చేబూని ప్రధనకేళి
ప్రళయకాలాంతకాకృతిఁ బరిఢవిల్ల
నలిగి పురహరుడైన నిన్గెలువగలఁడె
సమరమిదియెంత! వీరెంత! సమరసింహా!

ఢిల్లీ మహోబా కలంజర్ గుజరాత్ ఆఫ్గన్ నాగూరు పూటన్ స్థానేశ్వరాది మహారణములందు నీ బాహుశౌర్య సంపత్తిచేగదా నేను జయప్రతిష్ఠం గాంచితిని. నీ మహోపకారములకు నే నేమి ప్రత్యుపకారం బొనర్పగలుగుదును.

సుబు:—మహారాజా! మీ భుజపరాక్రమమునకు వీరధైర్యసాహసములు తోడ్పడి యంతచేసెననుటలో నాశ్చర్య మేమున్నది.

సమ:—సరియే. మన మిప్పుడు చేయవలసిన కార్య మేమియో యాలోచించి స్థిరపరచవలసియున్నది.

సింధు:—ఔను జయచంద్రనృపాలుడు పరసహాయమున నేమి, స్వతంత్రించియేమి మనలను జయించి, ఢిల్లీనాక్రమించునట! ఏదియెట్లున్నను మన ప్రయత్నమున మన ముందుట విధాయకము.

పృథ్వి:—సమరసింహా! నీయభిప్రాయ మేమి?

సమ:—మహారాజా! మనవారందరును ధర్మయుద్ధమునకు సంసిద్ధులైయెప్పు డెప్పుడని యుత్సాహపడుచున్నారు. వీరలలో నొక్కరొక్కరు జయచంద్రునివంటి పెక్కుశూరులకు సమాధానమొసంగగలరు.

పృథ్వి:—ఔను. వీరలలో ప్రతివారును కలంజర్ మహోబా స్థానేశ్వరాది యుద్ధములలో శత్రురాజుల వెన్నులజూచినవారలే గాని సామాన్యులు గారు. ఖండన పండితులు. సమరతంత్రపారీణులు. వీరి యందరిమూలముననే గదా నేను పేరుప్రతిష్ఠలంగని పరిపాలించుచుండుట!

సమ:—మహారాజా! మొన్న స్థానేశ్వరయుద్ధమున నిరాధారివై యార్యావర్తమున నిలువనీడలేక, అఫ్గనుస్థానమునకు దిరిగి పోవుచున్న యామహమ్మదీయుని జయచంద్రుడుత్తరప్రత్యుత్తరంబులు జరిపి తిరిగి యాహ్వానించెను. మనమెన్ని చెప్పినను యీశ్వరభట్టు మంత్రాంగము లముం దేమియు లాభము లేకపోయినది. మన మిక నే యాలస్యమును చేయరాదు. ఆ మహమ్మదీయ సేనాని ఢిల్లీగాని చిత్తూరుగాని సమీపింపకముందే మధ్యేమార్గమున వాని నెదుర్కొని, అక్కడనుండియే యతనిని దరిమివేయుట మంచిది. ఈ యుద్ధము గూడ మరల స్థానేశ్వరమువద్దనే జరుగగలదు.

సుబు:—అవును. ఇరువాగులవారు నేకీభవింపకుండ ప్రతిఘటించి వానిని పారద్రోలుట యుక్తము.

సమ:—కలిసినంతమాత్రమున వచ్చిన ప్రమాదమేమి?

పృథ్వీ:—ఏమియును లేదు గాని రక్తస్రావ మధికమగునని విచారించ వలసియున్నది.

సన్యా:—మహారాజా! ఈ మహోపద్రవము మనకేగాదు దేశమం తకును రానై యున్నది. ఏది యెట్లు జరుగనున్నదో యట్లు జరు గక మానదు. మన మింకను యుపేక్షించినచో నార్యావర్తమా మ్లేచ్ఛుల దుర్ణయములకు దుండగములకు గురికాగలదు. కావున సాధ్యమైనంత త్వరలో బైలుదేరి, కంఠమున ప్రాణవాయువు లుండువరకు, వారు వెనుకకు తిరిగిచూడకుండ దరుమ వలయును.

సమ:—ఔను. ఆ ప్రయత్నము మీాదనే యుండుట మంచిది.

పృథ్వీ:—ప్రాణకాంతా! ఈ విషయమున నీ యభిప్రాయమేమి?

సంయు:—నాథా! మీారు నా యభిప్రాయ మడుగుటకు గారణము నేనూహించితిని. లోకములో నితరకాంతలవలె జనకుడు ముద్దు ముచ్చటలు జరుప నాథునితోగలసి కాపురముచేయు భాగ్యము నాకు చేకూరినది కాదు. అట్టి నన్ను చేపట్టుటయే మీా మనో వైకల్యమునకు గారణమని నే నెరుంగుదును. అట్టివానికి దనయనై యేలపుట్టితినా యని విచారించుచుంటిని. కేవల బంధుభావమున చేయదగిన విధముల నన్నియు సామోపాయమున జేసిరి. చెప్పిరి. ఆ యవివేకము దండనావిధానమునగాని తిన్నబడదు. దేశసంరక్ష ణార్థము యుద్ధమొనర్పకతప్పదు. నేనును మీాతోగూడ సమర భూమి కరుదెంచి దేశసేవచేసి కొలదిగనైన భారతమాతృఋణము దీర్చికొనియెదగాక.

సమ:—అమ్మా! వీరకాంతవగుటచే బహుయుక్తియుక్తముగఁజెప్పి తివి. సార్వభౌముని కర్ధాంగివను నుడి సార్థకపరచితివి. సెహబాస్.

సన్యా:—నిష్పత్తిపాతమానసయగు నిల్లాలుగనుక ధర్మదేవతవగిది చెప్పగలిగినది.

పృథ్వి:—(సంయుక్తనుజూచి)

గీ. అవల జనకుండు నీవల ప్రాణభర్త
వైరులై రణభూమి నిల్వంగవలసె
నభినవోత్పలకోమలంబైన నీదు
హృదయ మెటులుండునో కదా సదయహృదయ.

సంయు:—ప్రాణనాథా!

గీ. ప్రళయ సంహారశక్తి నా ప్రధనభూమి
ఖడ్గమును బూని మ్లేచ్ఛరక్తస్రవంతి
దేశమాతను రణకేళి దేల్చినేన
పట్టెదను మంగళారతి పళ్ళెరంబు.

అన్యదృష్టి నా హృదయమున నా వంతయును లేదు.

పృథ్వి:—వీరకాంతా! దైవము నీ వాంఛితం బీడేర్చుగాత.

సంయు:—ప్రాణనాథా! రణభూమికి నేనుగూడ వచ్చుట కనుజ్ఞ యిడియెదరుగాక.

పృథ్వి:—ప్రాణపత్నీ! వీరకాంతా! నీ యస్త్రశస్త్రవిద్యాపాండిత్య మవసరమునుబట్టి చూపవచ్చును. నీవు రణమొనరించు నవసర ముండిన నప్పుడులోడ్కొనిపోయెద. అంతవరకు నా రాజ్యభారము నీవు వహించి ఢిల్లీసింహాసన మధిష్టించి, నగరము శత్రులపాలు కాకుండ గాపాడుచుండుము.

సంయు:—నాథా! మీ కెదురాడుచున్నందులకు క్షమింపుడు. మీతో గూడ నుండి, మీ సమరకౌశలంబు జూచుచు, మీ రలసినపుడు

నా రణపాండిత్యము గనుపరచుచు, కృష్ణునకు సహాయమొనర్చి శత్రు సంహారమొనర్చిన సత్యభామరీతి కదనరంగ విహారమొనర్ప వలయునని మిక్కిలి యభిలాష పడుచుంటిని. (త) నా యస్త్రగురుం డగు వినయశీలు డిప్పు డెచ్చటనుండెనో గదా! (ప్ర) నాథా! నగర రక్షణమునకు రణరంగవిద్యావిశారదయగు నా చెలికత్తె మంజ రియే చాలును.

సన్యా:—(తనలో) ఆహా! గురుత్వ మెన్నినాళ్లకు సార్థకమయ్యెను. (ప్ర) మహారాజా! మంజరి శస్త్రవిద్యయందు వీరకాంతకు దీసి పోవునది కాదు. ఆ భార మామె నిశ్చయముగ వహింపగలదు.

పృథ్వి:—కాంతా! నీ వంత యభిలాష పడుచుంటివి గనుక మాతో గలసి రణమునకు రమ్ము. ఎవరక్కడ?

సేవ:—చిత్తము.

పృథ్వి:—మంజరి నిటకు దోడ్కొనిరమ్ము.

[అమరసింహుడు ప్రవేశము]

అమర:—

సార్వభౌమా! నమస్కారము. నాకుగూడ రణంబునకుబోవ ననుజ్ఞయిండు. నేనుగూడ నొక క్షత్రియకుమారుండనే.

మ. కదనక్షోణిని శౌర్యవిక్రమపరాక్రంబెల్ల దీపింప దు
ర్మదులౌ మ్లేచ్ఛుల చీల్చి చెండి రుధిరస్రావంబులో ముంచి మా
పెద మావంశకళంకమున్ రిపులపెన్ బీరంబునొక్కుమ్మడిన్
విదళించున్ కరవాలమే ప్రతిభతో వీరుల్ ప్రశంశింపగన్.

పృథ్వి:—కుమారా! చిన్నవాడవు. అప్పుడే నీవు రణమున కరుగు నవసర మేమివచ్చినది? మేము చాలమనియా లేక తురుష్కులకు జడిసి వెనుకంజవేయుదుమనియా నీ యుద్దేశము?

అమర:—సార్వభౌమా! మహోత్సాసంగరమున మరణించిన నా తండ్రియగు కర్ణాసింగు కీర్తికి భంగమువచ్చినది. ఆ యపకీర్తి దుడిచి మా తండ్రికీర్తిని ఆ చంద్రతారార్కము నిలుప మీ యనుజ్ఞ కోరుచుంటిని.

వృథ్వి:—ఏమి? నీతండ్రికీర్తికి భంగమా? ఎంతమాట! ఎట్టియపకీర్తి? ఎవరు తెచ్చిపెట్టిరి?

అమర:—నా తండ్రి రణరంగమున జావలేదనియును, అతడసలు రణంబునకే యేగలేదనియును నాతోడిబాలురు వచించిరి. ఆ మాటలు కర్ణములకు శూలముల రీతినాట యిట్లు పరుగెత్తి మీ సముఖంబునకు వచ్చితిని.

ఉ. ఏలికవీవు నాకు సెలవిమ్ము పరాక్రమపౌరుషప్రబల్
గ్రాలగ వైరివీరులను గండడగించి భయంబువించి భూ
పాలకవీరుసేవ సలుపందగు మేటిదురంధరుండె యీ
బాలకుడంచు మీరలు శబాసనిమెచ్చ యశంబుగూర్చెదన్.

వృథ్వి:—(చిరునగవుతో) అట్లనా? పోలేదని చెప్పిరా?

అమర:—యుద్ధానంతర మాతని కళేబర మాహవభూమిని గనుపింపలేదట.

సన్యా:—అదియు వాని తప్పేనా?

వృథ్వి:—అదియా విషయము? ఆసంతాపము హృదయమున నుంచుకొనకుము. సభ్యులారా! కర్ణాసింగు నాతోబాటు శరీరమునిండ గాయములు తగిలి నాకుగొలదిదూరమున బడియుండెను. అప్పటికి యుద్ధము మేము పడియుండిన స్థలమునకు గొంతదూరములో జరుగుచుండుటచేత గ్రద్దలు మొగురుచు నేను గూడ నొక శవమునే యనుకొని నా చుట్టునున్న శవములతోపాటు నన్నును పీకికొని తినుటకై నాదగ్గరకు రాజొచ్చినవి. అప్పు డతడు తొడమీద

గాయముదగిలి స్వాధీనముతప్పియుండుటచేత నా దగ్గరకు రా బ్రయత్నించియు రాజాలక, గ్రద్దలు నామీద వ్రాలకుండ జేయు తలంపున చెంతపడియుండిన మొండికత్తి సాగియుండుకొని దానితో తనశరీరమందున్న మాంసమంతయు కండలుగా గోసి నాపై నెగురుచున్న గ్రద్దల కాహారముగా విసరివైచి అస్తిగత ప్రాణుడై మరణించెను. అట్టిప్రభుభక్తిపరాయణునకు నట్టిశూరునకా యిట్టి యపవాదము? అపకీర్తి? చాలు చాలు.

అమ:—వాని యస్తిశరీర మేమైనదో?

పృథ్వీ:—ఏమయినదోగాని యుద్ధానంతరమున రణభూమిని కనుపించలేదు. కాని మహోబావద్ద నామహావీరుని స్మరణచిహ్నముగా మందిరమొకటి మాత్రము గట్టించితిమి.

సన్యా—చిత్తము. ఆ మార్గమునుండి వచ్చిపోవు మావంటి సన్యాసుల కిప్పుడా ప్రాంతముల నదియే యాధారము.

సమ:—నాయనా! కర్ణాసింగుకుమారా! నీ తండ్రియట్టివాడే రణరంగభీరువైనచో నిక క్షత్రియజాతిలో కత్తిబూనగల మగవాడెవ్వడు! ఆతడు లేనియెడల నార్యావర్త మిదివరలోనే పరరాజుల చేతులలో బడియుండెడిది. నీవు నీ తోడిబాలురతో నీమాటలు చెప్పి విచారము దక్కియుండుము.

సన్యా:—కుమారా! నీవిప్పుడే యుద్ధమునకు రావలసిన తొందరలేదు. పెద్దవారు చాలమంది గలరు. అవసరమువచ్చిన మావంటి సన్యాసులు గూడ గలరు. మరికొంతకాలము శస్త్రవిద్య నభ్యసించి దేశముకోరినప్పుడే బయలుదేరి వచ్చెదవుగాక. భరతమాత మీవంటి స్వార్థత్యాగులగు యువకులమీదనే గదా గంపెడాసపెట్టుకొనియున్నది.

చ. జనవర నిష్కళంకగుణసాంద్రుడు వీరుఁడు ధీరుఁడైన నా
జనకున కేల నీ యపయశంబని బావగ వేగిరింప నా
మనమిట వచ్చితిన్ సభకు మంచియొ చెడ్డయొ బాల్యచాపలం
బని మదినెంచి చూపుచు దయన్ క్షమియింపుము పోయివచ్చెదన్.

(అని నమస్కరించి నిష్క్రమించును)

సమర:—ఆహా! కర్ణ(రవాని కెట్టిపితృభక్తి! ఎట్టి యాత్మగౌరవము!

సంయు:—అందరు నాతండ్రివంటివారలే యగుదురా!

సన్న్యా:—భరతఖండమా! నీ వింకను నదృష్టశూన్యవు గాలేదు: జయ
చంద్రుడు యీశ్వరభట్టు వంటి స్వలాభపరాయణులగు బిడ్డలు నీ
కడుపున బుట్టినప్పటికిని సంయుక్త వంటి వీరపుత్రికలను అమర
సింహునివంటి యభిమానధనులను కనుటమాన లేదు.

పృథ్వీ:—రాజన్యచూడామణులారా! మన కిది మంచి శుభసూచ
కము. మీరు మీ మీ ప్రయత్నముల నుండుడు. నగరరక్షణము
నకు గావలసిన యేర్పాటులొనరించి వచ్చెదను.

అందరు:—మహాప్రసాదము (అని నమస్కరించి నిష్క్రమింతురు)

మంజరి [ప్రవేశించి] సార్వభౌమా! నమస్కారము. మహారాణీ....

సం:—(అడ్డువచ్చి కౌగలించుకొని) మంజరీ నీవు నా యెడల నట్టిమర్యా
దలు జరుపనక్కరలేదు. నేను రాణినైనను నీకు చెలి సంయుక్తనే.

మం:—తల్లీ! నన్ను పిలువనంపిన కారణము......

సం:—రాచకార్యమున సహాయపడుటకు.

మం:—నా కంత గౌరవ మలవడజేసిన కార్య మేదై యుండును?

పృథ్వీ:—జరుగనున్న మహాయుద్ధమున మాతోపాటు నీచెలి సంయు
క్తకూడ యుద్ధభూమికి ప్రయాణమగు చుండుటచేత మేము విజయ
మంది తిరిగి వచ్చువరకును నీవు నగరరక్షణభారము వహించి...

మం:—మహారాజా! అబలనగు నే నంతటి కార్యభారము...

పృథ్వీ:—(మందహాసముతో) నీ శక్తిసామర్థ్యములు నీచెలి వలన పూర్తిగా నెరింగితిని. దాని కేమి కాని......

మం:—మహారాజా! పుట్టిననాటినుండి నొక క్షణమైన విడిచి యెరుగని దేవిని సమరభూమి కనుసరించి తగినసహాయము......

సం:—చెలీ! నీ సంగతి నే నెరుంగనిది కాదు. నిన్ను విడిచిపోవుట నాకును యిష్టములేదు. కాని అయిన మగవారందరును యుద్ధమునకు పోవుచున్నారు. ఇక నిన్ను కూడ తీసికొని పోయి......

మం:—దేవీ! ఇది న్యాయమా?

శా. నీ నెయ్యంబును నీ యుదారగుణమున్ నీ ధర్మశీలత్వమున్
నేనాశించిగదా స్వదేశసుఖమేని స్వీడు కోగంటి నీ
వే నా తోడును నీడవంచ నెడు నన్వెన్వెంట గాగోరకే
యీనాడిట్లు రణంబుకేగతగునా యిల్లవ్వగా జెప్పచున్॥

సం:—చెలీ! నన్ను వృథా తలంపకుము. కార్యావసర మెంతవరకయిన చేయించును. వేరుమాట చెప్పకుము.

గీ. జయము సంప్రాప్తమైన నీశ్వరునికరుణ
నేను వచ్చెద, లేకున్న లేనె లేదు
మనకు గల చెల్మి ఫలము నేమరక నీవు
నగరరక్షణమును వహింపంగ తగును.

మంజ:—(కౌగలించుకొని) శత్రుగర్వనిర్వాపణుండగు పృథ్వీచక్రవర్తి యంతవానికి సహాయపడనున్న నీ కేమిలోటు! వీరపత్నులును అందు రణరంగమునకు పోవనున్న నీ వంటి స్త్రీరత్నములును అనవలసినమాటలా యివి? ధైర్యము వహించి తొల్లి సత్రాజితునందని వోలె శత్రుసంహార మొనరించి యందర కానందముకలుగ చేయుము.

పృథ్వి:—మంజరీ! మే మిక ప్రయాణసన్నాహమున నుండవలయును. వ్యవధిచాలదు.

సంయు:—చెలీ! మా విజయమునకు భగవంతుని ప్రార్థించుచు నగరరక్షణమున నప్రమత్తురాలవై యుండుము.

మంజ:—తల్లీ! సంగరోత్సాహివై భర్తను వెన్నంటి పోవనున్న నిన్ను విడుచుట కష్టతరముగా నున్నను దుఃఖించుట శుభసూచకము గాదు. ఆ త్తరక్షణయందప్రమత్తురాలవై చాకచక్యముగా మెలగి విజయలక్ష్మీసమేతవై భర్తృసహితముగా పునర్దర్శన మొసంగుదువుగాక. (అందరు నిష్క్రమింతురు. తెరపడును)

ద్వి తీ య ర ం గ ము.

[జయచంద్రుడొంటరిగానుండ సంయుక్త ప్రవేశము]

సంయు:—(తనలో) ఆహా! దైవమా! నా నుదుట నెట్టి కష్టములు వ్రాసి పెట్టితివి? ఒక ప్రక్క తండ్రి. ఒక ప్రక్క భర్త. ఎవరి కాపద సంభవించినను నాదియే కదా? ఎవరికి యేహాని సంభవించినను అంతగ విచారింపనుగాని, దేశము తలుపు తెరచిన యింటివిధంబున ప్రతిపక్షులకు జిక్కక మానదని విచారింతును. కావున నా తండ్రిని దర్శించి, యుద్ధము విరమింపుమని ప్రార్థించెదను. ఆహా? ఈతడు పరమమూర్ఖుడు. తా బట్టిన కుందేటికి మూడే కాళ్లని వాద మాడును. అయినను ప్రయత్నింపక తప్పను. (సమీపించి) తండ్రీ!

జయ:—(ఆశ్చర్యముతో) ఎవరు?

సంయు:—నేను నీ కుమార్తెను సంయుక్తను.

జయ:—(చూచి యసహ్యముతో) ఛీ! ఛీ! నీవా కుమార్తెవు నాకు?

సంయు:—తండ్రీ! నేను నీ తనయను గాదనినంతమాత్రమున దప్పునా? నా చెప్పబోవు మాట లాలకించి తరువాత నీ యిష్టమువచ్చినట్లొనర్చుము.

జయ:—(కోపముతో) ఛీ! కులటా! నాకుం బలవద్విరోధియగు నొకనీచుని వివాహమాడి తిరిగినన్ను తండ్రీ యని సంబోధింప వచ్చితివా?

సంయు:-అయ్యో! తండ్రీ! నాకు దండ్రివిగావా? కా దనినను సరియే నాకు వందనీయుడవు. నా భర్త యనుజ్ఞపైన నిన్ను సందర్శింప వచ్చితిని.

జయ:—ఛీ! ఆ తుచ్ఛుని మాట నావద్ద తలపెట్టకుము. నాడు నిండు సభలో నా శత్రుని వరించి నన్నవమానించిన నిన్ను ఖండఖండములుగా కోసినను నా కడుపుమంట తీరదు.

సంయు:—తండ్రీ! నీ యిష్టమువచ్చిన నట్లనే చేయుము. కాదనను. హృదయపూర్వకముగ నంగీకరింతును. కాని యుద్ధ మాపు సేయుము. చక్రవర్తితోగలసి మహమ్మదీయదండయాత్ర నాటంకపరపుము.

జయ:—చక్రవర్తితో గలియవలయునా?

సంయు:—తండ్రీ! పోనిమ్ము. శత్రువులతోనైన గలయకుండుము. సమరసింహునితో యుద్ధమొనరించి నిలువ నీడలేకుండ లాహోరునకు పారిపోవుచున్న యా మహమ్మదీయుడు తిరిగి యార్యావర్తముపై దండువిడియనుండుట నీ యెడ జూచుకొనియేగదా? ఇంతకన్న ఘోరమున్నదా? మ్లేచ్ఛసహాయ మపేక్షించుట నిప్పు వడిలో గట్టుకొనదలంచుట కాదా?

జయ:—ఓసీ! నిర్భాగ్యురాలా! ఆ తుంటరి వంపుటకును నీవు తగుదువమ్మా యని బయలుదేరుటకును సరిపోయినది.

సంయు:—తండ్రీ? ఇంతకాఠిన్యము తగునా? నా మాట మన్నింపుము. దేశము పాడుసేయకుము. ఇప్పటికి రెండు రోజులనుండి యుద్ధము జరుగుచున్నది. ఉభయసైన్యములలో నీ సోదర ప్రజలెందరు మడసిరో తెలిసికొనుము. ఎందరు సైనికులు మిగిలెదరో గ్రహింపుము. నా ప్రార్థన వినుము. యుద్ధ ముపసంహరింపుము.

జయ:—ఎందరు పోయినను నా కావంతయు విచారములేదు. అప్పుడే తీరికగా లెక్కచూడవచ్చును. అప్పుడే చెప్పవచ్చును. పో! పొమ్ము.

సంయు:—అప్పుడు నేను చెప్పునదియు, నీవు వినునదియు నే ముందునా? మన మందర మప్పుడు మిగిలినకదా! దేశసంరక్షణార్థము

చెప్పుచుంటిని. నా కొరకు గాదు. నా పతికొరకు గాదు. దేశము విదేశీయుల పాలగుననియు, ప్రజలు కష్టముల పాలగుదురనియు—

జయ:—ఓసీ! తుంటరీ! గ్రుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించిన దన్నట్లు నీవా నా కుపదేశించుదానవు? ఆ పృథ్వీఘాతకుని యమసదనమున కంపినగాని నీ మాటలు నా చెవికెక్కవు. ఇక వెడలి పొమ్ము. మహమ్మదీయులే యేలుదురుగాక నా కా విచార మావంతయును లేదు. పో! పొమ్మనిన పోవేమి?

సంయు:—హా! ఘోరము! ఘోరము! వారు సవ్యముగా నేలుదురా! నిన్నమొన్నటివర కార్యావర్తము నంతను అట్టుడికి నట్లుడికించిన గజనీమహమ్మదు దండయాత్రల నప్పుడే మరచితివా? పల్లెలు పట్టణంబులు గొల్లగొట్టి యెన్నిదేవాలయములు పాడొనర్చిరి. ఎంత జనమును నిర్మూలించిరి. ఈ గోరీయు నతని యనుచరుడే. నా మొగమైన జూడుము. చక్రవర్తితో సఖ్యము పాటింపుము. అతడు నీ కే యపకృతి గావించెను? వానిపై బగదీర్పబూని, యీ విదేశీయులతో జెల్మి పాటింపకుము. మీలో మీరు తగవులాడుకొనినను మంచిదియే గాని యన్యుని చేర్చితివా మన మానప్రాణములు దక్కవు. అందువలన దేశమున కనర్థకము గలుగును. మా తప్పులు క్షమింపుము. యుద్ధ మాపుజేయుము.

గీ. అకట యాచంద్రతారార్క మవనిమీద
నన్యదేశీయులకు దేశ మప్పగించి
ప్రజలు దిట్టంగ నపకీర్తి పాలువడకు
మయ్య, నా నుడి యోజింపుమయ్య మదిని.

జయ:—ఓసీ! దురాత్మురాలా! సంధి మిషమున వెక్కిరింప వచ్చితివా? పరుల నాశ్రయించు దుర్బలుండ నని యెత్తిపొడుచుచుంటివా? నీవు చెప్పుమాట లిప్పుడు నా తల కెక్కవు.

గీ. ఎవని దుష్టుని క్రూరుని హీనమతిని
భర్తగ వరించి తండ్రిపై పగ వహించితో
అతడు రణభూమి గూలిన యపుడు నీదు
పలుకు వినవెంతు పొమ్మింక కలుషహృదయ.

సంయు:—ఆహా! ఎంత దారుణము. అనరాని మాట లాడుటకు నీ మన స్సెట్లొప్పెను. నీ కంటె కఠినుడు గలడా? తండ్రి వను గౌరవమున నితో ముచ్చటించుటకు వచ్చితిని గాని నీ వలన భయపడి గాదు. సహజప్రతాపశాలియగు పృథ్వీసార్వభౌముని రణభూమిని గూల్చు టకు నీకు గాదు పురహారునికైన శక్యమా?

గీ. సమరసింహుని ఖడ్గంబు జారకుండ
నస్మదుగ్రప్రతాపాగ్ని యారకుండ
నీవు నీ మ్లేచ్ఛు లని లోన నివురుగాక
పృథ్వి నరపతి గూలునే పృథ్విమీద?

ఓరీ! నీచా! తుచ్ఛులగు విదేశీయులతో గలసి దేశము పాడునే యవలంచితివని హితోపదేశం బొనర్చితిని గాని లేకున్న నీ వేగంగ లోదిగిన నాకు గావలయును. నీవు తలంచినట్లు పృథ్వీనరపాలు డంత పైపైన నుండెనని తలంపకుము. దైవప్రతికూల్యమున మడిసిన మడియవచ్చును గాని, నీ చేతగాని యామ్లేచ్ఛుల చేత గాని యతడీల్గువాడు కాడు. మహావీరులకు రణంబున మరణంబని విధి చేటలలో బడునప్పుడే లిఖించియుంచును. కాని నీ యశ్లీలములు నా హృదయమును చేదించుచున్నవి! సరే. సైన్యంబు లంతమొంది మ్లేచ్ఛులు నీ రాజ్య మపహరింప నీవును యీశ్వరభట్టును మహమ్మదీయుల చేతులలో నీచాతినీచమైన చావులు చచ్చునప్పుడు నామాటలునీకు స్మరణకువచ్చుగాక. రణమున నీవు నా నాథుని చేత బడినను మామ వను నభిమానంబున వదలునేమో గాని నేను నిన్ను చిత్రవధగావిం

పక విడచిపెట్టను. నీవంటి హీనుని గర్భవాసమున బుట్టిన మహాపాపమును నాప్రాణంబులు దేశసంరక్షణార్థము రణస్థలంబున కప్పగించి పోగొట్టుకొందుగాక. ఇక నిన్ను వైరిగనే యుద్ధభూమినే చూడగలను.

జయ:—ఛీ! ఛీ! తుచ్ఛురాలా! ఆడుదానవని యెంత యూరకొనుచున్నను నోటికి వచ్చినట్లెల్ల ప్రేలుచుంటివి. నా కండ్లయెదుట నుండి పొమ్ము. (అని తన్నును)

సంయు:—(క్రోధయై) దురాత్ముఁడా! దేశద్రోహీ! ఆత్మగౌరవము జంపుకొని, దేశక్షేమము నారయక, పరదేశీయుల ప్రాపకము గోరి చివరకు నశింపనున్న నీయట్టి పరమనీచుడు నీయట్టిచండాలుడు

గీ. పూయభూయిష్ఠమైనట్టి పురుగుగుంట
బ్రహ్మకల్పాంతములు ఘోర రౌరవాది
నరకయాతన లందుచు నవయుజూవె
వంశమున నీళ్లు వదలెడివాడు లేక.

(నిష్క్రమించును. తెరపడును)

తృ తీ య రం గ ము.

[సంయుక్త పృథ సుబుద్ధి ప్రవేశము]

సంయు:—మహామంత్రీ! గాయము తీవ్రముగనే తగిలినవి. దేశసంరక్షణార్థము గాయపడిన నా జన్మము ధన్యమైనది. సాధారణముగా నందరకును లభించదు. నే నందులకు మిక్కిలి గర్వపడుచున్నాను.

సుబు:—అమ్మా! మహాయోధులకు మించిన పరాక్రమము జూపి శత్రురాజులకు గంతగతమైన ని యుద్ధనైపుణి మా దురదృష్టవశమున నట్టుగా బరిణమించినది. పృథాదేవి యంతిలో సహాయపడి వాసని బరిమార్చినది గాని—

పృథ:—ఈమెను గాపాడజాలకపోయిన నా సహాయ మేమి?

సంయు:—అది యేమిమాట! నీ వేమిచేయుదువు. కాలము మీరివచ్చి నప్పుడు యెవరైనను అంతియే. నేను మాత్రి మపరిమిత్తురాలనై యుంటినా! ఆ ప్రతికక్షి మోసమున నింత జరిగినది. ఆహా! బాధ--

పృధ్వీ:—అమ్మా! రణరంగమున స్వయముగాపోరి పే[illegible]వీరులం దునుమాడి నందులకు చక్రవర్తి కెదురేగి వాని మెప్పు వడయు భాగ్యము లేకపోయినది గదా తల్లీ?

సుబు:—అమ్మా! వేదన కొంచె ముపశమించినధా?

సంయు:—ఉపశమనమున కేమి గాని—అయ్యా?

సుబు:—అమ్మా! ఏమి సెలవు?

సంయు:—నా నాధుని కొక యుత్తరము వ్రాయవలయునని యున్నది. ఇక నీ జన్మమున నాతని జూచు భాగ్యముండునట్లు కనుపించదు. పరికరముల తెప్పింపుము.

సుబు:—అమ్మా! అధైర్య పడకుము. భగవంతుడు నీకు స్వస్థత చేకూర్చి చిరాయు వొసంగగలడు. కులదేవతలు నిన్ను గాపాడుదురు.

సంయు:—ఐన నురియు మంచిది. కాని లేఖవ్రాయుటలో ప్రమాద మేమున్నది.

సుబు:—చిత్తము. అట్లనే చేసెద. (వెడలును)

పృధ:—దేశము కొరకు దండ్రి నెదిర్చి జయముగాంచితి వన్న సంతస మింతైన లేక మమ్మందర విడచి పోవుచుంటివా తల్లీ!

(పరికరములతో సుబుద్ధి ప్రవేశము)

సంయు:—(అందుకొని - ప్రయత్నము చేసి వ్రాయును)

సుబు:—(తనలో) ఆహా! ఈ సాధ్వికి సార్వభౌమునియం దెంతటి యనురాగము. మరణ బాధ గూడ గమనించుట లేదు.

సంయు:—అయ్యా! ఈ లేఖ నా నాధుని కందజేయుము. ఇచ్చటి సంగతి సవిస్తరముగ జెప్పి, నాకై విచారింప వలదనియును, శత్రు

మోసమున నింత జరిగె గావున శత్రుసంహారము విధాయకమనియును జెప్పుము. నా నాథుడు నాకై యేదేని సాహసము జేయకుండ చూచుచుండవలయునని నా సోదరుడు సమరసింహునకు గబురుచేయుము. వదినా! అట్లు నీవుకూడ కబురుచేయవా?

పృథ:—నీ దగ్గరనుండి నే నింత జేసితిని. ఇక నక్కడగాని జరుగదు. తల్లీ! బెగ్గిలకుము. ధైర్యమూనుము.

సంయు:—ధైర్యమున కేమిలోటు. శత్రుపరాజయమును, దేశసంరక్షణవార్తయు జెవిని బడకుండ పోవలసివచ్చునేమో యని విచారించుచుంటిని గాని- నేను పోయినను నాకంటె ముందుగ దన్నాశ్రయించుకొనిన రాజ్యలక్ష్మి వారిని విడనాడలేదు గావున నాకై విచారించక, భారతరాజ్యమును నిలువబెట్టుకొన బ్రయత్నించు మనుడు. ఇదియే నా తుది నమస్కారము—నా నాథుని కందజేయుడు.

పృథ:—(దుఃఖించును)

సుబు:-ఈవార్త! నేనెటుల విన్నవింపగలను. అతడు విని జీవములతో-

సంయు:—అయ్యో! అందులకేగదా మీయందర నింతగా ప్రార్థించుట. వధూనికా!

పృథ:—హా! ఢిల్లీరాజ్యలక్ష్మీ! వధూనికా యని నీవు నన్ను బిలుచుట కిదియే కడసారి కాబోలును. (దుఃఖించును)

సంయు:—ఈవార్త దుఃఖింపకుము. అందేమి ప్రయోజనమున్నది? ఊరటజెంది నా మాటలు శ్రద్ధగా వినుము. కంఠము నుండి హృదయము వరకును రక్తనాళములు భిన్నభిన్నములై పోయినవి. నే నిక జీవించుట కల్ల. దానికై వగవను. నా నాథునకు దేశమునకు నే కొరంతయు లేకుండునట్లును, జన్మజన్మములకైన నా మహాత్ముని పాదసేవయే నాకు లభించునట్లును, భగవంతుని ప్రార్థించుచు ప్రాణములు విడుతును. నీ వొకసారి వీలు గలిగిన నా జన

కుని కలసికొని, వాని మూలమున నా కీట్టి దశ ప్రాప్తించినందు లకు నాకు విచార మావంతయును లేదు గాని, యీ విదేశీయు లచే నావంటి స్త్రీ లెంద రెట్టి యవస్థలకు గురియై దుఃఖించు చుండిరో యని విలపించుచుంటిననియు, నిక ముందైన న్యాయ మార్గము ననుసరించి యట్టివారలు మ్లేచ్ఛుల బాధలకు గురి గా కుండ గాపాడవలయుననియును, నే జేసిన యపరాధములు క్షమిం పుమని చేతులు జోడించి ప్రార్థించితిననియు చెప్పి, విదేశీయుల కీ దేశ మున నాస్కారము లేకుండ జేయ శపథము పూనుమనియు గోరుము. అమ్మా! నాకు ఆయాసము అధికమ...

పృథ:—అమ్మా! వర్తమాన మంపితిమి. అతడు వచ్చువరకు నైన...

సంయు:—అమ్మా! మన యిష్టమా యది? దానికైన నోచుకొన లేదు గాబోలు. ఎంతకు నోచిన నంతియేకదా! కాని—

సుబు:—అమ్మా! మాటలాడవేమి?

సంయు:—(చూచుచు నూరకుండును)

పృథ:—అమ్మా! మాటలాడవేమి?

సంయు:—నాకు—ఆయాసము—అంతకంతకు—విశ్రామాగారము— గాలి—గాలి

పృథ:—హా! తల్లీ! మమ్ము విడచి పోవుచుంటివా? నా సోదరునితో ఏమని—(అని దుఃఖించును)

సుబు:—ఎవ రక్కడ? (మంచము లేవదీయుదురు) (తెరపడును)

## చతుర్థరంగము.

[పృథ్వీరాజు వినయశీలుఁడు ప్రసన్నుఁడు ప్రవేశము]

పృథ్వీ:- శా. లేశంబైనను మాతృభూమి హననక్లేశంబు లేకుండ దు
ష్టాశాబంధనిబద్ధుఁడై తురుకకున్ సాకారియై దేశమున్
నాశంబందఁగఁ జేయ నెంచిన కుతంత్రజ్ఞుండు మూఢుండు భూ
మీశుండా జయచంద్రదుష్టుఁడు ఖలుం డెందుండెనో జెప్పుఁడీ?

ఓహో! జయచంద్ర సేనాధిపతులారా! సేవలారా! మీ మహారాజుగా రెందున్నారు? స్థానేశ్వరప్రథమ యుద్ధమును వారికి జ్ఞాపకము సేయుఁడు. శీఘ్రముగా రణరంగమునకు దయచేయుమని చెప్పుఁడు. నాఁడు ప్రసన్నచంద్రుని యెదుట నన్ని దంభోక్తులాడి యిప్పుడు సమయమునకు దూరముగా నుండనేల? (ఆలోచించి) ఏమిది! ఎడమ భుజ మదరుచున్నది? సంగ్రామాభిలాషినై యరుదెంచిన నాకీ యనిమిత్తము లేమి! ఖడ్గముఁ జేఁబూని ముందునకు బోవు నాకు నిరుత్సాహమా! ఎడమకన్నదరుటయా! ఏమి యప్రియవాక్యము వినవలసి వచ్చునోగదా!

విన:—మహారాజా! సర్వసన్నద్ధులమై సమరోత్సాహమున నుండక న్నదరుచున్నది కా లదరుచున్నది యని యాలోచించుట తగునా? ఏది వచ్చిన వచ్చుగాక. ఏమి జరిగిన జరుగుగాక. తలపెట్టినది ధర్మకార్యము. భగవంతుఁడు మెచ్చునట్టిది. అతఁడే తోడుపడఁగలఁడు.

పృథ్వీ:—ఔను. విరోధివధావధానమనస్కుఁడనై వచ్చి దేశద్రోహులనందర నీఖడ్గరాజమున కాహారమొసంగుట సమంజసము గాని వెనుకముందు లాలోచించుట వీరజనోచితకార్యము గాదు. కావునదీని కంతకును మూలకారణమైన జయచంద్రహతకుని మట్టుమాపి-

సుబుద్ధి(తొందరగాప్ర] మహారాజా! నమస్కారము (తలవ్రాలవైచును.)

పృథ్వీ:—సుబుద్ధీ! అందరు సుఖముగా నున్నారా! ఏమి నీ వదన
మంత దీనముగ నున్నది? దేవి సుఖముగ నున్నదా?

సుబు:—దేవిగారి యుత్తర మిదిగో.

పృథ్వీ:—(ఆత్రముతో) ఏమి? మాటలాడవేమి? నా దేవి కెట్టి ప్రమా
దమును వాటిల్ల లేదుగదా?

సుబు:—శత్రువులు హఠాత్తుగా ఢిల్లీని ముట్టడించుటచే జరిగిన సంకుల
సమరమున దేవిగారి భుజమున బలమైన గాయము తగిలినది.

పృథ్వీ:—అంత గాయము తగిలిన నా దేవి జీవించియుండునా? మరల
నా కంటబడునా? మాటలాడవేమి తండ్రీ? నీ విక చెప్పనక్కరయే
లేదు. హా! ప్రేయసీ! (అని కూలబడును)

విన:—ఎంతటి ప్రమాదము తటస్థించినది! మహారాజా! ఊరడిల్లుము

పృథ్వీ:—హా! సంయుక్తా! ఎట్టి విపత్సముద్రమునఁ బడితివి. సంగతి
సవిస్తరముగ జెప్పుము సుబుద్ధీ!

సుబు:—ఈ యుత్తరమున సర్వము—

పృథ్వీ:—(ఉత్తరము పుచ్చుకొని) నా ప్రేయసి వ్రాసిన కడసారి
యుత్తరమా యిది? (విప్పి) చదువుటకు నన్నీ పాడు కన్నీ రవరో
ధించుచున్నది (అని వినయశీలున కిచ్చును)

విన:—(చదువును) ప్రాణేశ్వరా! నా భాగ్యదోషమున భవదీయ
చరణసేవ నేటితో...

పృథ్వీ:—ఆ! తీరిపోయినదా? ఏమి చెప్పవేమి?

సుబు:—మహారాజా! ఊరడిల్లుడు.

విన:—(చదువును) శత్రు లాకస్మికముగా నగరము ముట్టడివైవ నా
సంకులసమరమున శత్రుసేనాని మన సైనికుని వేషము ధరియించి
నన్ను జేరి నా భుజముపై గాఢమగు గాయము గలిగించెను. నాకు
మీ దర్శనభాగ్యము లేదు గాని దేశము మ్లేచ్ఛుల పాలవడకుండ
గాపాడవలయును. నా యపరాధములు మన్నింపవలయును,

పృథ్వీ:—హా! ప్రేయసీ! జీవితేశ్వరీ! ఢిల్లీపుర రాజ్యలక్ష్మీ!

గీ. అశనిసంకాశమైన నీ యంత్యవార్త
వినిన హృదయంబు వ్రయ్యలై చన దిదేమి?
ఱాతనిర్మించె కాబోలు ధాత యకట!
యుసురు మోయంగ నాదు సంయుక్తబాపి.

మ. అకటా! ప్రేయసి! శారదేందునిభరమ్యంబైన నెమ్మోము ర
క్తక యద్యుతి యుద్ధభూమి బొరలంగాజూచు వజ్రాత్ముఁ డెం
లండని మద్వియోగమగు చింతంబొందకే నిష్ఠ మ
ట్టుఁ నీతో నరుదెంచుచుంటి మహిళా సీమంత ముక్తామణీ.

విన:—మహారాజా! తమవంటి సర్వజ్ఞులే ధైర్యము వదలిన నిక మా బోంట్లమేమి కాగలవారము. దేశసేవకై యుసురు లర్పించిన యా వీరకాంత కడు ధన్యురాలు.

పృథ్వి:—ప్రేయసీ! నీ వస్తమించుటచే దేశమంతయు నస్తమించి నట్లున్నది. సంయుక్తా! సంయుక్తా!

ఉ. దేశము! దేశమో యనుచు దేశము కోస మనేకభంగులా
క్రోశమొనర్చి, మ్లేచ్ఛరిపుకోటి వధించి, స్వదేశరక్షణా
వేశముచే రణోర్వివయి వెన్నిడి వ్రాయుచుఁ బంపినట్టి సం
దేశఫలంబునైన వినఁదీరక నేగితి వేమనందికన్.

నా సంయుక్తలేని యీ పాడుప్రపంచకముతో నాకుఁ బనియేమి!

గీ. రణము నాకేల! నింక సామ్రాజ్యమేల?
ప్రాణమేల? యశోవైభవం బదేల?
ప్రాణమైనట్టి నా వీరపత్ని బాసి
యొక్క క్షణమైనఁ బ్రదుకలే నుర్వి మీఁద.

(తెరలో) గీ. ఆహ వారణ్యమునఁ బ్రతాపాగ్ని వరల
నరిమృగావళిఁ జీల్చి చెండాడి యిపుడె
విధివశంవదుఁడై రణ పృథివి గూలి
చేరె స్వర్గంబును సమరసింహ మకట.

పృథ్వి:—(విని దుఃఖముతో)గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు సమరసింహుడు కూడ కూలిపోయెను. హా! సమరసింహా! వీరశిరోమణి నన్నువిడచి నీవు కూడ నీ సోదరితో దివంగతుడవైతివా!

గీ. అస్తమించె ఢిల్లీరాజ్య శస్తకీర్తి
యస్తమించె భారత శౌర్య మవని మీద
సమర జగదేకశూర! యో సమరసింహ
యస్తమింపనిదేది! నీ వస్తమింప.

హా! సమరసింహా? నీవు లేని లోటు నాకిక తీరునా? మ్లేచ్ఛుల పాలఁబడనున్న నీ భారత రాజ్యలక్ష్మి నెవరి కప్పగించి పోయితివి?

ఛిన:—అహా! ఆర్యావర్త సాంమ్రాజ్యలక్ష్మికి దుర్దశ ప్రారంభమైనది కాబోలు. లేకున్న నొకటి తరువాత నొకటిగ నీ యుపద్రవములేమి? మహారాజా ఇట్టి సమయములందే గదా ధైర్యమూనవలయును!

సుబు:—గడియక్రింద కల్పవృక్షము లెగల గలలాడుచుండెడి సార్వభౌముడిప్పుడు మ్రోడుపగిది మిగిలెను. విధివిధాన మవిలంఘ్యముగదా?

పృథ్వీ:—అహా! ఆబాల్యమునుండియు నాకుఁ దోడునీడయై నా మేలునకై తన జీవధనంబులు ధారవోసిన యుదారశీలుండగు సమరసింహునికొరకు విచారింపనా, నన్ను మన సార వరియించి జనకు నాగ్రహము కూడ తిరస్కరించి యెల్లబంధువుల విడనాడి నానిమిత్తము పెక్కు యిడుమలబడి రణరంగమున వీరమరణంబునొందిన సంయుక్తకై దుఃఖింపనా, నాయందలి యభిమానముచే రణరంగమున మడమ తిరుగకుండ పోరాడి, వీరస్వర్గముం జూరగొనిన తదితర సామంత సేనానాయక సైనికవర్గంబునకై పరితపింపనా, ఆ తురకల బల్లెములకు గురియై తల్లడిల్లుచున్న ప్రజలకై వగవనా, తరతరంబులనుండి స్వదేశరాజులచే బరిపాలింపబడియు నిప్పుడు పరరాజుల చేతులలో పడనున్న ఆర్యావర్తమును గూర్చి పరితపింపనా! హా! ఢిల్లీరాజ్యలక్ష్మి! (క్షణమాగి) బావా! సమరసింహా!

గీ. అఖిల జన్యంబులందు జయంబు గూర్చి
నాదు కీర్తిని గావ రణమున నీల్గి
యొంటరిగ వీడి పోవంగ యుక్తమయ్య
నిలువుమిదె వచ్చుచుంటిని నిన్నుగలియ.

(అని పొడుచుకొనబోవును)

విన:—(ఆపి) మహారాజా! అది నీ వంటివానికి దగదు. దేశక్షేమము కొరకు పాటుపడి ప్రాణములు వీడిన మన యితర యోధులతో పాటు సంయుక్తాదేవియు సమరసింహుడును పలికిన చివరవాక్యములు స్మరణయందుంచుకొని, శత్రుసంహారముగావించిన గాని వారి యాత్మలకు పరమావధి యుండదు. చచ్చిన రణరంగముననే చావవలయును. మిగిలిన శత్రుసంహారము గావించి, దేశమునకు స్వాతంత్ర్యము సంపాదించి, ఆవెనుకనే యాత్మసన్యాసము గావింపవచ్చును. అదియునుగాక—

(తెరలో)

సార్వభౌమా రక్షింపుము. రక్షింపుము. సమరసింహ మహారాజు లేని కతంబున మహమ్మదీయ వాహిని పెచ్చు పెరుగుచున్నది.

పృథ్వీ:—ఆ! ఏమి? నేను జీవములతో నుండగనే? సైనికులారా! భయపడకుడు. ఇదె వచ్చుచున్నాను.(అందరు నిష్క్రమించుచున్నారు)

(తెరలేచును.)

(సంకుల సమరము. పృథ్వీరాజు పడిపోవును.)

పంచమరంగము.

---

[ఈశ్వరభట్టు కరీము-ప్రక్కను వినయశీలుడు జయచంద్రుడు ప్ర॥]

కరీ:—అరే మాకీ యేంసెయ్యాలా? యుద్ధంలో మాకీ గెల్సినాం అందుక్సేతా రాజ్యం సొబ్బి మాకీ రావాలా?

ఈశ్వ:—నాకు సగమొసంగునట్లు మీరు వాగ్దానము చేసితిరి గదా!
కరీ:—అప్డు మాట అదీ. ఇప్డు మాట యిదీ.
ఈశ్వ:—మీమాట నమ్మిననన్ను మోసముచేయుదురా? సగము రాజ్య
ము నాకు వచ్చుననియేగదా నే నింత సహాయ మొనరించితిని.?
కరీ:—అరే! నీకీ సెయ్యాక పోతే నీకీ బాబ్ నేస్తాయి. అదిగాక కాఫర్
వాలా రాజ్యంసేసేదాన్కి తాహత్ నహీ అనీ మాదీ ఖురాన్ఠీక్ సే
విన:—(రహస్యముగా) మహారాజా! వింటివా (ప్ర) ఛీ దురాత్మా?
దేశద్రోహీ? (అని ముందునకు బోవును. కరీము పారి పోవును)
జయ:—భట్టారకా! మన బలంబులు క్షీణించుటచే గోరీ వారి రాజ్య
ముతో బాటు మనది గూడ నాక్రమించినాడు. నీ కోరిక ప్రకారము-
విన:—సర్వనాశన మైనది. ఓరీ! దురాత్మా! దేశద్రోహీ! నా డా
సురంగమధ్యమున గాని, పృథ్వీరాజు సభలో నీ సంగతి మూలాం
తము గ్రహించినప్పుడుగాని నిన్ను నా కరవాలమున రెండు
ముక్కలుగా నరికిన నింత పుట్టియుండక పోవునుగదా. ఆత్మలాభ
పరాయణుడవై యీ జయచంద్రుని జేరి, వాని మనసు పాడుచేసి
దేశమున కింతటి ముప్పుదెచ్చి పెట్టితివి. ఇంకను యేమిసేయుదు
సాధుశీలయు వీరకాంతయు నగు సంయుక్తను సర్వసద్గుణగరిష్ఠ
డగు చక్రవర్తిని సకలసౌభాగ్యసంపద్విభవ యశోవిశాలయ
నార్యావర్తమును నీ పొట్టబెట్టుకొంటివిరా? నీచా! నిన్నిప్పు డే
చేయవలయునో తెలియకున్నది? చీల్చినను తంపటవైచినను పా
ము లేదురా చండాలా! (అని జుట్టుపట్టుకొనును)
ఈశ్వ:—మహానుభావా! రక్షింపుము.
విన:—ఛీ! చండాలా! ఇంకను రక్షణయా! బ్రతికి యేమి సేయవలయున
నీవు బ్రతికియున్నకొలఁదియు బ్రమాదమే. (అని పొడుచును)
ఈశ్వ:—(క్రిందపడి మరణించును)

ఈశ్వ:—నాకు సగమొసంగునట్లు మీరు వాగ్దానము చేసితిరి గదా

కరీ:—అప్పు మాట అదీ. ఇప్పు మాట యిదీ.

ఈశ్వ:—మీమాట నమ్మిననన్ను మోసము చేయుదురా? సగము రాజ్యము నాకు వచ్చుననియేగదా నే నింత సహాయ మొనరించితిని.?

కరీ:—అరే! నీకీ సెయ్యాక పోతే నీకీ బాబ్ నేస్తాయి. అదిగాక కాఫర్ వాలా రాజ్యంసేసేదాన్ని తావాత్ నహి అనీ మాదీ ఖురాన్‌తీక్ సే.

విన:—(రహస్యముగా) మహారాజా! వింటివా (ప్ర) ఛీ దురాత్మా దేశద్రోహీ? (అని ముందునకు బోవును. కరీము పారి పోవును)

జయ:—భట్టారకా! మన బలంబులు క్షీణించుటచే గోరీ వారి రాజ్యముతోబాటు మనది గూడ నాక్రమించినాడు. నీకోరిక ప్రకారము-

విన:—సర్వనాశన మైనది. ఓరీ! దురాత్మా! దేశద్రోహీ! నా డా సురంగమధ్యమున గాని, పృథ్వీరాజు సభలో నీ సంగతి మూలాంతము గ్రహించినప్పుడుగాని నిన్ను నా కరవాలమున రెండు ముక్కలుగా నరికిన నింత పుట్టియుండక పోవునుగదా. ఆత్మలాభపరాయణుడవై యీ జయచంద్రుని జేరి, వాని మనసు పాడుచేసి దేశమున కింతటి ముప్పుదెచ్చి పెట్టితివి. ఇంకను యేమి సేయుదువు? సాధుశీలయు వీరకాంతయు నగు సంయుక్తను సర్వసద్గుణగరిష్ఠుడగు చక్రవర్తిని సకలసౌభాగ్యసంపద్విభవ యశోవిశాలయనార్యావర్తమును నీ పొట్టబెట్టుకొంటివిరా? నీచా! నిన్నిప్పు డే చేయవలయునో తెలియకున్నది? చీల్చినను తంపటవైచినను పాములేదురా చండాలా! (అని జుట్టుపట్టుకొనును)

ఈశ్వ:—మహానుభావా! రక్షింపుము.

విన:—ఛీ! ఛండాలా!ఇంకను రక్షణయా! బ్రతికి యేమి సేయవలయు? నీవు బ్రతికియున్నకొలందియు బ్రమాదమే. (అని పొడుచును)

...మరణించును)

జయ:—హా! తల్లీ! సంయుక్తా! ఈ దురాత్ముని బోధన వలన-ఛీ-వీని బోధన యననేల?—నాబుద్ధి మాంద్యముచేత—నీపలుకులు విన జాలక యింత తెచ్చిపెట్టుకొంటిని. నిన్నును సకలలక్షణ లక్షితుం డగు నల్లునిఁ బొట్టఁబెట్టుకొంటిని. తల్లీ! ఆర్యావర్తమా! నేను పాడువడి నిన్నుఁ బాడుచేసితిని. రత్నగర్భవైన నిన్ను గోహంతకుల చేతులలో బెట్టి, నిర్భాగ్యశిరోమణినై భారతీయులచే నాచంద్ర తారకము దూషింపబడుదును గాబోలు—అది నాకుదగినదియే.

ఉ. ఊరక బ్రాహ్మణాధముని యుక్తుల నమ్మి రణంబుగూర్చి, యా
గోరినిఁదెచ్చి, యల్లునినిఁ గూతునుఁ జేతుల జంపి నిన్ను నా
క్రూరుల పాలొనర్చి యతి ఘోరమొనర్చిన దేశవైరి నో
భారతలక్ష్మి! బల్మిమెయి బట్టి వధింపుము! నన్ను నుగ్రతన్.

విన:—ఓయీ! మూర్ఖ జయచంద్రా! ఎందులకీ పశ్చాత్తాపము. సకల రాజ్యమును గంగలో గలిపి, వంశ మర్యాద గాపాడ దగిన వీర కాంతయగు కూతును జామాతను పొట్టబెట్టుకొని, సకల సామం తాది బంధు మిత్ర నాశనకారకుండవై, అనేక రాజవంశముల మంటగలిపి, కాక గృధ్రజంబుక సేవితమై పీనుగుపెంటయై యున్న యీ భరతఖండ మాసేతు హిమాచల పర్యంత మేకాతపత్రిగా బరి పాలింపవలయునను నాశ దీరినదా? ఈ యపనింద నామూ లాంతము దలదాల్చి చచ్చువరకును నిర్భాగ్యుడవై మనుట కంటె గత్యంతర మేమున్నది? స్వార్థలాభపరాయణుఁడై దేశద్రో హముఁ దలపెట్టిన ప్రతి నీచుని గతియు నిట్టిదే గదా! ఉభయ భ్రష్టత్వము నుపరిసన్యాసమును ఘటిల్లించినవి. ఇప్పటికైనను బూర్తిగ బశ్చాత్తాపము నొంది, మానవజాతి కంటబడకుండ, నేగిరి గహ్వరముననో దాగి బ్రతుకుము. (అని తేరిపారజూచి) ఆహా! మహారాజు నెంతలెంత మాటలనుచున్నాడను. మహారాజా!

నీ యండనుండి, చిరకాలము నీ సొమ్ము దిని, నిన్నింతలేసి మాటలనిన నా యపచారము మన్నింపుము.

జయ:—ఓయీ! వినయశీలా! ఇం దపచార మేమున్నది! నీ వాక్యములలో నసృతమే మున్నది? దేశమున కింత మహాపచారము గావించి నేనీ మొండిశరీరముతో నింకను బ్రతుకవలయునా? ఛీ! పాడుబ్రతుకు. పాడుజీవనము. అయ్యో! ఈ బ్రాహ్మణాధమునితో బాటు నన్నుఁ గూడఁ గడ తేర్పలేవా!

విన:—హరి హరీ? (అని తలవంచి చెవులు మూసికొనును)

జయ:—ఆ! దీని కింత గావలయునా? నిన్నాశ్రయించు టెందులకు! (అని పొడుచుకొని మరణించును)

విన:—(తలయెత్తి సివ్వెరపాటుతో) హా! ఎంతపనిజరిగినది. ఔను. ఇట్టివాడు బ్రదికిన నేమి. చచ్చిన నేమి. ఆహా! దేశమంతయు మ్లేచ్ఛలతో మునిగిపోవుచున్నది. పోయి పోరుదునా (పెదవి విరచి) కన్న కూతురి వలె బ్రేమించిన రాణియు పితృసమానునిగా జూచిన చక్రవర్తియు సకలరాజ చక్రంబును విడనాడిపోయిన నీ పాడు ప్రపంచకమున నిలిచి మహమ్మదీయులు తెచ్చిపెట్టు బాధల జూచుచు బ్రదుకుటకంటె చచ్చుటయే శ్రేయము. ఈ జయచంద్రుడే నాకు మార్గదర్శి. రణరంగమున నశువుల బాసిపోయిన వారి యాత్మలకు శాంతిగలుగుగాక! భారతదేశమునకు శుభము గలుఁగుగాక! హా? (అనిపొడుచుకొని పడి మరణించును.) (తెరపడును)

మంగళము.

సంపూర్ణము.

రామమోహనప్రెస్, రాజమండ్రి:—1936.